సాహిత్య

# ప్రస్థానం

జూన్ - 2008

వెల రూ. 10




సాహితీ స్రవంతి



ఫొటో : గుడిపూడి విజయరావు

సాహిత్య
ప్రస్థానం
జూన్, 2008
సంపుటి : 6 సంచిక : 32

# రచయితలు, రచనలు

ప్రస్థానంలో మార్పుల గురించి సమాలోచనలు సాగుతున్నాయి. ఇప్పుడు పత్రికకు ఆదరణ ఆనందం కలిగిస్తున్నా మరింత సమగ్రంగా వైవిధ్యంగా తయారు కావలసిన అవసరముంది. ముఖ్యంగా కథలు మరింత పదునెక్కాలి. వస్తున్న కథలు, కవితలు పరిశీలిస్తున్నప్పుడు ఎక్కువ మంది మధ్య తరగతి ఉద్యోగాలకు సంబంధించిన అంశాలపై స్పందిస్తున్నంతగా వాస్తవ పర స్థితుల పరిణామాల పరిశీలన చేయడం లేదని పిస్తుంది. ఉదాహరణకు ఈ సంచికకు అందిన మూడు కథలూ ఇంచుమించు తలిదండ్రులు పిల్లల సంబంధాలపైనే వున్నాయి. వాటిలో రెండు ప్రచురించాం. సాహిత్య కారులు ప్రచారం, గుర్తింపు, కోరుకోవడంలో తప్పు లేదు గాని కొంతమంది దాన్నే ప్రధానాంశంగా తీసుకోవడం మంచిది కాదు. సన్మానాలూ సత్కారాలే సాహితీ విలువలకు కొలబద్దలు కావు. ఈ క్రమంలో సాహిత్య రంగాన్ని ప్రజా సంబంధాల కోణానికే పరిమితం చేయడం పలు దుష్పరిణామాలకు దారి తీస్తుంది. సామూహిక స్థాయిలో చూసినప్పుడు సాహితీ మిత్రులు లౌకిక ప్రజాస్వామిక విలువలకూ సామ్రాజ్యవాద వ్యతిరేకతకూ పెద్దపీట వేస్తున్నారు. దాన్ని తమ సాహితీ సృజన సూత్రంగా మల్చుకుని సామాజిక స్రవంతిలో సజీవ భాగస్వాములైతే ఇలాటి పరిమితులను అధిగమించి అక్షర శిఖరాలు అధిరోహించవచ్చు.

.. .. ..

సామాజిక జీవితంలో భద్రతా రాహిత్యం తాండవిస్తోంది. విద్యల కోసం విదేశాలకు వెళ్లిన చిన్నారులు, నవ యువకుల జీవితాలు విషాదాంతమవుతున్నాయి. అల్లం రాజయ్య కుమారుడు కిరణ్ కుమార్ దారుణ హత్యలో నిందితులు ఇప్పుడే పట్టుబడ్డారంటున్నారు. ఇంతలోనే లండన్‌లో జ్యోతి మరో విధంగా బలైంది. ఇందుకు తక్షణ కారణాలను చూడటంతో పాటు వేళ్లూనుకుంటున్న విధ్వంసక వినాశకర సంస్కృతిని విశ్లేషించుకోవడం అవసరం.

.. .. ..

ఇతరత్రానూ అసహనం పెరిగిపోతున్నది. ఆంధ్రజ్యోతి పత్రికపై ఘోరమైన దాడి పత్రికా స్వాతంత్రంపైన పెద్ద సవాలు విసిరింది. ఎన్ని లోపాలు పరిమితులు వున్నా మన ప్రజాస్వామ్యానికి ప్రాణాధారంగా వున్న మీడియాపైన ఇలాటి దాడులు దౌర్జన్యాలు సహించరానివి. పైగా ఈ పని ఒక సామాజిక తరగతుల పేరుతో జరగడం మరింత విచారకరం. శివసేన బాల్ థాకరేలు లేదా కరుడు గట్టిన దురహంకారులకు ఇవన్నీ రివాజు కావచ్చు గాని పీడిత ప్రజల ప్రజాస్వామిక విలువలతో ఇవి పొసిగేవి కావు.

ముఖచిత్రం : శ్రీశ్రీ (జూన్ 15 శ్రీశ్రీ వర్ధంతి) చిత్రకారుడు : కె. ఆనందాచారి
కథల బొమ్మలు : శివాజీ

## ఈ సంచికలో...


| | |
|---|---|
| కావలసినవారు (కథ) | 2 |
| సౌందర్యము - అభిరుచి | 5 |
| కవితలు | 7 |
| పెన్నేటి పాట | 8 |
| ద్వా.నా. శాస్త్రి రచనలు : భాషా వికాసం | 13 |
| 'ఆధునిక తెలుగు కథ' కడప కథకులు | 15 |
| ఖమ్మం కథాసుధ | 20 |
| బాలల ప్రపంచంలోకి... | 21 |
| కవితలు | 24 |
| అమ్మకో ఉత్తరం (కథ) | 25 |
| కవితలు | 29 |
| తెలుగు తమిళ లాలి పాటల్లో ఉయ్యాల | 30 |
| కవితలు | 34 |
| అంతరాలపై అక్షర మథనం 'జనకవనం' | 35 |
| కవితలు | 37 |
| గుంటూరులో శతాధిక మహిళా కవితా స్వరాలు | 38 |
| కవితలు | 40 |
| 'గులాంగిరీ' ఒక పరిశీలన | 41 |
| డైరీ | 43 |
| స్వీకారం | 48 |


సంపాదకవర్గం
తెలకపల్లి రవి (సంపాదకుడు)
కె.ఆనందాచారి
ఎ.సత్యభాస్కర్
వీరప్రసాద్
ఎం.నరహరి
కె. లక్ష్మయ్య, మేనేజర్

చిరునామా
సాహిత్య ప్రస్థానం
1-1-187/1/2,
వివేక్‌నగర్, చిక్కడపల్లి,
హైదరాబాద్-500 020
ఫోన్లు : 27660013, 27635136

# కావలసినవారు



**ఏప్రిల్ నెల ప్రొద్దున పది గంటలకే ఎండ చుర చుర మంటోంది. "ఇదిగో దమయంతీ త్వరగా కానీ... టైము చాలా అయింది. ఆలస్యంగా వెళ్తే అక్కడ జనం పెరిగిపోయి వచ్చేటప్పుడు ఎండన పడతాం.." ఆస్పత్రికి వెళ్ళడానికి భార్యను తొందరపెట్టాడు కేశవరావు.**

**కోపూరి పుష్పాదేవి**

**ప**నంతా అయిపోయిందండీ..., "కానీ ఈ గ్యాస్ సిలిండర్ గురించే మనం ఇంటికి తాళం వేసుకు వెళ్ళిపోయాక గ్యాసు అబ్బాయి వచ్చి వెళ్ళిపోతాడేమోనని భయం. గాలిలేకపోయినా బతకగలం గానీ, గ్యాసు లేకపోతే బతకలేం అన్నట్లు తయారయ్యాం కదా..." అన్నది దమయంతి.

ఆ సిలిండర్ కోసం అంత బెంగ ఎందుకే.. ఆ ఖాళీ సిలిండరూ, డబ్బూ పక్కింటి పారిజాతం గారికి ఇవ్వు. డెలివరీ బాయ్ వచ్చినప్పుడు ఆమె తీసుకుంటారు అన్నాడు కేశవరావు. "నేను కాబట్టి సమస్యను ఇంత తేలికగా పరిష్కరించేశాను చూడు" అన్నట్లు.

అయ్యో సంబడం... "ఆమె ఇంట్లో ఎందుకుంటుందీ..., వెయ్యిగుళ్ళ పూజారి. పాతికేళ్ళనాడు వీళ్ళ పక్కన అద్దెకు ఉండి వెళ్ళిపోయినవాళ్ళు కెవరికో ఒంట్లో బాగుండలేదట...చూడటానికి వెళ్ళింది. పనీపాటా లేకపోతే సరి.." ఈసడించింది దమయంతి.

"నిన్ననేమో చివరింటి మీనాక్షమ్మగారి తోడికోడలి మేనమామ కూతురికి బావుండలేదని వెళ్ళిందన్నావు.. అవునూ తెగ తిరుగుతూ ఉంటుందీ, ఇలా తిరగడానికి ఈమెకు డబ్బెలా వస్తుందే..." తాళం చేతుల కోసం వెతుకుతూ అడిగాడు కేశవరావు.

"ఆఁ ఏముందీ..., ఆ కొడుకెక్కడో మిలటరీలో ఉన్నాడు. తనా ఒంటికాయ శొంఠికొమ్ము తనకు చీరలూ సారలూ అఖ్ఖర్లేదు, నగలూ నాణ్యాలూ అంతకన్నా అవసరం లేదు. గుప్పెడు గింజలు ఉడకేసుకుంటుంది. కూరా నారా లేకపోయినా ఏ పచ్చడి తోనో సరిపెట్టుకుంటుంది. పెన్షన్ వస్తుంది గదా.. ఇలా తిరుగుతూ ఉంటుంది. సరేలే పదండి.. గ్యాసు సంగతి రేపు చూసుకోవచ్చు, అసలే మీకు గుండెల్లో బరువుగా ఉందన్నారు కూడాను" అంటూ వీధిలో ఖాళీ ఆటో వెళ్తుంటే పిల్చింది దమయంతి.

కేశవరావు గారు జిల్లా పరిషత్ హైస్కూల్లో హెడ్ మాష్టరుగా పనిచేసి రిటయిర్ అయ్యారు. మంచి గొప్ప కథకుడు కూడా. వాళ్ళకు ఒక్కడే కొడుకు చంద్రశేఖర్. ఆకాశవాణిలో ఇంజనీయరు. అతనికి ఒకపాప. వాళ్ళింటికీ వీళ్ళింటికీ ఐదారు కిలోమీటర్ల దూరం ఉంటుంది. చంద్రశేఖర్ ప్రమోషన్ మీద వేరే ఊరు వెళ్తానంటే కేశవరావుగారు వెళ్ళనీయడం లేదు వృద్ధాప్య భయం వల్ల.

పారిజాతంగారికీ అరవయ్యో, అరవయ్యయిదో ఏళ్ళుంటాయి. అయినా అంతవయసు దానిలా కనబడదు. షుగరు, బీపీలు ఏమీలేవు. 'ఎవరికి ఏ అవసరం వచ్చినా అన్నిటికీ నేనున్నాను" అన్నట్లు చురుకుగా హుషారుగా తిరుగుతూ ఉంటుంది. ఆమెభర్త కూడా మిలటరీలోనే పనిచేసేవాడు. శ్రీలంకకు వెళ్ళిన శాంతి సేవలో పాల్గొని అక్కడ చనిపోయాడు. అయినా కొడుకునీ సైన్యంలోకే పంపింది.

---

అప్పుడప్పుడే తెల్లవారబోతుంది. తల్లి కొంగు చాటునుంచీ దోబూచులాడే అల్లరి పిల్లవాడిలాగా సూర్యుడు మబ్బుల వెనక నుండి తొంగి చూస్తున్నాడు.

"ఇదిగో పారిజాతం, పంపు వచ్చింది. మంచి నీళ్ళు పట్టుకుంటావా.., అన్నట్లు ఈ వేళ ఎక్కడికి వెళ్తున్నావు?" అడిగింది దమయంతి బిందెకడిగి పంపు కింద పెడ్తూ.



చివరింటి సుబ్బారావుగారి పెద్దమ్మాయికి అబ్బాయి పుట్టాడుగా వదినా, ఆ అమ్మాయికి పెద్దాపరేషను చేశారు. ఇవాళ్టికి ఎనిమిది, రేపు కుట్లు విప్పి ఇంటికి పంపుతారట... ఈ రెండు రోజులు కూడా సాయానికి రమ్మంటేనూ..."

"అవునూ..., అప్పుడు వాళ్ళు ఇల్లు కట్టించుకుంటుంటే మూడు నెలలపాటు వాళ్ళ కొత్తంటికి కుక్క కాపలా కాశావు. చివరికి ఏదో చిన్న సిమెంటు మూట పోయిందని నిన్ను దుమ్మెత్తిపోశారు. వాళ్ళమ్మాయేనా ఇప్పుడు ప్రసవమయింది...?"

"పోనీలే వదినా..., ఆ మూట దొరికాక వాళ్లు చాలా బాధపడ్డారు. నన్ను అనవసరంగా మాటలన్నందుకు..., ఇప్పుడు ఇంట్లో ఊరికే కూచుని ఏం చేస్తాను చెప్పు.."

"నీ ఓపిక్కి చెప్పుకోవాలమ్మా..." నీళ్ళ బిందెతో ఇంట్లోకి వెళ్ళిపోయింది దమయంతి.

---

రెండురోజుల్లో ఉగాది పండుగ రాబోతుంది. దమయంతి పనిమనిషి చేత బూజులు దులిపించి, ఇల్లు కడిగించింది. ముగ్గులు పెట్టింది. "ఇదిగో దమయంతీ పండక్కి అబ్బాయి మనల్ని వాళ్ళింటికి పిలుస్తాడంటావా...?" అడిగాడు కేశవరావు వాలుకుర్చీలో చేరబడి ఆయనకు మనుమరాలంటే ప్రాణం. ఈ వంకతోనన్నా ఆ పాపతో రెండు రోజులు ఆడుకోవచ్చని ఆయన ఆశ.

"ఏమో.. అబ్బాయికి పిలవాలని ఉన్నా ఆవిడగారు పడినివ్వద్దూ" దీర్ఘం తీసింది దమయంతి.

"పోనీ, మనం పిలుద్దాం. అందరం కలిసి పండుగ మన ఇంట్లో సరదాగా చేసుకోవచ్చు. ఏమంటావు..?"

"మనం పిల్చినా కోడలు వస్తుందని నమ్మకం లేదు. ఏదో ఒక వంక పెడ్తుంది. పోనీ పిల్చి చూడండి.. మీ మాట నేనెందుకు కాదనాలి..?" అంటూ సెల్‌ఫోన్ తెచ్చి భర్త చేతికిచ్చింది దమయంతి.

ఫోనులో మామగారి అభ్యర్థన విన్న కోడలు "మా అమ్మా వాళ్ళూ మమ్మల్ని పండక్కు పిలిచారు. పోనీ నేను పాపను తీసుకుని మా పుట్టింటికి వెళ్తాను. మీ అబ్బాయి మీ ఇంటికి వస్తారులెండి..." అంది. ఆ జవాబు విన్న కేశవరావు సెల్ ఆఫ్ చెయ్యటం కూడా మరిచిపోయి శిలాప్రతిమ అయ్యాడు.

---

ఆ రోజు ఎదురింటి గోపాలరావుగారి అమ్మాయికి మెచ్యూర్ ఫంక్షను. ఇక పారిజాతమ్మకు క్షణం తీరికలేదు. వంటల దగ్గరా ఆమే, వడ్డింపుల దగ్గరా ఆమే..., మంచినీళ్ళు మొయ్యటం ఆమే, మండపం అలకరించటం ఆమే...! కార్యక్రమం అంతా ఫోటోలతో, వీడియోతో సందడి సందడిగా సాగుతోంది. మధ్యాహ్నం నాలుగయింది. అందరి భోజనాలూ అయిపోవస్తున్నాయి. పారిజాతమ్మకు ఉన్నట్లుండి కళ్ళు తిరిగాయి. కడుపులో తిప్పినట్లయింది. గబగబా తనింట్లోకి వచ్చి చాప పరచుకుని పడుకుంది. పారిజాతమ్మ వచ్చి పడుకోవటం చూసిన దమయంతి, ఏమిటి పారిజాతం ఈ టైములో పడుకున్నావు" అని అడిగింది.

"ఏమిటో వదినా, కళ్ళు తిరుగుతున్నాయి... కడుపులో తిప్పుతోంది" అన్నది పారిజాతమ్మ మెలికలు తిరిగిపోతూ.

"ప్రొద్దుటి నుండీ ఏమైనా తిన్నావా అసలు...?" అంటూ ఆమె నుదుటి మీద చెయ్యి పెట్టి చూసింది దమయంతి. "అయ్యో... ఒళ్ళు కూడా కాలిపోతుంది" అన్నది.

''ఏదో పని హడావుడిలో పడి ఏమీ తినలేదొదినా"

"అదీ సంగతి.." "ఊళ్ళో పెళ్ళికి కుక్కల హడావుడి అన్నట్లు" మనసులో అనుకుంటూ, ఇప్పుడే వస్తానుండు, అని తన ఇంట్లోకి వెళ్ళిన దమయంతి ఒక గ్లాసుడు హార్లిక్స్ కలిపి, ఒక క్రోసిన్ మాత్రతో పారిజాతమ్మ దగ్గరకు వచ్చింది.

"ఇదిగో పారిజాతం, ఈ మాత్ర వేసుకుని, హార్లిక్స్ తాగు. ఒక అరగంటలో అన్నీ సర్దుకుంటాయి" అన్నది.

బుద్ధిమంతురాలయిన విద్యార్థినిలా చెప్పినట్లు చేసింది పారిజాతమ్మ. ఒక గంట పోయాక, ఆమెకు ఎలా ఉందో చూద్దామని మళ్ళీ వచ్చింది దమయంతి.

అప్పటికి పారిజాతమ్మ లేచి ఇల్లు చిమ్ముకుంటోంది. మొహం తేట బడింది. "రావదినా కూర్చో..., ఇప్పుడు కళ్ళు తిరగటం తగ్గింది. తేలిగ్గా ఉంది" అన్నది చీపిరి మూలన పెట్టి చేతులు కడుక్కుంటూ.

"పారిజాతం.. నిన్నొకటడుగుతాను. ఏమీ అనుకోవుగా..." అన్నది దమయంతి కుర్చీలో కూర్చుంటూ.

"అదేం మాట వదినా..., నేనేం అనుకుంటాను? అడుగు"

"ఏమీ లేదు పారిజాతం... ప్రొద్దుటి నుండి వాళ్ళకు అంత చాకిరీ చేశావు గదా.., కనీసం నువ్వు భోజనం చేశావో లేదోనని కూడా

చూడలేదు వాళ్ళు. హఠాత్తుగా వచ్చేస్తే ఎందుకు వెళ్ళిపోయిందోనని కూడా ఆలోచించలేదు. ఇటువంటి వాళ్ళకోసం ఎందుకు హైరానా పడతావు... ఎందుకు ఒళ్ళు గుల్ల చేసుకుంటావు... ఇలా చేస్తే నీకేం ఒరుగుతుంది చెప్పు... కనీసం కృతజ్ఞతలు కూడా చెప్పరు వాళ్ళు.."

"ఏమో వదినా అవన్నీ ఆలోచించను నేను. కానీ, తోచినట్లు నాకు చేతనయినంత సాయం ఎవరికయినా చెయ్యాలని నా మనసు ఆరాటపడుతూ ఉంటుంది. అందులోనూ నా కష్టార్జితం ఎవరికీ ధారపొయ్యడం లేదు కదా..., ఏదో మాట సాయం, చేతిసాయం అంతేకదా.." అన్నది పారిజాతమ్మ తేలిగ్గా నవ్వుతూ.

"సరేనమ్మా... నీ ఓపిక... నీ ఇష్టం. కానీ, నీకూ దగ్గర దగ్గర డెబ్బయ్యేళ్ళు వస్తున్నయ్యనుకుంటా... నీ ఆరోగ్యం కూడా కాస్త చూసుకో..." అన్నది దమయంతి లేచివెళ్తూ.

''అలాగే వదినా, అయినా తల్లి తోడువంటి ఇరుగుపొరుగు మీరుండగా నాకేమిటి భయం...?" అన్నది పారిజాతమ్మ దమయంతి చేతిని ఆప్యాయంగా పట్టుకుని.

---

తనకు సాహిత్య అకాడమీ అవార్డు వచ్చినట్లు కేశవరావు గారికి అప్పుడే వార్త తెలిసింది. ఆనందంతో ఆయనకు గుండె ఆగుతుందేమో నన్నంతగా సంబరం కలిగింది. వెంటనే ఈ వార్త పదిమందికీ చెప్పాలని ఉబలాటపడ్డాడు. భార్యకు చెప్పబోయాడు. కానీ, ఆమెకు మొదటి నుండీ కథలంటే విసుగు. అవార్డు విలువ ఆమెకు తెలియదు. కొడుక్కి ఫోన్ చేసి చెప్దామనుకున్నాడు. అతను అదో రకం తన సుఖం, సంతోషం తప్ప, ప్రపంచం ఎలాపోయినా అతను పట్టించుకోడు. ఇక కోడలు సరేసరి...! తన అవార్డు విషయం విని నిజంగా ఆనందించే ఆప్త మిత్రులూ, ఆత్మబంధువులూ ఎవరూ కనబడలేదు ఆయనకి.



కేశవరావుగారికి హఠాత్తుగా నీరసం వచ్చింది. అవార్డు వచ్చిన ఆనందం ఆవిరయిపోయింది. ఉసూరు మంటూ కుర్చీలో కూలబడ్డాడు.

మరునాడు ప్రొద్దున ఎనిమిదయినా ఇంట్లో నుండి బయటకు రాలేదు పారిజాతమ్మ. ఒంట్లో బాగుండక పడుకుందేమోనని కాసేపు అనుకున్నా, మనసాగక ఆమె ఇంట్లోకి వెళ్ళిన దమయంతికి నిర్జీవంగా మంచం మీద పడి ఉన్న పారిజాతమ్మ కనిపించింది.

"ఓరి భగవంతుడా..., కొంప ముంచావు గదయ్యా..." దమయంతి లబలబ లాడుతూ భర్తనూ, ఇరుగు పొరుగు వారినీ పిలుచుకు వచ్చింది. "అయ్యో... అయ్యో" అనుకుంటూ అందరూ వచ్చి చూశారు. "ప్రాణం పోయి కూడా చాలాసేపయి ఉంటుంది." అనుకున్నారు. ఎవరో వీధి చివరి ఇంట్లో ఉంటున్న డాక్టరు గారిని పిలుచుకు వచ్చారు. ఆయనా అదే చెప్పాడు. "హార్ట్ ఎరెస్ట్ జరిగి చనిపోయి ఉంటుంది" అన్నాడు. "ఇంతకు ముందు ఎప్పుడూ ఆమె చిన్న అనారోగ్యం బారిన కూడా పడలేదు. అనాయాస మరణం పొందింది. ఎంత అదృష్టవంతురాలు...!" అందరూ అదేమాట.

పారిజాతమ్మ బంధువులెవరో, వాళ్ళెక్కడుంటారో ఎవరికీ తెలియదు. ఆమె కొడుక్కి ఫోను చేద్దామని చూస్తే, ఇల్లంతా వెతికినా ఆ అబ్బాయి అడ్రసుకానీ, ఫోను నెంబరు కానీ దొరకలేదు. "మా అబ్బాయి ఫలాని ఊళ్ళో ఉంటాడని" ఆమె ఎప్పుడూ ఎవరితోనూ అనలేదు. అతను సంవత్సరానికి ఒకసారీ, రెండేళ్ళకు ఒకసారో వచ్చి త్వరగా వెళ్ళిపోయేవాడు. ఇంకా పెళ్ళి కూడా చేసుకోలేదు.

"ఏం చెయ్యాలి...? ఇప్పుడు ఏం చెయ్యాలి...?" అందరూ మల్లగుల్లాలు పడుతున్నారు. "ఏం చేసేదేమిటి..? ఆమె మనకందరికీ కన్నతల్లిలా సేవ చేసింది. మనమూ కన్నబిడ్డల్లా చేద్దాం. తలకొరివి పెట్టడానికి నేను సిద్ధం..." అన్నాడు ఒక యువకుడు. మరో ఇద్దరు ముగ్గురు అతణ్ణి సమర్థించారు.

వార్త పేటంతా తెలిసిపోయింది. వీధి పట్టని జనం. అందరి కళ్ళూ మందారాలవుతున్నాయి. అందరూ ఆమె మంచితనం గురించి చెప్పుకునేవారే, మాకు ఇలా చేసిందంటే మాకు అలా చేసిందని..." పారిజాతమ్మని దండలతో నింపేశారు. ఆ దండల్లో పూలకు బదులు వారి మనసులే కన్పించాయి కేశవరావు గారికి. ఆమె చివరి ప్రయాణానికి బ్రహ్మాండమైన వాహనాన్ని ఏర్పాటు చేశారు. బాజాలు, భజంత్రీలతో వందలమంది శ్మశానానికి దారిపట్టారు.

"కన్నబిడ్డలు కూడా చెయ్యలేనంత వైభవంగా కావలసిన వారందరూ కలసి కడసారిగా కన్నీళ్ళతో ఆమెను సాగనంపారు. నిజంగా ఆమె ధన్యజీవి." అనుకున్న కేశవరావు అప్పుడు మనస్ఫూర్తిగా ఆమెకు నమస్కారం చేశాడు.

★



## చీకటి

**డా॥ సి. భవానీదేవి**

చుట్టూ కాటుక కురుస్తోంది...
చీకటిలా...
దయలేని మనసులా!
ఏమీ కనిపించదు
ఎక్కడ్నుంచో సన్నని దీపం వెలుగు
నాలోంచే!
ఆ మసక వెల్తురులో నడిచీ... నడిచీ
అలసటగా ఆగిపోయి
ఒక్కసారి వెనక్కి తిరిగి చూశాను

పూలకంటే ముళ్ళే ఎక్కువ
గతుకుల గాయాల దారి
రేపటి రస్తా కోసం
నిరంతరం వెతుకులాటే

చీకటి ఇంకా కురుస్తూనే వుంది
ఇప్పుడు నాకన్పిస్తుంది
బతుకంతా నీడలా అనుసరించిన నేస్తం
చీకటేనని...
అది ఇచ్చిన ఆసరాతోనే
నేనింకా మిగిలానని
నాలోని వెలుగు కిరణంతో
ఇంకా మిగిలే ఉన్నానని

## అధ్యయనం

# సౌందర్యము - అభిరుచి



**తాజ్‌మహల్ సుందరమైనది. అందరు ఆ నిర్మాణంలోని భౌతిక సౌందర్యాన్ని చూస్తారు. నిర్మాణశిల్పం కారణంగా అక్కడి సౌందర్యం విశ్వజనీనమయింది. అయినా శ్రీశ్రీకి ఆ నిర్మాణ సంబంధమైన భౌతిక సౌందర్యం పట్ల కాక, ఆ నిర్మాణానికి రాళ్లెత్తిన కూలీల శ్రమ శక్తి పట్ల అభిరుచి ఏర్పడింది. ఆ అభిరుచి కారణంగానే శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది లేనే లేదని గొంతెత్తి ఘోషించాడు. ఇందువల్ల కళాతత్వ శాస్త్రమనేది అభిరుచి, సౌందర్యం అనే రెండు విషయాలకు సంబంధించినదని తెలుస్తుంది. అంతేకాని అభిరుచి, సౌందర్యం రెండూ ఒకటి కావు.**

**డా॥ యు.ఎ. నరసింహమూర్తి**

అలెగ్జాండర్ గోట్లిబ్ బౌమ్‌గార్టెన్ 1750లో 'ఈస్థటికా' అనే పేరుతో ఒక గ్రంథాన్ని రాశాడు. సౌందర్యాభిరుచిని గూర్చి రాసిన ఈ గ్రంథం ఒక తత్వ శాస్త్ర గ్రంథంగా పరిగణన పొందింది. క్రమంగా 'ఈస్థటిక్' అనే పదం సౌందర్య సంబంధమైన, అభిరుచి గతమైన విలువల మూల్యాంకనం చేసే విమర్శ పరిభాషగా స్థిరపడింది. లలిత కళల సౌందర్యతత్వాన్ని అన్వేషించే సౌందర్యారాధకులు ఈ శాఖకు చెందిన తాత్వికులుగా పరిగణన పొందారు. కళాత్మక విషయాలలో అభిరుచి (Taste) ఒక పారిభాషిక పదంగా 17వ శతాబ్దాంతానికి పరిగణనలోకి వచ్చింది. జోసెఫ్ ఎడిసన్ తన 'స్పెక్టేటర్ (Spectator) వ్యాసాలలో ఈ అభిరుచి ఆత్మకు సంబంధించిన విషయమని, ఇది ఆనంద పరవశుడైన రచయిత సృష్టించే సౌందర్యం నుండి అవతరిస్తుందని, అయిష్టత అనేది అసమగ్రమైన ఆత్మానుభవం కారణంగా వెలువడుతుందని చెప్పాడు. ఈ అభిరుచి అనే పరిభాష 18వ శతాబ్దంలో కళాతత్వ శాస్త్ర పరిభాషగా స్థిరపడింది. ముఖ్యంగా తత్వశాస్త్రంలోను, కళాతత్వశాస్త్రంలోను భీతావహమైన జ్ఞానేంద్రియ చైతన్యం విషయంలో ఇది ప్రసక్తమయింది. చైతన్యగతమైన శక్తులను గతానికి చెందిన మానవాతీత ప్రకృతి శక్తులకు, బుద్ధికి, జ్ఞానేంద్రియ చైతన్యానికి మధ్య నుండే వారధిగా కాలరిడ్జ్ దీనిని గుర్తించాడు. గతం చేత ఆవరింపబడిన ప్రకృతి శక్తులు జ్ఞానేంద్రియ చైతన్యం కారణంగా ఏర్పడిన భావ ప్రతిమలను ప్రకృతానికి, మేధకు అందేలా వికసింప చేయడమే ఈ అభిరుచి వ్యాపారమని కాలరిడ్జ్ వివరించాడు. అభిరుచి అనేది ప్రతి వ్యక్తిలోను అపరిపక్వ స్థితిలోనైనా ఉంటుంది. అభిరుచి ఆత్మాశ్రయమైనది. అయినా అది విశ్వజనీనమైనపుడే దానికొక విలువ ఏర్పడుతుంది.



తాజ్‌మహల్ సుందరమైనది. అందరు ఆ నిర్మాణంలోని భౌతిక సౌందర్యాన్ని చూస్తారు. నిర్మాణశిల్పం కారణంగా అక్కడి సౌందర్యం విశ్వజనీనమయింది. అయినా శ్రీశ్రీకి ఆ నిర్మాణ సంబంధమైన భౌతిక సౌందర్యం పట్ల కాక, ఆ నిర్మాణానికి రాళ్లెత్తిన కూలీల శ్రమ శక్తి పట్ల అభిరుచి ఏర్పడింది. ఆ అభిరుచి కారణంగానే శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది లేనే లేదని గొంతెత్తి ఘోషించాడు. ఇందువల్ల కళాతత్వ శాస్త్రమనేది అభిరుచి, సౌందర్యం అనే రెండు విషయాలకు సంబంధించినదని తెలుస్తుంది. అంతేకాని అభిరుచి, సౌందర్యం రెండూ ఒకటి కావు. ఈ అంశాన్ని నిరూపించడానికి మరికొంత వివరణ అవసరం. శ్రీశ్రీ తన అభిరుచికి ఒక సిద్ధాంత రూపాన్ని ఇచ్చిన తరువాత అంతవరకు తాజ్‌మహల్ భౌతిక సౌందర్యం పట్ల ఆకర్షితులైన కళారాధకుల అభిరుచి మార్గంలో ఒక కొత్త పరిణామమేర్పడి వారి సౌందర్య దర్శనంలో కూడా మార్పు ఏర్పడవచ్చును. అప్పుడు తాజ్‌మహల్ అందం కంటే శ్రమైక జీవన సౌందర్యం ఇనుమడించినట్లుగా కనిపిస్తుంది.

భారతీయ దార్శనికులు సౌందర్యానికీ, అభిరుచికీ గల సంబంధాన్ని స్థాపించారు.

సౌందర్య సృష్టిలో కవి అభిరుచికుండే పాత్ర ఎటువంటిదో ఆనందవర్ధనుడు చెప్పాడు. కవి శృంగారి అయినట్లయితే కావ్యంలో రసమయ జగత్తు అవతరిస్తుంది. అతడు విరక్తుడైతే కావ్యం నీరసమవుతుంది. కవి హృదయంలోని భావానికి ఇక్కడ ప్రాధాన్యత కనిపిస్తుంది. శృంగారి అంటే విషయ లంపటుడు కాదని విభావానుభావ వ్యభిచారుల చర్వణా రూపమైన ప్రతీతితో నిండినవాడు అని, శృఙ్గార పదం ఉపలక్షణ చేత ఇతర రసాలను కూడా గ్రహిస్తుంది అని అభినవ గుప్తుడు తన లోచన వ్యాఖ్యలో వివరించాడు. 'శృఙ్గారీ' అనగా రసావేశం కలవాడని అర్థం. ప్రత్యక్షంగా కనబడే ఈ పదార్థ జాతం లౌకికాలైన సుఖ-దుఃఖ-మోహాల మధ్య ఉండటాన్ని మాత్రమే ఇస్తున్నా

కవి రసికుడు కానంతవరకు అలాంటి కవి యొక్క వర్ణనలో ప్రవేశించనంత వరకు లోకాతిక్రాంత (అలౌకిక) రసాస్వాద భూమిని అధిష్టించజాలదు అని అర్ధం. అనగా రసికుడైన కవి తన వర్ణన ద్వారా సర్వ సాధారణమైన పదార్థ జాలాన్ని కూడా అలౌకిక రసాస్వాద స్థానంగా చేస్తాడు అని అర్ధం. అని పుల్లెల శ్రీరామచంద్రుడు గారు వివరించారు.

కళాతత్వ వివేచన చేసిన ఆధునికులైన పాశ్చాత్యులలో ప్రధమ గణ్యుడైన ఇమ్మాన్యూల్ కాంట్ అభిరుచి – సౌందర్యాల పరస్పర సంబంధాన్ని గూర్చి నిశితంగా పరిశీలించాడు. సౌందర్యం వస్తుగతమైనదా? కళాకారుడు తన దర్శనానికి అనుగుణమైన తీర్పును వెలువరించిన తరువాత ఒక వస్తువు సుందరంగా కనిపిస్తుందా? అని కాంట్ ఆలోచించేడు. కళాసంబంధమైన తీర్పు అభిరుచిపై ఆధారపడి వుంటుందని, అది వస్తువుకు సంబంధించిన ఆకృతిపై ఆధారపడి వుంటుందని ఆయన నిర్ణయించాడు. దీనిని బట్టి వస్తువులోని సౌందర్యమంతా రూపంలో ఉంటుందని, ఆ రూపమే సహృదయులకు అభిరుచిని కలిగిస్తుందని ఆయన ఎంచినట్లు భావించాలి. దీనిని బట్టి అభిరుచి, సౌందర్యం అనే రెండూ పరస్పర సంబంధం గల విషయాలే గానీ ఒకటి కావని కాంట్ తలచినట్లు స్పష్టపడుతుంది. "Taste is the faculty of estimating an object or a mode of representation by means of a delight or aversion apart from any interest, the object of such a delight is called beautiful" అన్న కాంట్ మాటలు ఆయున అభిప్రాయం ఆనందవర్ధమని అభిప్రాయంతో ఎలా ఏకీభవిస్తుందో తెలియజేస్తాయి. అభిరుచి ఒక వస్తువు లేదా భావంలోని విలువను నిర్ణయిస్తుంది. ఆ విలువ కారణంగా కళాకారుడికి ఆ వస్తువు లేదా


— — — — * * * — — — —

కళ మనస్సులో దాగిన మర్మాలనన్నింటినీ వెల్లడిస్తుంది. కళాకారుడు రెండు రకాలుగా దానిని ఆవిష్కరిస్తాడు. అందులో ఒకటి కేవలం కళాత్మకమైన అభిరుచి, రెండవది తన బుద్ధి మార్గాన్ని అనుసరించిన అభిరుచి.

— — — — * * * — — — —


భావం పట్ల సుముఖత గానీ, విముఖత గానీ కలుగుతుంది. ఈ వైఖరిలో పక్షపాత ముండదు. అభిరుచి కారణంగా ఏర్పడిన విలువ ఆనందాన్ని కలిగించినప్పుడు ఆ వస్తువు లేదా భావంలో సౌందర్యం కని పిస్తుంది. ఈ వివేచన ఫలితంగా ఆనంద వర్ధనుడు, కాంట్ ఆలోచనలలో ఒక సంవాదంతో పాటు స్వల్ప విరోధం కూడా ఏర్పడినట్లు మనం గమనించవచ్చును. కవి అభిరుచిని బట్టి కావ్యం సుందరంగా గానీ నీరసంగా గానీ ఉంటుందని ఆనందవర్ధనుడు అన్నాడు. ఇక్కడ అభిరుచి సౌందర్యకారక మవుతోంది. కాంట్ సౌందర్యం వస్తు సంబంధమైన రూపంలో ఉంటుందన్నాడు. కళాకారుని అభిరుచి దానికి విలువ కడు తుందని చెప్పాడు. అంటే ఆయన మతంలో సౌందర్యం అభిరుచి కారక మవుతోంది.

అభిరుచికి సర్వ సామాన్య ప్రమాణాలు, వ్యక్తిగత ప్రమాణాలు వేరు వేరుగా ఉంటాయి. ఒక వ్యక్తి జ్ఞానేంద్రియ గ్రహణ శక్తి ఆధారంగా వెలువడ్డవి నిరాపేక్ష మైనవి. సర్వసామాన్యమైన బుద్ధి ప్రమాణం ఆధారంగా వెలువడే తీర్పులు సాపేక్షమైనవి. ఇంకో రకంగా చెప్పాలంటే అంతఃకరణ ప్రమాణములు లోక ప్రమాణములు. అభిరుచిగతమైన ఈ భేదం ఆధారంగానే సౌందర్యం ఇదమిద్ధమని చెప్పదగ్గ సూత్రాలులేవు. దానిని ఒక అలంకారిక భావంగానే గ్రహించాలి. "సకల జన మనోభిరామంఖలు రామణీయకం నామ" అనే వాక్యం లోకప్రమాణం ఆధారంగా పుట్టింది.

కళాకృతులన్నీ సుందరమైనవే. కానీ సౌందర్యాభిరుచి మాత్రం భిన్న భిన్నంగా ఉంటుంది. ఇటువంటి భిన్నమైన అభిరుచులను ప్రదర్శిస్తూనే వాటి మధ్య సర్వజనానుకూలమైన, సర్వజన సమ్మాన్యమైన ఒక సామాన్యాభిరుచిని కల్పించి పెంచి పోషించడం కళా రహస్యం. వ్యక్తిగతాభిరుచు లలో వైవిధ్యం ఉన్నా సాంఘిక జీవనంలోను, దాని ననుసరించిన కళాత్మక జీవనంలోను కొన్ని సార్వజనీన అభిరుచి లక్షణాలేర్పడతాయి. ఇది ఒక నాగరికతా లక్షణం. ఈ సార్వజనీన లక్షణాలు ఎక్కువగా సమకాలీనత అనే అంశాన్ని ఆధారంగా చేసుకొని ఏర్పడతాయి. కళా, సాంఘిక జీవనాలలోని అభిరుచి సిద్ధాంతాల సౌష్టవాన్ని బట్టి అవి ప్రమాణాలుగా, సూత్రాలు గా ఏర్పడతాయి. సంప్రదాయంగా బలపడతాయి. ఆ సంప్రదాయం బలిష్టంగా ఉన్నంత కాలం ఆ అభిరుచి సిద్ధాంతాలు పటిష్టంగా అమలు జరుగుతాయి. సంప్రదాయం కాలం తాకిడికి కొట్టుకొని పోయినప్పుడు నూతన సంప్రదాయం బలపడినప్పుడు పాత అభిరుచి ప్రమాణాలు మారి వాటి స్థానంలో కొత్త అభిరుచి ప్రమాణాలు చెలామణీలోకి వస్తాయి. ఇలా సమకాలీనమైన మార్పులతో సామూహిక, సార్వజనీన అభిరుచి ప్రమాణాలు ప్రవర్తిస్తున్నప్పటికీ విలక్షణ ప్రతిభావంతులైన వ్యక్తులు, తత్వవేత్తలు, కళాకారులు కాలప్రమాణ మంతటిలోను తమ విలక్షణమైన అభిరుచి మార్గాన్నే ప్రకటిస్తూ ఒక ప్రత్యేక ముద్రను సాధిస్తారు. సమాజం ఒక ప్రక్క వారిని గౌరవిస్తూనే ఇంకొక ప్రక్క సార్వజనీన అభిరుచి ప్రమాణాలను మన్నిస్తూ ఉంటుంది.

కళ మనస్సులో దాగిన మర్మాలనన్నింటినీ వెల్లడిస్తుంది. కళాకారుడు రెండు రకాలుగా దానిని ఆవిష్కరిస్తాడు. అందులో ఒకటి కేవలం కళాత్మకమైన అభిరుచి, రెండవది తన బుద్ధి మార్గాన్ని అనుసరించిన అభిరుచి. వస్తువును, దాని గుణాలను తారుమారు చేయవలసిన అవసరం లేకుండానే ఈ రెండు అభిరుచి మార్గాలు ఒక కళా సౌష్టవాన్ని సాధించగలవు. కేవలం సుఖవాదులైన కళాకారులు సత్యాసత్యాలు, ధర్మా ధర్మాలు, నీతి – అవినీతులు అనే పట్టింపు లేకుండా కళను కళగానే అవిష్కరిస్తారు. అవిచ్ఛిన్న సంప్రదాయార్థులు ఒక మనసు సుఖాన్నీ, సౌందర్యాన్నీ అనుభవించడానికి గానీ, దుఃఖాన్నీ, అసౌందర్యాన్నీ అనుభవించడానికి గానీ ఆ మనసు నాశ్రయించిన ధర్మము, నీతి, సంస్కారము అనే లక్షణాల నాశ్రయించుకొని ఉంటాయని ఒక కళాత్మక విశ్లేషణ చేయడం ద్వారా తమ సౌందర్యాభిరుచిని సార్వజనీన సౌందర్యాభిరుచిగా పర్యవసింపచేయడానికి కృతనిశ్చయులై ఉంటారు. అదే సౌందర్య ప్రయోజనమని వారి విశ్వాసం.

✶


**సాహిత్య ప్రస్థానం**
**అడ్వర్టయిజ్‌మెంట్ టారిఫ్**

**కలర్**

| | | |
|---|---|---|
| టైటిల్ బ్యాక్ | రు. | 15000 |
| టైటిల్ ఇన్నర్ | రు. | 12000 |
| లోపలి పేజీ | రు. | 10000 |

## కవితలు



# చూసావా?

### కోటం చంద్రశేఖర్

చూసావా?
చిగురుటాకులా వొణుకుతున్న
జన జీవన దృశ్యం
అమాయక ప్రాణాలే కుంచలై గీసిన
రక్తవర్ణ చిత్రం
నాగరిక సమాజానికి తగిలిన పెనుగాయం
గణతంత్ర వ్యవస్థ పాడిన
మహా విషాద గీతం

చూసావా?
సర్వోన్నత జాతికి హేయం
స్వేచ్ఛగా యధేచ్ఛగా
గుండాలు గుద్దురిమిన
హింసాకాండ నిర్వహణలో
ఘోరకలి మిగిల్చిన వికృత కేళి
నేరజ్వాల రగిల్చిన భయానక
మృత్యురవళి

చూసావా?
ఎడతెగని హింస;
క్షతగాత్రమైన 'శాంతిహంస'
మత ప్రయోజనకాంక్ష
విశ్వ శ్రేయాన్ని బలిపెడితే
కుత్తకలు తెగిపడి రక్తాలు ధారకట్టి
అశాంతి చెలరేగితే
కంటక రహదారికి దారిచూపేది
లౌకిక భువన భవన నిర్మాణానికి
రాళ్ళెత్తే కూలీలు
విశాల భారత నందన వనమాలీలు



# విశ్వజనీనం

### అడిగోపుల వెంకటరత్నమ్

కర్తవ్యానికి క్రియను
క్రియను ఫలితాన్ని
నేను కళాకారుణ్ణి
కార్యసాధకుణ్ణి
నేను జాతి సంపదను
జగతికి ముద్దు బిడ్డను
ఒక గీతాన్ని తయారు చేస్తాను
శ్రమ సౌందర్యాన్ని అద్దుతాను
ప్రాణం పోసి పాడతాను
గుబాళించిన గీతం
పొలిమేరలు దాటుతుంది
సరిహద్దులు ఆలకిస్తాయి
అంతర్జాతీయమై అలరిస్తుంది!

కొండంత వెలుగు మోసుకొచ్చి
గోరంత రాయిని వెతుకుతాను
ఒకసారి కర్తవ్యానికి
నేను ఆహారమూ ఉపాహారమూ
పరాజితుణ్ణి నేను
ఒకసారి కర్తవ్యం నాకు
ఆహారమూ ఉపాహారమూ
విజయోత్సవం నాది!

చైనా గోడ మచ్చుపిచ్చు
కొలోసియం క్రైస్ట్‌డీమర్ విగ్రహం
చిచిన్ ఇత్జాపిరమిడ్ తాజమహలు
పెట్రా జోర్దాన్‌లు
నా అద్భుత ఆవిష్కరణలు!
ఏడువింతల్ని సృష్టించాను
ఏడేడు వింతల్ని నిర్మిస్తూనే వున్నాను
పొగడ్తకు పొంగింది లేదు
తెగడ్తకు కుంగింది లేదు!
ఉజ్వల భవితకు
భూరి వర్తమానాన్ని
నేను జాతీయం
నా గీతం అంతర్జాతీయం
నా కళ విశ్వజనీనం!



# రైతు లోకం

### నాగిశెట్టి

పోల్చి చెప్పడానికి
ఇక పందికొక్కుల్లేవ్
చూరులెంటతిరిగే
చుంచెలుకల్లా తయారయ్యాయి-
ముద్దు ముద్దుగా తిరిగే
పిచ్చుకలు
కనుమరుగయ్యాయి
పంచలో వడ్లకంకుల

గుత్తెను వ్రేలాడదీసే
నాథుడు లేక -
ఓ పిల్లి
ఎడతెరపి లేకుండా
ఏడుస్తూనే వుంది
పాలకుండే లేని

చుట్టుకుదురు వైపే
ఆశగా చూస్తూ..
చిక్కని కుడితి తాగి
నవనవలాడే బర్రెలు
బక్కచిక్కి పోయి
ఊసురోమంటున్నాయి-

అన్నదాత
ఆత్మహత్య దిశగా
అడుగులు వేస్తుంటే...
చుట్టూ అల్లుకున్న బంధాలు
ఇంకేం మిగులుతాయి?
చెట్టే కుప్ప కూలితే....
చల్లని మజ్జిగ కుండలతో
దాహార్తిని తీర్చే
పల్లె చలివేంద్రాలు
ఇక తళతళ మెరిసే
ఎండమావులే...



# ధ్వంస రచన

### దిలావర్

కేసెట్
డిస్క్
డీవీడి
ఐపాడ్
టీవీ.......
మాటకు, నోటిమాట పడిపోయింది
చూపు ఒంటి మీది గుడ్డలు వూడిపోయాయి.
యాహూ

గూగుల్
డాట్‌కామ్
స్టాక్ మార్కెట్
సెన్సెక్స్
షేర్స్............
మమతానురాగాలు
డాలర్ల జాతరలో కాటు కలిశాయి

డ్రగ్స్
పబ్స్
డిస్కోథెక్
పాప్‌షో
జాజ్
హిప్‌హాప్..........
ఆత్మ చచ్చి వూర్కుంది.

**(అమెరికా జీవన శైలికి కలవరపడుతూ**
**- లాస్ ఏంజిల్స్ నుండి)**

పరిశీలన

# పెన్నేటి పాట




**ఇది విద్వాన్ విశ్వం 'పెన్నేటి పాట' రాసేటప్పుడు ఉన్న దీన పరిస్థితి. నీరు లేక ఎండిపోయి ఇసుకతో నిండిన 'పెన్నేరు' (పెన్నానది)ను ప్రధానంగా తీసుకొని, ఆ ప్రాంతపు జీవన వాస్తవికతను కావ్యంగా మలచడంలో కవి గొప్పతనం ఉంది. 'పెన్నానది' ఇక్కడ రాయలసీమ మొత్తం జీవితానికి ప్రతీక అవుతుంది. జీవితం నదిలా ప్రవహించినప్పుడే అది పరిపూర్ణమవుతుంది. ఎండిపోయినప్పుడు జీవితం స్తంభించి పోతుంది. కడగండ్ల పాలవుతుంది. ఇలా రాయలసీమ జీవితానికే 'పెన్నేరు' సంకేతమవుతుంది. పెన్నేరు పక్కన జీవితాన్ని వర్ణిస్తే, రాయలసీమనంతటినీ వర్ణించినట్లే.**

## అద్దేపల్లి రామమోహనరావు

రాయలసీమ పేదతనాన్ని ప్రతిఫలించే కావ్యాల్లో విద్వాన్ విశ్వం రాసిన 'పెన్నేటి పాట' అత్యుత్తమమైనది. ఈ కావ్యాన్ని విశ్వం 1956లో రాశారు. ఈనాటికీ ప్రకృతి చూపే నిర్దయతో, ఆధిపత్య వర్గాలు చేసే అన్యాయాలతో, ఎడతెగని కరువులతో నిండిన రాయలసీమ పరిస్థితిని ఆరు ఏళ్ళ క్రితం విశ్వం రాసిన 'పెన్నేటి పాట'లో దర్శించవచ్చు. అంత బలంగా, సామాజిక ఆవేదనతో రచింపబడ్డ కావ్యం 'పెన్నేటి పాట'.

వందేళ్ళ క్రితం రాయలసీమ సంపన్నంగా, ప్రాకృతిక వనరులతో పచ్చగా ఉన్నదే. విజయనగర రాజుల కాలంలో వేసవి విడిదిగా ఉన్నదే. రత్నాల అంగళ్ళతో విలసిల్లినదే. రాను రాను ఆ వైభవమంతా మాయమై పోయింది. ఈ పరిస్థితిని గూర్చి 'పెన్నేటి పాట'కు పీఠిక రాసిన రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మగారు ఇలా అంటారు :

'ఆ వైభవ పరిశేషము క్రమముగా మావంటి వారి కన్నుల యెదుటనే అంతర్ధానమైనది. అక్కడి లెక్కలేని చెరువులలో ఎన్నో తెగిపోయినవి. ఉన్నవి ముప్పాతిక పూడిపోయినవి. మైసూరు రాజ్యము వారు పై నుండి దిగివచ్చు నదులకు, వంకలకు, చెరువులు కట్టుకుని ఊట నడ్డగించుటచే నదులకు వాన నీరు తప్ప వేరు నీరు లేక పోయినది. 'సరవ' అను పేరు అంతర్గామినిగా శాఖోపశాఖలుగా ప్రవహించు చుండిన 'సరస్వతి' వట్టి యిసుక పాతరగా మారినది. అందందు సహజముగా ఎగజిమ్ముచుండిన 'తలపరిగలు, నీటి బుగ్గలు వట్టివాయి విడుచుకుని క్రమక్రమముగా కన్నుమూసు కొన్నవి. అడవులన్నియు వంట చెరకులై పొగబారిపోయినవి. పశు సంపద కటికివారి పాలైపోయినది. ఇక మనుష్యుల మాట చెప్పనేల? ఆంగ్లేయుల దొరతనములో ఈ సీమ ఎన్ని విధముల ఎండవచ్చునో అన్ని విధముల ఎండినది. ఎండింపబడినది. ప్రజల పరవశల్, అధికారుల అలక్ష్యము, ఇరుగు పొరుగువారి స్వార్థపరత, వీనికి తోడు దైవము దయ తప్పుట, ఇన్ని కలిసి నేటి రాయలసీమ రూపుగొన్నది.'

ఇది విద్వాన్ విశ్వం 'పెన్నేటి పాట' రాసేటప్పుడు ఉన్న దీన పరిస్థితి. నీరు లేక ఎండిపోయి ఇసుకతో నిండిన 'పెన్నేరు' (పెన్నానది)ను ప్రధానంగా తీసుకొని, ఆ ప్రాంతపు జీవన వాస్తవికతను కావ్యంగా మలచడంలో కవి గొప్పతనం ఉంది. 'పెన్నానది' ఇక్కడ రాయలసీమ మొత్తం జీవితానికి ప్రతీక అవుతుంది. జీవితం నదిలా ప్రవహించినప్పుడే అది పరిపూర్ణమవుతుంది. ఎండిపోయినప్పుడు జీవితం స్తంభించి పోతుంది. కడగండ్ల పాలవుతుంది. ఇలా రాయలసీమ జీవితానికే 'పెన్నేరు' సంకేతమవుతుంది. పెన్నేరు పక్కన జీవితాన్ని వర్ణిస్తే, రాయలసీమనంతటినీ వర్ణించినట్లే.

'పెన్నేటి పాట' ఐదు భాగాలుగా విభజింపబడిన కథా కావ్యం. భాగానికి 'సర్గ' అనే పేరు పెట్టి, ఐదు సర్గలుగా రాశారు. కథా కావ్యం అనడమే కాని, ఇందులోని కథ రేఖా మాత్రమే. ఆ కథా రేఖ, కథగా, కథలోని మలుపులుగా ఆకర్షించే రీతిలోనిది కాదు. కథలోని ముఖ్య వస్తువైన పేదరికాన్ని ప్రత్యక్షరంలో ప్రతిఫలించడమే కవికి ప్రధానం. అంటే వర్ణించదలచిన వస్తువుకి సంపూర్ణా విష్కరణ కలిగే విధంగానే పాత్రలు, సన్నివేశాలు, వర్ణనలూ పరిణామం చెందుతై. 1950లలో ఇది ఒక ప్రయోగమే. అప్పటికి ఆంధ్ర దేశంలో ఇలాటి భావనతో రాయబడిన కావ్యం ఇదే కావచ్చు. అంతేగాక పేదరికానికీ అందువలన కలిగే జీవన విధ్వంసానికీ ప్రాధాన్యమిచ్చి, ఒక సంపూర్ణ కావ్యం రాయడానికి కూడా 'పెన్నేటి పాట' మొదటిదే కావచ్చు. ఆ విధంగా ఈ కావ్యంలో నాయకుడు ఎవరంటే, అది 'రాయలసీమ పేదరికమే'.

'పెన్నేటి పాట'లోని మొదటి సర్గ రాయలసీమ పూర్వ వైభవ వర్ణనతో ప్రారంభ మవు తుంది. వైభవానికి సంబంధించిన అనేక పార్శ్వాల వర్ణన ఇక్కడ కనిపిస్తుంది.

'అచట నొకనాడు పండె ముత్యాలు చాలు
అటునొకప్పుడు నిండె కావ్యాల జాలు
అచ్చటకొకప్డు కురిసె భాష్యాల జల్లు
విరిసెనటనాడు వేయంచు విచ్చుకత్తి

ఈ గీత పద్యంలో సంపద, కవిత్వం, పాండిత్యం, శౌర్యం – అనే నాలుగంశాల గూర్చి చెప్పబడింది. ఒక ప్రాంతపు ఔన్నత్యాన్ని చెప్పాలంటే ఈ నాలుగే ముఖ్యమైన ప్రమాణాలు.

గతించిన కథగా ఈ వర్ణన చేసి, తర్వాత రాయలసీమ దైన్యానికీ ప్రతీకగా గ్రహించిన పెన్నానది వెంట పాఠకుణ్ణి నడిపిస్తాడు. పెన్నానది పూర్తిగా ఎండిపోయింది.

'ఏదీ నీరు? ఏదీ హోరు?
ఏదీ నీటి జాలు?
ఇదే నీరు! ఇదే హోరు!
ఇదే ఇసుకవాలు!'

అంటాడు. పెన్నానది నీటి చుక్క లేకుండా, ఇసుకతో నిండిపోయి ఉంది. ఎంతగానో తవ్వితే గాని యిక్కడ నీటి చుక్క కనిపించదు.

ఇసుక పాతర లోతులకేగు దనుక
నీకు కనిపించదీ యేటి నీటి చుక్క'

అంటాడు కవి. ఇక్కడి రైతు పరిస్థితి దయనీయమైనది. నీటి ప్రతి బొట్టులో రైతుల నెత్తురు కలిసి ఉంటుందని వర్ణిస్తాడు కవి. ఇటువంటి పెన్నానది చుట్టుపక్కల ప్రకృతి ఎంత బీభత్సంగా ఉందో విపులంగా చెప్తాడు. మామూలుగా నదీ తీరాలు అద్భుత సౌందర్య నిలయాలు. కాని, యిక్కడ భయంకర వికృత దృశ్యాలు, ఈ వైరుధ్యం కనిపించేటట్లు వర్ణించడం కవి చాతుర్యం. ఉదాహరణకు :

'శుక పిక శారికా రవరుచుల్ వినిపింపవు;
గూబమూల్గులో
క్కొకల్ తీ గుండె పీల్చును,
దిగుల్‌వడ జేయును తీతువుల్, సము
త్సుక వృకజంబుకమ్ములుమతుల్
సెడగుయ్యిడు, వల్లకాడుపె
న్నకు నిరుగట్టులందు పులిన స్థలి
పుత్తెలు పండు మెండుగక'

ఆ పక్కనున్న ఒక కాలువ తవ్వడానికి పారలు పట్టుకుని కూలీలు నడుస్తుంటారు. వారిలో ఒకడు రంగన్న.

ఇలా మొదటి సర్గలో పెన్నానది, దాని చుట్టుప్రక్కల బీభత్స వాతావరణం వర్ణించడంలో ప్రాకృతికమైన పేదరికాన్ని కవి వర్ణించాడు.

రెండో సర్గలో రంగడి కుటుంబానికి సంబంధించిన దైన్య పరిస్థితులు వర్ణించాడు కవి. రంగడి తండ్రి నారపరెడ్డి ఊళ్ళో పెద్ద సంసారి. ఆయనను పొగడే కవి గాయకులకు, చేతికి ఎముక లేనట్లు దానాలు చేయడం అతని రోజువారీ కార్యక్రమం. సర్కారు సిబ్బందిని మేపడానికీ, అవే కార్ల (ఆఫీసరుల) లంచాలకీ, వకీళ్ళకీ, గుర్రాలకీ, భటులకీ, అతని సంపద ఖర్చయి పోతూ ఉంటుంది. ఇద్దరు కూతుళ్ళ పెళ్ళిళ్ళకి, కాకి కూడా నేతి వంటకాలు తినేటంత వైభోగంగా ఖర్చు పెట్టాడు. ముగ్గురు భార్యలు మరణించిన తర్వాత నాలుగో భార్య కన్న పుత్రుడు రంగడు. నారపరెడ్డి తాను చేసిన అప్పుల వల్ల అప్పులిచ్చినవాళ్ళు చేసిన మోసాల వల్ల, పొలాలు పండకపోవడం వల్ల, తన ఆస్తి సమస్తం కోల్పోయి దివాళా తీశాడు. అప్పులు తీర్చడంలో వీరత్వం చూపడమే ఇందుకు కారణం.

'ఎర్ర ఏగానియేగాని యివ్వననక
నల్లపూసలతో ఆస్తి నెల్ల చూపి
కట్టె వడ్డీ మొదల్ కడబొట్టు వరకు
పత్తి నారపరెడ్డి, నిబద్ధ మనిషి'

నారపరెడ్డి దివాళా తియ్యగానే, భరించలేక భార్య తనకు తాను దహింప చేసుకుని మరణించింది. తరువాత నారపరెడ్డి కూడా చనిపోయాడు. రంగడు కూలి వాడయ్యాడు. తిండికి లేని నిరుపేద అయ్యాడు. అతని పరిస్థితిని ఈ కింది పద్యం తేటతెల్లం చేస్తుంది.

'ఇవియుం దొరకక పుడిసెడు
గవి నీళ్ళం ద్రావి, ముడుచుక పరుండిన పా
డు విభావరులెన్నో, లె
క్క విలేవరి యేది? వల్లకాటి మనుగడన్'

మిగిలిన కూలీలతో కలిసి, కాలవ తవ్వే పని చేస్తూ ఉంటాడు. మైలున్నర దూరం, ప్రతి రోజూ తవ్వకం పనిచేయడం నిత్య కృత్యం.

ఈ రెండో సర్గలో ఎటువంటి పెద్ద రైతయినా, కాలక్రమంలో ఎంత ధ్వంసమవు తాడో కవి కళ్ళకు కట్టినట్లు రాశాడు. ఒక కుటుంబంలో రైతు కూలీగా మారిపోయే రాయలసీమ నేపథ్యాన్ని చిత్రించాడు. కుటుంబ సంబంధమైన పేదరికం ఈ సర్గలో ప్రస్ఫుట మవుతుంది.

మూడో సర్గలో రంగన్న భార్య గంగమ్మ కుటుంబానికి సంబంధించిన దారిద్ర్య వర్ణన కనిపిస్తుంది. గంగమ్మ అక్క రంగడికిచ్చి పెళ్ళి చేయడాన్ని ఇలా చెప్తాడు కవి :

'పేదరాలు గనుక
పేద కుటుంబము చిదికి
నిలిచినట్టి చిన్నదాని
వెదకి వెదకి
కడకు వీని రంగన్నను చూచి
పిల్లనిచ్చి చక్కాపోయె'

రంగన్నకీ, గంగమ్మకీ నడుమనున్న ప్రేమ, పేదరికం అనే వృక్షానికి పూచిన విలువైన పుష్పం. అదే వారిని బ్రతికించే ఆదరువు. రంగన్న, గంగమ్మ యిద్దరూ నిరంతర శ్రమజీవులు. ఆశ్రమంలోని బీభత్సమంతా ఈ సర్గలో వర్ణించాడు కవి. శ్రమకు ఫలితం శూన్యమైన భౌతిక పరిస్థితుల వర్ణన కూడా హృదయాన్ని కదిలిస్తుంది. రాయలసీమ దైన్యాన్ని స్పష్టం చేస్తుంది.

'వేయేండ్ల కొక్కొక్క వానగదా
అక్కడ మాత్రమెట్లు గరకైనా పుట్టు
ఏ పాత చెట్లకు గానీ చివురేది?
పచ్చనలు తాటల్ దీసినా చూడమే'.

ఒళ్ళు హూనమయ్యేటట్లు శ్రమపడినా, తిండి దొరకని పేదరికం మూడో సర్గలోని ప్రధానాంశం. ఒకరికొకరు దిక్కైన నిరుపేద భార్యాభర్తల ప్రేమ కూడా ఈ సర్గలో పాతకుడికి, పేదరికంలోని లోకుల్ని ఆవిష్కరిస్తుంది.

నాలుగో సర్గలో, రంగడు నివసించే గ్రామంలో, ఉన్నవాళ్ళ జీవితానికీ, లేనివాళ్ళ బ్రతుకులకీ ఉన్న తేడా ప్రధానమైన అంశం. ఒక గ్రామంలోని పేదల బ్రతుకులోని బీభత్సమంతా ఈ సర్గలో నిరూపించబడింది. పెద్ద రైతులు, పేదల శ్రమను దోచుకునే వాతావరణం విస్తృతంగా కవి వర్ణించారు.

'మాటయేగాని వీరిచ్చు మూట లేదు
ఏటి పట్టెల పొలాన్న దాటి పోయె
పూటకొక ముంత మజ్జిగ బోతురంతె
పేదవానికదే అమృతోదనంబు'

గొప్ప యిళ్ళలో ఎంత వైభవమైనా ఉండవచ్చు గాని, హృదయం మాత్రం లేదంటారు.

'సంపన్న గృహము
చొచ్చి చూచిన ఆత్మయేశూన్యమిచట'

నాలుగో సర్గ అంతా, గ్రామీణ పేదరికం, ఉన్నవారు లేనివారిని దోచుకోవడం ప్రధానంగా కనిపిస్తుంది.

ఐదవ సర్గలో, రంగడు ఇంట్లో లేనప్పుడు, భరించలేని శ్రమ చేసిన గంగమ్మ, స్పృహ తప్పి, చుట్టు పక్కల ఉన్నవాళ్ళ సాయంతో తెలివి పొంది, రంగడు రాగానే, అతని ఒడిలోకి చేరడం, యిద్దరూ స్తంభించి ఉండడం వర్ణించడంలో, పేదల గతి స్ఫురింపజేశాడు కవి. ఇటువంటి పేదరికాన్ని చూస్తూ సహిస్తున్న సమాజంపై నిప్పులు కురిపిస్తాడు.

'దైవమా! ఉంటివా? చచ్చినావ నీవు
ధర్మమా! గెంటిరా నిన్ను ధరణి నుంచి
సంఘమా! తలకెక్కినా సన్ని నీకు?
హృదయమా! మానవుడు నిక బహిష్కరించె'

ఇలా ఐదో సర్గలోని ప్రధాన వస్తువూ పేదరికమే. రాయలసీమ పేదరికమే. ప్రాకృతికం, గ్రామీణం, వ్యవసాయం, గొప్పవారి దోపిడి ఫలితం. ఇలా పేదరికానికి సంబంధించిన అన్ని కోణాలు ఒక్కొక్క సర్గలో వర్ణించారు కవి. రంగడి కథ రేఖా మాత్రమే కాని, పేదరికం కథ మాత్రం 'పెన్నేటిపాట'లో సమగ్రం. అందుకే ఈ కావ్యానికి నాయకుడు 'పేదరికమే'.

## 2

1956లో రాయబడిన 'పెన్నేటిపాట'కు ఒక విశిష్టత ఉంది. ఒక ప్రాంతంలోని జీవితాన్ని సమగ్రంగా చిత్రించడానికి ఇదే మొదటి ప్రయత్నం.

‘ప్రాంతీయత’ ఈ కావ్యం నిండా పరుచుకుని ఉన్న ప్రత్యేక లక్షణం. మొదటి సర్గలోని పెన్నానది, ఆ చుట్టు పక్కల ప్రకృతి వర్ణన, ఆ ప్రాంతానికి అద్దం పడుతుంది. ఉదాహరణకి పెన్నానది ఎండిపోయిన పరిస్థితిని ఇలా చెప్తాడు కవి.

‘పారచేబట్టుకొని వంగి చీరుదనున్
ఇట్టి చెమ్మట కాలువగట్టు దనుక
ఇసుక పాతర లోతులకే గుదనన్
నీకు కన్పించదీయేటి నీటి చుక్క’

రెండో సర్గలో నారపరెడ్డి నిరుపేద కావడం, రంగడు కూలీ కావడం, అతని కష్టాలు, అన్నీ రాయలసీమలో కవికి తెలిసిన ఒక కుటుంబ చరిత్రయే అన్నట్లు వర్ణించ బడినవి. సరైన ఆహారం కూడా తీసుకోలేని రంగడి అవస్థను గూర్చి యిలా చెప్తాడు.

‘కటక కారము సంగటి గటిగుటక వడక
ఎన్ని బిందెల నీళ్ళు త్రావించినది యొ
ఎండు రొట్టె ముక్కలు ఆరగింపుగాక
ఎన్ని మిరప గింజలు నమిలించినది యొ’

మూడో సర్గ అంతా, రంగన్న గంగమ్మల పేదరికాన్ని వర్ణిస్తూ, అక్కడి కాయకసరుల్ని గూర్చి చెప్తాడు. ఎపుడో, ఎక్కడోయ వానపడగానే, వాతావరణం ఇలా కనిపిస్తుంది.

‘కాసేపు రాల్చిన గంపలకొలదిగా
కమ్మని కదలి పండ్లమ్మవచ్చు
కొంతసేపే చాలు కొల్లలు కొల్లలు
బలసకాయలు గంపబట్టవచ్చు
ఇంతసేపే చాలునెన్నైన రేణ
గాయలు కోసుకొని అమ్మనైనవచ్చు
ఒక ఇంతసేపు నోపిక గోసుకొన్న చాల్
సీమ చింతలు వడి జేర్చవచ్చు
వీని యాదరువున ఊరిలోని పేద
చానలెందఱో ఆనాటి సారమునకు
చాలినంత గడింతురా కాలమందు
కాయ కసరులకేమి? చాలా యెదొరకు!’

నాలుగో సర్గనిండా, ఒక గ్రామం లోని పరిస్థితులన్నీ కళ్ళకు కట్టినట్లు వర్ణించ బడినై, ఉదాహరణకు, దీపం కనిపించే ఇళ్ళే చాలా తక్కువ అనిచెప్తూ, చీకటి పడితే, ఏమీ కనిపించని వాతావరణాన్ని యిలా వర్ణిస్తాడు.

‘అసలు దీపము ముట్టించుయం గణములె
చాల తక్కువ, ఉన్న దీపాలు గూడ
తమ్ముతాము జూపించుకోదగిన చాలు
అన్ని వస్తువులనే జూపినంత ఫలము’

ఐదో సర్గలో నిరుపేద శ్రమ ఆ గ్రామాల్లో ఎంత భయంకరంగా ఉంటుందో కవి వివరిస్తాడు. అటు కుల దంపకం ఈ కింద విధంగా ఉంటుంది.

’అటు కుల దంపకమ్మన
మహా శ్రమ దాయకము
అగ్గి రేగు గుప్పిట
ఉడికించి వడ్ల, నొక పెద్ద పెనమ్మున వేసి
రోటిలో పిటపిట లాడ దంచవలె
పీకల మీదుగనుండు
నల్లు రొక్కటి తరువాత నొక్కటి
చకా చక పోటులు వేయగా వలెనో’

రాయలసీమ నది, ప్రకృతి గ్రామాలు, జీవన సరళి, శ్రమ – మొదలైన అంశాలన్నిటినీ ప్రతిబింబించడం చేత’ ‘పెన్నేటి పాట’ ప్రాంతీయతను పూర్తిగా ప్రతిబింబించే కావ్యాల్లో ప్రథమగణ్యమయింది.

## 3

‘పెన్నేటిపాట’లోని గొప్ప అభివ్యక్తి మార్గాలలో ముఖ్యమైనది సూక్ష్మాంశ సహితమైన వర్ణనలు. ఏ అంశాన్ని తీసుకున్నా అందులోని వివరాలన్నీ కవి చెప్తారు. ఈ విధమైన రచన కవికి గల లోక జ్ఞానానికీ, అనేక విషయ పరిజ్ఞానానికీ, లోతైన పరిశీలనకీ నిదర్శనం. నారపరెడ్డి చేతిలోని సంపద ఎలా తరగిపోయిందో చెప్పడానికి, ఆయా ఖర్చులన్నీ సూక్ష్మాంశాలలో కవి వర్ణిస్తాడు.

‘సర్కారు సిబ్బంది సరి చేయుటకు కొంత
సాలు జమాబంది పాలు కొంత
పొరుగూరి మన్నీల సరఫరా కింత
ఆలే కార్లలంచాలలోకి కొంత
పేట పెద్దవకీలు పిళ్ళెకు కొంత
కాంపౌండరు మునుసామి పాలు కొంత
కోడెరెడ్లకు కొంత, గుర్రాలకై కొంత
బగ్గీలకై కొంత భటులకింత
పెద్ద మహిజీలు కట్టిన పేర కొంత
పూట పడి అచ్చవలసిన పాలు కొంత
తన వివాహాలు నాల్గింటికిని మరింత
కొంత కొంతయె ఖర్చు కొండంతయయె’

‘పెన్నేటిపాట’లోని ప్రతి సన్నివేశం లోనూ రచయితకున్న లోతైన పరిశీలన నిండి ఉంటుంది.

గంగమ్మ వడ్లు దంచే సన్నివేశాన్ని యిలా వర్ణిస్తారు.

‘గబగబా లేచి గంగమ్మ
గవినివారి వడ్ల దంపకమున
తన వంతు తవ్వ
ముగ్గు చెన్నంగి వడ్లు ముమ్మరు చేసి
చేట నారబెట్టి, బాటమీదే ఉన్న
చక్క రోటిలోన చక్కదంచి
కూడ ఎసరు వెట్టి కుతకుత మనిపించి
చింతకాయ దంచి పొంతనింపె’

ఇలాంటి సూక్ష్మాంశ సహితమైన వర్ణన ‘పెన్నేటిపాట’లో ప్రతి సన్నివేశంలోనూ గమనించగలం. ఈ కారణం చేత ‘వాస్తవికత’ ఒక గొప్ప శిల్పంగా ఈ కావ్యానికి పరిపూర్ణత నిస్తుంది.

## 4

‘పెన్నేటి పాట’ లో రంగడు, గంగమ్మ దంపతులు ప్రధాన పాత్రలు. ఇద్దరి నేపథ్యమూ పేదరికమే. ఇద్దరికీ వెనుక ఎవ్వరూ లేరు. వారు ఒకరికొకరు మాత్రమే. ఇద్దరూ కడుపు కోసం కూలి పని చేసుకునేవారే. శ్రమచేసి, దోపిడీ చేయబడేవారే. వీరి ప్రేమ అపూర్వమైనది. ఒకరికొకరు ప్రాణత్యాగం చేసేటంత ఉదాత్తమమైనది. ఉదాత్తమైన ప్రేమకు సమాజంలో అగ్రస్థానంలో ఉన్నవారిని కవులు స్వీకరించే కాలంలో, శ్రామికుల్లోని అనుబంధాన్ని వస్తువుగా తీసుకోవడంలో, కవి విప్లవాత్మకమైన ఆలోచన స్పష్టమవుతుంది. నిరుపేద శ్రమజీవుల ప్రేమమయ జీవితాలు, దుష్ట మానవ సమాజ నేపథ్యంలో ఎలా విధ్వంసం పాలవుతున్నాయో, రంగడు గంగమ్మ దంపతుల కథ ద్వారా గ్రహించగలం. రంగడు, గంగమ్మల పాత్ర చిత్రణ ‘పెన్నేటి పాట’లో కేంద్ర స్థానంలో ఉన్న అంశం.

మొదటి సర్గ చివర, పారలు పట్టుకుని కాలువ తవ్వే కూలీలలో ఒకడుగా రంగణ్ణి పరిచయం చేస్తాడు కవి. రంగడు శ్రామికుడే గాక, జానపద గేయాలు పాడటంలో నైపుణ్యం గలవాడు. జానపదులన గానే, జానపద గేయాలు కూడా స్ఫురిస్తై. జానపద గేయాల ప్రాధాన్యాన్ని ప్రస్తుతించడం, ఈ కావ్యంలోని ‘గ్రామీణత’ లక్షణాన్ని సమగ్రం చేస్తుంది. జానపద గేయం గురించి, ఒక చిన్న పద్యంలో దాని ముఖ్య లక్షణాల్ని చెప్తాడు కవి.

‘అది పల్లెపాట నెమ్మదిలోని మాట
మొదలుండునే గాని తుదలేని బాట
పదినోళ్ళలో పడి పది రూపులెత్తి
కదిలిపోయెడు కైతకమ్మని మాట.

జానపద గేయం – అనకుండా ‘పల్లెపాట’ అనడంలో కవి ఔచిత్యం ఉంది. ఇది “ఊట”లాటిది. అంటే ఆలోచన మీద రాసేది కాదు. అది మౌఖికం. అప్రయత్నంగా వచ్చేది. అది ‘నెమ్మదిలోని మాట’, అంటే మనస్సులోని మాట బయటికి రావడమే అందులో ఉంటుంది గాని, విభిన్న భావాల ఉద్దేశ పూర్వకమైన కలబోత కనిపించదు.

మరొక అతి ముఖ్యమైన లక్షణం, పాట పాడేవారందరూ వారి వారి భావాలు కూడా ఆ పాటలో చేర్చి పాడటం. అందుకే అది 'పది నోళ్ళలో పడి, పది రూపులెత్తు'తుంది. దానికి మొదలే గాని, చివర ఉండదు. జానపద గేయ ప్రధాన లక్షణాల్ని వ్యక్తం చేసే ఈ పద్యం, ఈ కావ్యంలోని రత్నాల్లో ఒకటి.

గుంపులో వస్తూ రంగన్న రాగంతో 'ఈల' పాట పాడతాడు. అతడు సామాన్య గాయకుడు కాదు. ఆ ప్రతిభ మరెవరైనా అగ్రవర్ణాల వారికుంటే, అది ఎంతో రాణింపుకు వచ్చేది. అతని ప్రతిభను కవి యిలా రూపుగడతాడు.

'పుట్టు కవి, గాయకుడు, నటరాట్టునతడు
కట్ట తెగగొట్టుకుని రసముట్టి పడగ
ఉట్టి పాటున కన్నీరులు రవి పొరల
చెట్టు పుట్టలకే గుండె పుట్ట జేయు'

కవిత్వం, గానం, నటన – కలబోసుకున్న రంగడు కళా సృజన స్వరూపి. అయినా శ్రామికుడు కాబట్టి తన కళ చేత అందరికీ ఆనందం కలిగించినా, వెంటనే జీవన బీభత్సం లోకి అడుగు పెట్టక తప్పదు. ఆ విషయం స్ఫురింప చేయడానికే కవి అంటాడు :

'సరి, పిమ్మట మామూలే!
చర చర పారలను బట్టి సాలుమేర, కా
ల్వ రమారమి మైలున్నర
వరకున్ త్రవ్వకము రోజువారి రివాజే!

గంగమ్మ ప్రేమ స్వరూపిణి. రంగడు, గంగమ్మ పూర్తిగా మనసులు కలిసిన దంపతులు. వారి ప్రేమను కవి ఈ విధంగా వర్ణిస్తాడు.

'రంగడంటే ఒక్క గంగమ్మ మగడె
రంగమ్మ అననొక్క రంగన్న పడుచె
రంగన్న బ్రతుకెల్ల గంగమ్మ బ్రతుకె
గంగమ్మ మనసెల్ల రంగన్న మనసె'

ఇద్దరూ తమ శరీరాలు భరించ లేనంత శ్రమ చేసి పొట్ట పోసుకోవలసిన పరిస్థితి. అటువంటి దీనపరిస్థితి నుండి వారి మనస్సులకు ఆనందం కలగజేసేది వారి పరస్పర గాఢ అనురాగమే.

రంగడు పరోపకార పరాయణుడు. తన బాధలను లెక్కచెయ్యక, ఇతరుల బాధలను తీర్చే ప్రయత్నం చేసే ఉదార హృదయుడు గ్రామంలో నరసన్నను పాము కరిస్తే, అర్ధరాత్రి వేళ మంత్రగాని కోసం మరో గ్రామానికి బయల్దేరాడు. అది ప్రాణాంతకమైన సాహస కార్యం. అక్కడ రంగడి ఏకాగ్రతను కవి యిలా చెప్తాడు :

'కన్ను పొడుచుకున్న కనరాని చీకటి
పురుగు పుట్ర యిచట పుట్టకొలది
అసలువాడు దారినైన చూచుట లేదు
కలదు దృష్టి మంత్రగా? మీదె

గంగమ్మ విపరీతమైన శ్రమజీవి. రంగడు. ఆమెను బరువైన పనులు చెయ్యవద్దని చెప్పినా వినదు. రంగని శ్రమ చూసి సహించలేక, తాను కూడా సహకరించాలని ఆమె ఉద్దేశం కవి అంటాడు.

'వాడ వాడ మాటు మణగిన దాక
చెమ్మటల నోడ్చు చుంటచూచి
తనెట్లు కూర్చుండగలదు'

రంగడు మంత్రగాడి దగ్గరికి వెళ్ళినరోజే, ఆమె మధ్యాహ్నం నుండి విపరీతమైన శ్రమ చేసి, తల తిరిగిపడిపోతే, సాటి ఆడవాళ్ళందరూ సేవలు చేసి, ఆమెను స్పృహ వచ్చిన తర్వాత, ఎవరి దారినవాళ్లు వెళ్ళిపోయారు. చీకటిపడిన తర్వాత, రంగడు వచ్చాడు. ఆమె స్థితికి చూచి, మ్రాన్పడి, తన ఒళ్ళోకి ఆమెను తీసుకున్నాడు. వారి అనుబంధం పరాకాష్ఠకు పోయిన దశ ఇది. వారిద్దరూ ఒక సమాధి స్థితిలోకి వెళ్ళారు. అక్కడ కవి కథను ముగిస్తాడు.

రంగడు, గంగమ్మ –పాత్ర చిత్రణలో, ఇద్దరి విపరీత శ్రమ, ఒకరికొకరైన ఉదాత్తప్రేమ, వర్ణించడంలో వారిని ఆ స్థితికి నెట్టిన సామాజిక పరిస్థితుల్ని, హృదయానికి హత్తుకునేటట్లు చెప్పడం, కవి లక్ష్యం. అందుకే వారిద్దరి నిశ్చలచిత్రాన్ని కళ్ళముందుంచిన తర్వాత

'దైవమా! ఉంటివా? చచ్చినావనీవు?
ధర్మమా! గెంటిరా నిన్ను ధరణి నుంచి?
సంఘమా! తలకెక్కినా సన్నినీకు?
హృదయమా! మానవుడు నిక బహిష్కరించె?

మొదలైన పద్యాలు కవి రాసినప్పుడు, పాఠకుడిక కవితో పాటే సామాజిక నేపథ్యంపై తీవ్రమైన ఆగ్రహం కలుగుతుంది. అటువంటి ఆగ్రహాన్ని కలిగించి, కర్తవ్యాన్ని ప్రబోధించడమే కవి లక్ష్యం. ఆ లక్ష్యానికి అనుగుణంగా పాత్ర చిత్రణ చెయ్యడం కవి నైపుణ్యం.

## 5

'పెన్నేటిపాట' ఒక గొప్ప కావ్యం కాబట్టి, కావ్యానికి కావలసిన ఎన్నో శిల్పాలు అలవోకగా అల్లుకున్నై. కథా కావ్యంలో ఆద్యంతాలు చాలా ప్రధానం. కవి కథా సూత్రం ప్రకారం ఆద్యంతాలు తీర్చబడడం కవి ప్రతిభకు నిదర్శనం. పెన్నేటిపాట ప్రారంభంలో, రాయలసీమ గత వైభవాన్ని రెండు పద్యాల్లో వర్ణించి, నేటి కన్నీటి పాటను మొదలు పెడతాడు.

'అదే పెన్న అదే పెన్న
నిదానించినడు
విచారించునెదన్ వట్టి
ఎడారి తమ్ముడు!'

అని పాఠకుణ్ణి పెన్నానది వెంట నడిపించి, కన్నీరు పెట్టిస్తాడు. కావ్యంలో కథ చెప్పడం అయిపోయిన తర్వాత, చివరలో హృదయం లేని మానవ సమాజాన్ని నిరసించిన తర్వాత, చిట్టచివరపై పాదాల్ని గుర్తుచేస్తాడు.

'ఇదే పెన్న ఇదే పెన్న
నిదానించినడు
విచారించునెదన్ వట్టి
ఎడారి తమ్ముడు!'

కథ ముగిసిన తర్వాత ప్రారంభం లోని పంక్తుల్ని పునరుక్తం చెయ్యడంలో ఒక్క సారి 'రాయలసీమ' వేదనంతా స్ఫురిస్తుంది. ఇది పటిష్ఠమైన ఆద్యంత శిల్పం.

## 6

కావ్యానికి వర్ణనాత్మక లక్షణం గొప్ప అనుభూతిని తెస్తుంది. 'పెన్నేటి పాట'లో ఇటువంటి వర్ణనాత్మకత ఉన్నత స్థాయిలో నిండి ఉంటుంది. ప్రకృతిని వర్ణించినా, ఒక సంఘటనను వర్ణించినా, పాఠకుడి మనస్సు అందులో హీనమైపోయేటట్లు చెప్పడం 'పెన్నేటి పాట'లో చూడగలం. చీకటిలో గ్రామాన్ని యిలా వర్ణిస్తాడు.

'చీకటి ముంచి వేసినది
చింతలపల్లెను
గుట్టకొంపముందే, కదలేనిరాలు
అడుగుదీసి డెకించుక
ముందువేయుటే
నాకనునెక్కునంతపని!
నాలుగు బారలకొక్క గుంతో, మిట్టో
కనిపించు
వాడుకనెటో నడువక వలె
మెల్ల మెల్లగన్'

అక్కడి పరిస్థితిని సరిగ్గా కళ్ళ ముందుంచుతుంది ఈపద్యం. ఇది దృశ్యానికి సంబంధించినదైతే, శారీరకమైన స్పందనలకు సంబంధించిన వర్ణన మరొక విషయం. గంగమ్మ అటుకులుదంచినప్పుడు, శ్రమ ఫలితమైన బాధలు, ఇలా ఉన్నై.

'చేతులు బొబ్బలెక్కె
అలసెక పదముల్, దగవుట్టె
గుండెలున్ కూతలువెట్టి, రక్తము రగుల్కొనె
ముక్కుల నూపిరాడుటే మోతగనుండ
కన్నులర మోడ్పుల కుందగవయ్యె
రెప్పపాటే తడవైనరో కవిసెరిల్లను
రెక్క శరించురకూనన్'

సజీవమైన యిటువంటి వర్ణనలే గాక, గొప్ప అనుభవాల్ని పాఠకుని మనస్సు నిమగ్నమయ్యే రీతిగా రూపుగట్టడం, ఈ కావ్యానికి శోభ తెచ్చినై.

రంగడి పాటను గురించి చెప్తూ, ఆ క్షణంలో ప్రకృతికీ మనిషికీ మధ్యనున్న తెర జారిపోయిందని వర్ణించి యిలా అంటాడు.

'జీవితమ్ము ననట్టి రసావబోధ
సిద్ధి ఎన్నడో గాని వాసించబోదు
వేయి యుగముల సాధన విధులనెల్ల
అట్టి తృటి కోసమే తపమ్మాచరించు.

జీవితానికి సార్ధకత నివ్వడానికి ఎన్నో సంఘటనలు అవసరం లేదు. రససిద్ధి పొందిన ఒక్కక్షణం చాలు అనేది గొప్ప సత్యం. 'క్షణికమై శాశ్వతమైన దివ్యానుభవం. అనే శ్రీశ్రీ వాక్యం గుర్తు వస్తుంది.

కావ్యం చివరిలో రంగడు, గంగమ్మ ఒకరి కౌగిలిలో ఒకరు సమాధి స్థితి లోకి వెళ్ళినపుడు, ఇద్దరి గురించి వర్ణించిన రెండు పద్యాలూ, గొప్ప అనుభూతిని రూపుగట్టే సందర్భం –

'గంగమ, మామా! యన బి
గ్గంగౌగిలి హత్తి గుండె గంటలు మ్రోయక
నింగినరుంధతి, కన్నుం
జెంగలు వల నీరు గ్రమ్మ చెక్కుల నిమిరెక'

'రంగడు, పిల్లా యనిబి
గ్గంగౌగిలి హత్తి, గుండె కన్నుల పూయన్
నింగి పురూరవు కన్నున్
జెంగలు వల నీరు గ్రమ్మ చెక్కుల నిమిరెక'

రెండు పద్యాలూ కొద్ది భేదంతో ఒకే విధంగా నడవడం, ఒకే ఛందస్సు (కంద పద్యం)లో ఉండటం, దంపతుల ఏకీభావ స్థితికి దర్పణం.

అనేక కోణాల వర్ణనాత్మకత నిండుగా కలిగిన కావ్యం 'పెన్నేటి పాట'.

## 7

భాషాగతమైన గొప్ప అభివ్యక్తి 'పెన్నేటి పాట'కు ప్రత్యేకత కలిగిస్తుంది. విద్వాన్ విశ్వం, తాను కావ్యానికి ముందు రాసిన మాటల్లో ఇలా అన్నారు.

'రాయలసీమ పెన్నేటి గట్టున ఉన్న పల్లెల బ్రతుకు నీడ ఇందులో కాన వస్తుంది. అక్కడి పలుకుబడులూ, ఊరు పేరులు ఇందులో కనిపిస్తాయి.'

కావ్యంలో ఉన్న వస్తువు గ్రామాలకూ, గ్రామీణులకూ సంబంధించింది కాబట్టి అచ్చమైన తెలుగు భాషకూ, స్థానికమైన పలుకుబడికీ ప్రాధాన్యమివ్వడం ఎక్కువ భావస్ఫోరకమవుతుంది' ఉదాహరణకు –

'సందకాడ జొన్న సంకటి గెలకంగ
తెడ్డు చూరి నుండి తీయుచుండ
మసక గ్రమ్మి పొయ్యి మంటలో పడబోయి
మల్లి, పట్టుకొనగ, మనిషి దక్కె –

తెలుగు పదాల్లోకీ అక్షర పునరావృతి చేస్తూ అనేక పద్యాల్లో భావాన్ని శక్తిమంతంగా చెప్పడం, ఈ కావ్యంలో పలు చోట్ల కనిపిస్తుంది. గంగమ్మ స్వభావాన్ని గూర్చి వర్ణిస్తూ చెప్పిన ఈ కింది పద్యం ఉదాహరణ :

'తిప్పలెన్ని పడిన, ముప్పుల మున్గిన
ఉప్పు పప్పులేని యునికియైన
కప్పురంపు టెడద, కమ్మని తలపులు
నిప్పు వంటి బ్రతుకు గొప్పనిచ్చె'

తెలుగు భాషా వినియోగమే ఎక్కువగా చేసిన కవి, అక్కడక్కడ సంస్కృత పదాలు, సమాసాలు ప్రయోగించినా ప్రతి సందర్భంలోనూ భావానుగుణంగానే రాయడం గమనించదగిన విశేషం.

నిరుపేద యిళ్ళ మధ్యలో ఉన్న ఒక్క గొప్ప యింటిని గూర్చి చెప్తూ, ఈ కింది విధంగా అంటాడు :

'చుట్టుం జుట్టు
దరిద్రతా విధుర సంక్షుబ్ధ క్షుధం బోధిపై
తెట్టుం గట్టు నురుంగు కొంప యిది'

చుట్టుపక్కల పేదతనానికి సంబంధించిన ఆకలి సముద్రంలా ఉంటే, ఆ యిల్లు తెట్టె కట్టిన నురుగులా ఉంది. అంటే నల్లదనం మధ్య తెల్లగా ప్రకాశిస్తోంది. మధ్యలో వచ్చిన సమాసం దారిద్ర్య సంక్షోభాన్ని వ్యక్తపరుస్తుంది.

## 8

పెన్నేటి పాట – లో ఛందస్సులో కూడా కొన్ని శిల్పాల్ని ప్రదర్శించాడు కవి. గణబద్ధమైన పద్యాలు రాస్తూనే, భావంలోని మార్పును బట్టి మాత్రా గణాల పాదాల్ని రాస్తారు. మాత్రాగణాల కూర్పు కూడా అనేక విధాలుగా ఉంటుంది. రంగన్న గంగమ్మల ప్రేమ గురించి పద్యం రాసి వెంటనే

'రంగన్న గంగమ్మ
రంగు రక్తిమలు
రంగన్న గంగమ్మ
నింగి నీలిమలు'

అని మాత్రాఛందస్సులో రాసి, గేయ ఫణితిలో సౌందర్యాన్ని స్ఫురింపచేస్తారు.

ధనం ఎక్కువై, ఏ సుఖాన్నీ పొంద లేక, దినచర్య ఒకే విధమైన రీతిలో వ్యర్థంగా గడుస్తున్నదని చెప్పడానికి ఒక గీత పద్యం తర్వాత ఛందస్సు మార్చి సంపూర్ణమైన భావధ్వనితో ఇలా రాస్తారు :

'ప్రొద్దు పోకకె చదువు
ప్రొద్దు పోకకె నులివు
ప్రొద్దు పోకకె మెదుకు
ప్రొద్దు పోకకె బ్రతుకు
మొద్దు వారెను మనసు
మొద్దువారెను తనువు
మొద్దు వారెను బ్రదుకు
సుద్దియే యిచట–'

పద్యాల్ని గణక్రమంలో గానీ, కేవలం భావాల క్రమంలో, పూర్తి కావ్యమంతా ముద్రించ బడటంలో 'పెన్నేటి పాట'ను ఒక ప్రయోగంగా చేశారు కవి. అందుకే పద్యాలైనా వచన కవిత చదువుతున్న స్ఫూర్తి ఉంటుంది –

'ఇన్ని ఇడుములు
నీకోసమే భరించుచుంటినని
ఆతడనడు –
నీ సుఖము కొరకె
బ్రతుకుచుంటినటంచు
ఆమె పలుకదెపుడు
మాటలేటికి
మనసులో మరులు పొరల?'

పై పద్యం భావాల పాదాలుగా విరవడింది. ఆలోచిస్తే గాని గీత పద్యమని తెలియదు.

'ఇన్ని ఇడుములు నీ కోసమే భరించు
చుంటినని అతడనడు నీ సుఖము కొరకె
బ్రతుకు చుంటినటంచామెపలుకదెపుడు
మాటలేటికి మనసులో మరులు పొరల'

పద్యాలు గాని, మాత్రాగణ బద్ధమైన పదాలు గాని, ఏవైనా ప్రధాన భావధారలో భాగాలుగా కవి భావించాడు కాని, కేవలం అందమైన పద్యాలు రాయడమే లక్ష్యంగా పెట్టుకోలేదు. అందువల్లనే 'పెన్నేటి పాట' రస నిర్భరమైన కావ్యంగా రూపు దిద్దుకుంది.

రాయలసీమ దుస్థితి నేపథ్యంలో గ్రామీణత, ప్రాకృతికత, తెలుగుదనం, ప్రయోగాత్మకత, వస్తు శిల్ప సమన్వయం – అనే అంశాన్ని సమగ్రంగా వ్యక్తపరచే విశిష్ట కావ్యం విద్వాన్ విశ్వంగారి 'పెన్నేటి పాట'.

◆

**అభినందన**

# ద్వానాశాస్త్రి రచనలు : భాషా వికాసం




**ప్రొఫెసర్ వెలమల సిమ్మన్న**

**ఇ**టీవల కాలంలో తెలుగు భాషాభి వృద్ధి గురించి చాలా చర్చ జరుగుతున్నది. గతంలో డాక్టర్ ద్వా.నా.శాస్త్రి భాషకు సంబంధించి పలు గ్రంథాలు, వ్యాసాలు రాశారు. "ద్రావిడ సాహిత్య సేతువు ఆచార్య చల్లా", మన తెలుగు తెలుసు కుందాం", "మాటలంటే మాటలా" "ఇదీ మన తెలుగు" వంటి రచనలు చేశారు.

ఆచార్య చల్లా రాధాకృష్ణశర్మ షష్ఠిపూర్తి సందర్భంగా ద్వానాశాస్త్రి "ద్రావిడ సాహిత్య సేతువు ఆచార్య చల్లా" అనే గ్రంథాన్ని రాశారు. ద్రావిడ విశ్వ విద్యాలయం వారు 2000లో దాన్ని పునర్ముద్రించారు. శర్మగారి సువర్ణ జీవిత రేఖల్ని ద్వా.నా.గారు చాలా చక్కగా వివరించారు. ఉత్తమ పరిశోధకుడుగా, ప్రముఖ విమర్శకుడుగా, సుప్రసిద్ధ అనువాదకుడిగా, బాల సాహిత్య స్రష్టగా శర్మ ప్రతిభా పాటవాన్ని తెలుగు సహృదయ పాఠకుల అందరికీ పరిచయం చేశారు డాక్టర్ ద్వానాశాస్త్రి.

శర్మ దాదాపు 97కు పైగా గ్రంథాలు రాశారు. ఈ గ్రంథాలన్నీ ముద్రణకు నోచుకున్నాయి. అ ముద్రిత గ్రంథాలు కూడా కలుపుకుంటే ఆయనను శతాధిక గ్రంథకర్త అని మనం చెప్పవచ్చు. "విమలాదిత్య విజయం", "మణిమేఖల" లాంటి నవలలు, "ఆర్తి గీతాలు", "శ్రమలో స్వర్గం" లాంటి వచన కవితా సంపుటాలు, వాన కురిసింది" అనే గేయ సంపుటి, "సాయినాథ శతకం", "తెలుగు దాక్షిణాత్య సాహిత్యాలు", "తమిళ సాహిత్య చరిత్ర", "ప్రజాకవి వేమన", "సి.పి. బ్రౌన్ సాహిత్యసేవ" లాంటి మంచి విమర్శ గ్రంథాలు రాశారు. "తమిళ్ ఎలిమెంట్ ఇన్ తెలుగు లిటరేచర్" లాంటి పరిశోధనా గ్రంథాలు శర్మగారు వెలువరించారు. "జాతీయ కవి గరిమెళ్ళ", "దక్షిణాంధ్రులు తమిళసేవ", "చరిత్ర కెక్కిన చరితార్థులు", "బాలల పద్యాలు" లాంటి బాలసాహిత్య రచనలు, "టేల్స్ ఫ్రమ్ తెలుగు", "ఆయిరంతలై నాగం", "తిరుగతి వెంకటేశ్వరర్", తిరుక్కురళ్" లాంటి అన్య భాషా రచనలు రాశారు. "త్రిభాషా నిఘంటువు"కు ఆయన సంపాదకత్వం వహిం చారు. తిరుపతి వెంకటకవుల గొప్ప తనాన్ని తమిళులకు తొలిగా తెలియచెప్పిన ఘనత కూడా ఆయనదే అంటూ డాక్టర్ శాస్త్రిగారు చల్లావారి ఔన్నత్యాన్ని చాటి చెప్పారు.

శర్మగారు నెల్లూరులో బి.ఏ. చదువుతూ ప్రాచ్య భాషా పరిషత్‌కు కార్యదర్శిగా పనిచేశారు. కవిత్వ రచన అనేది ఆయనకు అప్పటి నుండే అలవడింది.

రాధాకృష్ణ గారు సంస్కృతం, ఆంగ్లంతో పాటు తెలుగు, తమిళ భాషల్లో అపార ప్రావీణ్యం కలిగినవారు. కన్నడ మలయాళ భాషల్లో కూడా ఆయనకు ప్రవేశముంది. తెలుగులో ఎన్ని గొప్ప రచనలు వచ్చినప్పటికి ఇతర భాషల్లోని ఆ రచనలు అంతగా అనువాదం కాకపోవడం వల్ల తెలుగు భాషా సాహిత్యాల గొప్పతనం ఇతరులకు వెల్లడి కావడం లేదని శర్మ వాపోయారు.

"నిజానికి రెండు సాహిత్యాల మధ్య గల సామ్యాన్ని ప్రదర్శించడమే కాదు తులనాత్మక సాహిత్యలక్ష్యం – అది సమగ్ర అవగాహనకు దోహదం చెయ్యాలి. సాహిత్య అంశాల మధ్య ఏకత్వాన్ని చూసేందుకు తోడ్పడాలి" అంటూ రాధాకృష్ణశర్మ పేర్కొనే వారు. అలా పేర్కొనడంలో సరిపెట్టుకోకుండా దాన్ని ఆచరించి చూపించిన శర్మగారు అక్షరాలా ద్రావిడ సాహిత్య సేతువేనని డాక్టర్ ద్వా.నా. శాస్త్రి గారు స్పష్టం చేశారు. ద్వా.నా. శాస్త్రి భాషాసేవకు, కృషికి ఈ గ్రంథం ప్రబల నిదర్శనంగా మనం పేర్కొనవచ్చు.

డాక్టర్ ద్వానాశాస్త్రి తెలుగు భాషలోని విశేష అంశాల్ని పాఠకులకు సులభంగా తెలియచెప్పడం కోసం 1997లో "మన తెలుగు తెలుసుకుందాం" అనే గ్రంథాన్ని రాశారు. "ఎన్నో పుస్తకాలు, వ్యాసాలు, దినపత్రికలు, చదివి తెలుసుకున్నవీ నాకు తెలిసినవీ, మమూలు భాషలో అందరికీ అర్థమయ్యే విధంగా చెప్పాలనిపించింది. టెక్నికల్‌గా, సీరియస్‌గా, గ్లామర్ క్లాసులా కాకుండా పాపులర్ చెయ్యాలని ప్రయత్నిం చాను" అంటూ శాస్త్రిగారు తన అంతరంగాన్ని మనకు తెలియజేశారు.

"మన తెలుగు తెలుసుకుందాం" గ్రంథం ద్వారా శాస్త్రి గారు తెలుగు పాఠకులకు, విద్యార్థులకూ, సులభశైలిలో భాషా విశేషాల్ని తెలియచెప్పారు. తెలుగు భాష ప్రాచీనత గూర్చి విపులీకరించారు. తెలుగు భాషకు గల వర్ణాలు గూర్చి తత్సమ, తద్భవ, దేశ్య, అన్య దేశ్య, గ్రామ్య పదాల గూర్చి ఆయన పేర్కొన్నారు. అచ్చ తెలుగు అంటే ఏమిటో శాస్త్రిగారు తెలియచెప్పారు. పర్యాయ పదాల, నానార్థాల గూర్చి వివరించారు. తెలుగు లిపి పరిణామ క్రమాన్ని, తెలుగు కన్నడ లిపుల మధ్య గల సామ్యాన్ని, అక్షరాల్లో క్రమేణా కలిగిన వికాసం గూర్చి చెప్పారు. ఆంగ్లంతో పాటు ఇతర భాషల పదాల్ని చివర అచ్చులు చేర్చి తెలుగు

పదాలుగా ఎలా ఉపయోగించుకుంటున్నాయో కూడా ఆయన తెలియచెప్పారు. అదే విధంగా పదాల పుట్టుక, వాటి అర్థాలు గూర్చి ఆయన తన గ్రంథంలో వివరించారు.

భాషకు సంబంధించిన చాలా విషయాలు ఇందులో చోటు చేసుకున్నాయి. అర్థాల్లో మార్పు ఎలా కలుగుతూ వుంటుందో శాస్త్రిగారు చెప్పారు. సంధులు, సమాసాల గూర్చి మాట్లాడే భాషలో వుండే అలంకారాలు గూర్చి ఆయన వివరించారు. మనకు తెలియకుండానే అనేక శబ్దాలంకారాల్ని, అర్థాలంకారాల్ని మనం మాట్లాడే మాటల్లో ఉపయోగిస్తుంటామని ఆయన వెల్లడించారు. తెలుగులో గల వాక్యనిర్మాణం గూర్చి, పదాల్లో గల చిత్ర విచిత్రాల గూర్చి, ఉచ్చారణలో చోటు చేసుకునే గమ్మత్తుల్ని గూర్చి డాక్టర్ ద్వా.నా. శాస్త్రి గారు వివరించారు.

తెలుగు మాండలిక భేదాలు, కులాన్ని, వృత్తినిబట్టి పదాలు, అర్థాలు ప్రత్యేకంగా వుండాలని తెలియజేశారు. తెలుగు భాషలోని సామెతలు, జాతీయాలు, పొడుపు కథల గూర్చి కూడా వివరించారు. భాషా రచనలో సహజంగా చోటు చేసుకునే అక్షర దోషాల్ని ఆ దోషాల్ని సవరించి తెలుగు పదాల్ని సరియైన విధంగా ఎలా రాయాలో కూడా శాస్త్రిగారు ఉదాహరణ సహితంగా పేర్కొన్నారు.

అగ్నిమాపక దళం, ఇష్టాగోష్ఠి, జయంతి, వర్ధంతి, పాత్రికేయులు, సమాఖ్య, స్పృహ, నిర్దోషి, రైతాంగం లాంటి పదాల గూర్చి కూడా ఆయన వివరించారు. ఊళ్ళ పేర్లు, మనుషుల పేర్లు ఎలా కలుగుతుంటాయో ఆయన పేర్కొన్నారు. గాడిద, కుక్క, ఏనుగు, ఊసరవెల్లి, పాము, చేపలు, గద్దలాంటి ప్రకృతి జీవుల్ని మన వ్యావహారిక భాషలో ఎలా చేర్చి వాటి గుణ గణాల్ని ఇతరులకు అన్వయించి ప్రయోగిస్తూ వుంటాయో చాలా చక్కగా శాస్త్రి వివరించారు.

శంకుస్థాపన, భరతం పడతా, ధూమకేతువు, తాతాచార్యుల వారి ముద్ర లాంటి వాటి గూర్చిన వివరణను కూడా చెప్పారు. కాలానుగుణంగా అవసరానుగుణంగా, భాషలో అనేక మార్పులు కలుగుతుంటాయని కొత్త జాతీయాలు ప్రచారంలోకి వస్తుంటాయని, సినిమాల ద్వారా కూడా డబ్బా కొట్టడం, స్పాట్ పెడతాను, అంత సీను లేదు, ఐరన్‌లెగ్ లాంటి నూతన పదబంధాలు కూడా ప్రచారంలోకి వస్తున్నాయంటూ ఆయన వివరించారు.

పత్రికల భాష గూర్చి ఆయన పేర్కొంటూ "ఈనాడు" పత్రిక వచ్చినప్పటి నుంచీ పత్రికల భాషలో మార్పులు మొదలయ్యాయని ఆయన పేర్కొన్నారు. కవితామయంగా, అలంకారికంగా, విశిష్టంగా వార్తలు అందించాలన్న తపన కన్పిస్తున్నదని "ఈనాడు" నుంచి ఇది నేడు దాదాపు అన్ని పత్రికలకు వ్యాపించిందని శాస్త్రిగారు తెలియచెప్పారు. తెలుగు పత్రికల్లో ఉపయోగించే పద ప్రయోగాన్ని తెలుగు పత్రికల్లో కన్పించే ఆంగ్ల పదాల గూర్చి పాఠకుల్ని ఆకట్టుకునే శీర్షికల గూర్చి ఆయన వివరించారు. తెలుగులోని లేఖా రచన గూర్చి, విరామ చిహ్నాల గూర్చి, ప్రకటనల గూర్చి, తెలుగు వచనం, గ్రాంథిక వ్యావహారిక రకాలు గూర్చి శాస్త్రి గారు చెప్పారు.

డాక్టర్ ద్వా.నా. శాస్త్రిగారు తెలుగు భాషను సులభశైలిలో జనరంజక పద్ధతిలో "మన తెలుగు తెలుసుకుందాం" రాసి నిజమైన భాషాసేవ చేశారని చెప్పాలి.

ప్రఖ్యాత రచయిత ఆంధ్రజ్యోతి సంపాదకులు నండూరి రామమోహన్‌రావు "మన తెలుగు తెలుసుకుందాం" గూర్చి పేర్కొంటూ "యువ రచయితలకు ముఖ్యంగా పాత్రికేయులకు వుపయోగకరం కాగలదు" అని అన్నారు.

డాక్టర్ శాస్త్రి భాషా సేవకు మరో నిదర్శనం "మాటంటే మాటలా" "ఇదీ మన తెలుగు"లో భాషలో తప్పొప్పుల్ని, పాత్రికేయులు అమలు చేయవలసిన అంశాల్ని సరళంగా అందించారు.

తమ భావాల్ని సులభతరంగా, సరళంగా, సంక్షిప్తంగా తెలియచెప్పేందుకు కొన్ని మాటల్ని వుపయోగిస్తుంటారు. పాత మాటల్ని కొత్త అర్థాల్లో వాడటం కూడా జరుగుతుంటుంది. మానవుడికి సహజంగా వుండే చమత్కార ప్రయత్నం హాస్య ప్రయత్నం, వ్యంగ్యం ఇందుకు సహకరిస్తుంటాయి. రకరకాల మాటలు, రకరకాల అర్థాల్లో వాడబడు తుంటాయని ఒకే భావాన్ని తెలియచెప్పేందుకు అనేక మాటల్ని వాడటం కూడా జరుగుతుంటుందని శాస్త్రి పేర్కొన్నారు.

ఈ విధంగా భాషకు సంబంధించిన పలు గ్రంథాలు రాసి తెలుగు భాషకు ఎనలేని కృషి చేశారు డాక్టర్ ద్వా.నా.శాస్త్రి.

**(షష్టిపూర్తి సందర్భంగా)**


సాహిత్య ప్రస్థానం

**లభించు చోట్లు**

**ప్రజాశక్తి బుక్‌హౌస్**
1-1-187/1/3, చిక్కడపల్లి,
హైదరాబాద్-20,
ఫోన్ : 27660013

**రామకృష్ణ న్యూస్ ఏజెన్సీస్**
అబిడ్స్, హైదరాబాద్.
దాని పంపిణీ కేంద్రాలలో,
ఇతర ప్రముఖ బుక్‌షాప్‌లలో

బ్రాంచీలు

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 27-19-14, యలమలవారి వీధి, నవరంగ్ థియేటర్ దగ్గర, గవర్నర్‌పేట | సుందరయ్యభవన్, బాలాజీనగర్ | 140, ప్రకాశం రోడ్, | 6-2-250, విజయటాకీస్ రోడ్, చౌరస్తా, | సుందరయ్యభవన్ సుభాష్ విగ్రహం(ఎదుట) | షాప్ నెం.10, మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్, ఆసీల్‌మెట్ట బస్టాప్, రామా టాకీస్ రోడ్ | 2/7, బ్రాడీపేట్ |
| **విజయవాడ-2** | **ఖమ్మం-507 001** | **తిరుపతి-517 502** | **హన్మకొండ-506 001** | **నల్గొండ** | **విశాఖపట్నం** | **గుంటూరు** |
| ఫోన్ :2577533 | సెల్ : 9490099349 | ఫోన్ : 2260017 | ఫోన్ : 2544559 | ఫోన్ : 230525 | ఫోన్ : 2716355 | ఫోన్ : 2277336 |

ఇంకా కావలసిన ఏజెంట్లు, సాహితీ మిత్రులు రాయండి

**సాహిత్య చరిత్ర**

# 'ఆధునిక తెలుగు కథ' కడప కథకులు



**ఆర్థికపరమైన వెనుకబాటుతనం, అక్షరాస్యుల సంఖ్య, విద్యాసంస్థల సంఖ్య తక్కువగా వుండటం, రవాణా సౌకర్యాలు, ప్రసార సాధనాలు తక్కువగా వుండటం మూలంగా నాగరికత ఆలస్యంగా నేర్పడం, పట్టణీకరణ కూడా ఆలస్యంగా జరగడం... వీటన్నింటి వలన ఆధునిక తెలుగు కథ కడప జిల్లాలో ఆలస్యంగా ప్రారంభమై వుండవచ్చునని విజ్ఞుల అభిప్రాయం.**

**అయితే వల్లంపాటి వెంకట సుబ్బయ్యగారేమంటారంటే కేవలం ఆర్థికపరమైన వెనుకబాటుతనమే దీనికి ప్రధాన కారణం కాకపోవచ్చు.**

**వి. ప్రతిమ**

"**భా**ష ఎంత పురాతనమైనదో కథ కూడా అంతే పురాతనమైనది" అంటారు చేరా గారో చోట... అంటే భాషతో పాటే కథ పుట్టింది అని. ఎటువంటి నాగరికతా నేర్వని కాలంలో కూడా ఆదిమానవుడు నిద్రపట్టని రాత్రులలో, వాన కురుస్తోన్న పగళ్ళలో కథలు చెప్పుకుంటూ, పాటలు పాడుకుంటూ గడిపేవారు...

చరిత్రలో భారతీయ భాషల్లో వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, ఇతిహాసాలూ, హర్ష చరిత్ర, కాదంబరి, కథా పరిత్యాగం, హితోపదేశం యిలా అన్నింటి లోనూ కథలున్నాయి... పిట్ట కథలో, పుట్ట కథలో మొత్తానికి అవన్నీ కథల పుట్టలే...

అయితే గత శతాబ్దపు ప్రారంభంలో పాశ్చాత్య భాషల ప్రభావం వల్ల ఆధునికతను సంతరించుకున్న తర్వాతే మనం ఈ ప్రక్రియను కథానికగా పిల్చుకున్నాం...

అంటే ఆధునిక తెలుగు కథకు నూరేళ్ళు... తెలుగు కథ పుట్టి వందేళ్ళు గడిస్తే కడపలో 1956లో భారతం నాదమునిరాజు తొలుతగా ఆధునిక కథా ప్రస్థానాన్ని ప్రారంభించినట్లుగా తెలుస్తోంది. అంటే ఆంధ్రదేశంలోని మిగిలిన ప్రాంతాలతో పోలిస్తే కడప జిల్లాలో ఆధునిక కథ ఆవిర్భావం చాలా ఆలస్యంగా జరిగింది.

ఆర్థికపరమైన వెనుకబాటుతనం, అక్షరాస్యుల సంఖ్య, విద్యాసంస్థల సంఖ్య తక్కువగా వుండటం, రవాణా సౌకర్యాలు, ప్రసార సాధనాలు తక్కువగా వుండటం మూలంగా నాగరికత ఆలస్యంగా నేర్పడం, పట్టణీకరణ కూడా ఆలస్యంగా జరగడం... వీటన్నింటి వలన ఆధునిక తెలుగు కథ కడప జిల్లాలో ఆలస్యంగా ప్రారంభమై వుండవచ్చునని విజ్ఞుల అభిప్రాయం.

అయితే వల్లంపాటి వెంకట సుబ్బయ్యగారేమంటారంటే కేవలం ఆర్థికపరమైన వెనుకబాటుతనమే దీనికి ప్రధాన కారణం కాకపోవచ్చు. ఈ విచిత్ర పరిణామాన్ని గురించి అంటే ఒక రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో సాహితీ సృజన, నాగరికత, అక్షరాస్యత ఆలస్యంగా ప్రారంభం కావడం అన్న ఈ విచిత్ర పరిణామం గురించి తప్పనిసరిగా సంతృప్తికరమైన విశ్లేషణ జరగాల్సి వుంది అంటారు.

ఇప్పుడు మనం చెప్పుకున్న నాదమునిరాజుగారు 'నీలవేణి' అన్న కథా సంపుటి వేశారు. అప్పట్నుంచి ఇప్పటిదాకా ఈ యాభయ్యేళ్ళ కాలంలో ఎందరో కథా రచయితలు కడపని తమ సాహితీ సుమ సౌరభాలతో ముంచెత్తారు. ప్రపంచంలోని ఏ యితర భాషల కథలకూ తగ్గనటువంటి రీతిలో కథా సాహిత్యాన్ని అందించారు... ప్రారంభం కావడం ఆలస్యమే అయినా ఎక్కువ మంది కథకులు, కవులు సాహిత్యాన్ని అంది పుచ్చుకున్నారు.

'కడప గడపలందు కవుల గడపలు మెండు' కదా

ఉత్తమ సృజనాత్మక రచయితగా, సాహిత్య విమర్శకుడిగా, సంపాదకుడిగా, మేధావిగా, అనువాదకుడిగా బహుముఖ ప్రజ్ఞావంతుడైన రాచమల్లు రామచంద్రారెడ్డి (రా.రా) కథలు తనదైన శైలిలో, శిల్ప నిర్మాణంలో ఏ ఇతర భాషల ఉత్తమ కథలకూ తీసిపోనివి... ఆయన ప్రచురించిన "అలసిన గుండెలు" అన్న కథా సంపుటి యువ కథానికా రచయితలకు కరదీపిక వంటిది... అలాగే 'అనువాద సమస్యలు' అన్న ఆయన పుస్తకానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చింది.

రా.రా. తన కథల్లో భాషని గురించి పెద్దగా పట్టించుకోలేదనీ, పాత్రోచితమైన సహజ సంభాషణని వాడలేదనీ అంటారు కానీ నిజానికి ఆ కాలానికి సాహిత్యంలో మాండలికపు ప్రస్తావన అంతగా లేదు. అయితే తర్వాతి కాలంలో రా.రా. కుప్పిరెడ్డి పద్మనాభరెడ్డి 'కుట్ర' కథా సంపుటికి రాసిన ముందుమాటలో భాష గురించి చాలా లోతైన చర్చ చేస్తారు. కొడవటిగంటి తనకు నచ్చిన ముగ్గురు కథా రచయితల్లో రా.రా. ఒకరుగా పేర్కొనడం విశేషం.

అదే సమయంలో జీవించిన వై.సి.వి. రెడ్డి ప్రధానంగా కవి అయినప్పటికీ కడపజిల్లా గ్రామీణ వ్యవసాయ జీవితాన్నీ, భూస్వామ్య పెత్తనాలనూ, పల్లె ప్రజల వెతలనూ కథలుగా మలచి 'గట్టి గింజలు' అన్న కథా సంపుటిని వెలువరించారు... ఇప్పుడు మనం కొత్తగా స్థానీయత, ప్రాంతీయత అంటూ మాట్లాడుకుంటున్నాం గానీ అప్పట్లో ఈ కథకులు రాసిన కథలన్నీ కూడా కడపజిల్లా పల్లె పట్టులనూ, ప్రాంతీయ జీవన విశేషాలను అద్భుతంగా ప్రతిబింబించినవే... వై.సి.వి. రెడ్డి అభ్యుదయ రచయితల సంఘం బాధ్యులుగా కూడా వ్యవహరించారు.

ఆ తర్వాతి కాలంలో పి. రామకృష్ణారెడ్డి, కుప్పిరెడ్డి పద్మనాభరెడ్డి, సొదుం జయరాం, కేతు విశ్వనాథరెడ్డి, కేతు బుచ్చిరెడ్డి, మల్లెమాల వేణుగోపాలరెడ్డి, కేశవ గోపాల్, షేక్ హుసేన్ సత్యాగ్ని వంటి వారు కన్పిస్తారు.

ఉన్నతమైన హాస్య దృష్టి, వ్యంగ్య ధోరణులతో విషాదాన్ని, అట్టడుగు జీవితాల

లోని వేదననూ, కష్టాలనూ విశదపరుస్తూ అద్భుతమైన కథలు రాసిన కుప్పిరెడ్డి పద్మనాభరెడ్డి 'కుట్ర' అన్న కథాసంపుటి ప్రచురించినప్పటికీ ఆ తర్వాతి కాలంలో సాహిత్యానికి దూరంగా వుండి పోవడం దురదృష్టకరమైన విషయం.

'పెన్నేటి కతలు' సంపుటిని వెలువరించిన పి. రామకృష్ణారెడ్డి విలక్షణ కథకుడు... నవలాకారుడు... విమర్శకుడు కూడా... నిబద్ధతతో, నిజాయితీతో సాహిత్యాన్ని వెలువరించిన వ్యక్తి... పెన్నేటి ఒడ్డున ఆయన నివసించిన హనుమన గుత్తి, ఆ చుట్టుపక్కల ప్రాంతీయ జీవితాన్ని ప్రతిబింబించిన కథలు 'పెన్నేటి కథలు'... కడపజిల్లా మాండలికాన్ని, యాసనీ లోతుగా చిత్రించిన కథలివి. వ్యవసాయ రంగానికి భూమితో వున్న అనుబంధం ఎలాటిదో వ్యవసాయంలో భాగమైన పశువులతో పెనవేసుకుని వుండే ఆత్మీయత కూడా అటువంటిదే... ఇవ్వాల్టికీ మనం గ్రామాలకి వెళ్ళినట్టయితే మన పెద్దవాళ్ళు ఎద్దు దవడలు నిమురుతూనో, గేదెలకు రుద్ది, రుద్ది స్నానం చేయిస్తూనో మనకి కన్పిస్తారు. పశువులు, మనుషులు ఒకే చోట కలిసి వుండటం, పశువులతో మనిషికున్న అనుబంధాన్ని తెలుపుతూ రామకృష్ణారెడ్డిగారు రాసిన 'మనిషి – పశువు' కడప కథా సాహిత్యంలో మైలురాయి వంటిది.

అయితే రామకృష్ణారెడ్డి కథల్లో పాఠకుడ్ని వెంటాడి, వెంటాడి వేధించి కళ్ళ నీళ్ళు పెట్టించే కథ 'కరువు పీల్చిన మనుషులు'... నూతన ఆర్థిక విధానాల ప్రవేశం మొదటగా మన దేశంలో వ్యవసాయాన్ని దెబ్బకొట్టిన విషయం మనందరికీ తెలుసు... చాలామంది రైతులు వలస పోవడం... మరికొంతమంది ఆత్మహత్యలు చేసుకోవడం జరిగిన నేపథ్యంలో నుండి ఈ కథ నడుస్తుంది... మారుతున్న జీవన విలువల్ని చాలా లోతుగా పట్టుకున్న కథ యిది...

ఒకప్పుడు తన కూతురి ప్రవర్తన మూలంగా పరువు పోతుందని ఆమె మీదికి వేట కొడవలి నెత్తిన రైతు తండ్రి... ఈ కరువు పరిస్థితుల్లో వ్యభిచార కూపంలో వున్న కూతురి వద్దకు వారం వారం వచ్చి డబ్బు తీసుకు పోతుంటాడు, పొట్ట కూటికోసం...

"ఇతర రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు, మా నాయిన చేసుకోలా అంతే... చేసుకున్నా బాగుండేది" అంటుంది

— — — — — * * * — — — —

'వాడిన మల్లెలు', 'సింహాద్రి స్వీట్‌హోం', 'సొదుం జయరాం కథలు' అన్న మూడు సంపుటాలను వెలువరించిన సొదుం జయరాం 2004లో మరణించారు... కడప నుంచి 'సంవేదన' పత్రిక వెలువడుతున్న కాలంలో జయరాం రాసిన 'వాడిన మల్లెలు' తెలుగు కథా సాహిత్యంలో సంచలనం సృష్టించింది...

— — — — — * * * — — — —

కూతురు... కరువు మూలంగా సమస్త మానవ విలువలూ ఎలా సమూలంగా నాశనమైపోతాయో, సెంటిమెంట్లు కూడా ఎలా చచ్చిపోతాయో చెప్పిన కథ యిది...

తెలుగు సాహిత్యంతో పాటు ప్రపంచ సాహిత్యాన్ని కూడా విస్తృతంగా అధ్యయనం చేసిన సొదుం గోవిందరెడ్డి తక్కువ కథలే రాసినప్పటికీ కథా సాహిత్యాన్ని విశ్లేషించడంలో అందెవేసిన చేయి... సాహిత్య అధ్యయనమే జీవితంగా గడిపిన వ్యక్తి... ఆయన రాసిన 'ప్రేమ' అన్న చిన్న కథ చదివి పాఠకుడు విస్తుపోతాడు.. దీనంగా, బలహీనంగా వున్నటువంటి ఒక మల్లెపూలమ్ముకునే ముసల్దాని ముందు తన కుహనా దాతృత్వం, వ్యక్తిత్వం ఎలా ఓడిపోతాయో, కుంచించుకుపోతాయో తాత్వికంగా చెప్పిన కథ. అంత చిన్న కథలో గొప్ప తత్వం యిమడ్చటం కథా రచయితగా గోవిందరెడ్డి ప్రజ్ఞ...

'వాడిన మల్లెలు', 'సింహాద్రి స్వీట్‌హోం', 'సొదుం జయరాం కథలు' అన్న మూడు సంపుటాలను వెలువరించిన సొదుం జయరాం 2004లో మరణించారు... కడప నుంచి 'సంవేదన' పత్రిక వెలువడుతున్న కాలంలో జయరాం రాసిన 'వాడిన మల్లెలు' తెలుగు కథా సాహిత్యంలో సంచలనం సృష్టించింది... ఒకే వస్తువుని (కథాంశాన్ని) తీసుకుని రా.రా., ఆర్వీయార్, కె. సాంబశివా రెడ్డి కథలుగా మలిచారు. అలా రాయబడ్డ నాలుగు కథలనూ రచయితల పేర్లు పేర్కొనకుండా కొడవటిగంటి కుటుంబ రావుగారి (కొ.కు) పరిశీలనకు పంపడం... ఆయన ఆ నాల్గింటిలో అన్ని విధాలా తగిన కథగా జయరాం కథను ఎంపిక చేయడం విశేషం.

జయరాం కథా సాహిత్యానికి యిరవై ఏళ్ళ పాటు దూరంగా వున్నప్పటికీ ఆ తరువాత ఆయన రాసిన 'తాకట్టు', 'మనువు' వంటి కథలు కొత్త తరానికి బాగా పరిచితమైన కథలు.. 'మనువు' కథలో పెద్ద కూతురు తన కిష్టమైనవాడితో లేచిపోతుంది. తండ్రి రాజిరెడ్డి పరువు పోయిందంటూ ఆక్రోశిస్తాడు. రెండో కూతురు సుధ 'నాకు పెళ్ళెట్లా అవుతుందా?' అని బాధపడుతుంది.

తండ్రి, చిన్న కూతురు అన్నం తినకుండా పస్తు పడుకుంటారు.. తల్లి పార్వతమ్మ అన్నం వండుకుని తింటుంటే చిన్న కూతురొక విషపు చూపు విసిరేసి వెళ్తుంది... పార్వతమ్మ మొత్తం తన జీవితాన్ని నెమరు వేసుకుంటుంది.

తనకి ఏమాత్రం యిష్టం లేకపోయినా రాజిరెడ్డితో పెళ్ళి జరగడం అతడి అపరిశుభ్రతని భరిస్తూ తను నానా యిబ్బందులూ పడటం... ఆ క్రమంలో వాకిటి గదిలోకి అద్దె కొచ్చినతనితో సంబంధం పెట్టుకుని ఈ యిద్దరు పిల్లల్ని కనడం... అన్నీ మననం చేసుకుంటుంది... ఇష్టం లేకపోయినా భర్తతో చేసేది కాపురం... ఇష్టంగా పరాయి వ్యక్తితో పడుకుంటే అది వ్యభిచారం... తన జీవితాన్ని బేరీజు వేసుకుంటూ ఆమె... ఒక కప్పు కింద బతుకుతున్నాం కానీ ఒకరి అభిప్రాయాలు మరొకరికి తెలీవు అనుకుంటుంది.

"గొర్రెనడిగి దేవర చేయరు
ఆడపిల్ల అభిప్రాయాలనడిగి పెళ్ళిళ్ళు చేయరు'

రేపు నీకయినా సరైన మనువు చేస్తానన్న నమ్మకం లేదు! అంటుంది పార్వతమ్మ చిన్న కూతురితో... స్త్రీల పక్షాన నిలబడి రచయిత ఈ కథ చెప్పిన తీరు పాఠకులని అబ్బుర పరుస్తుంది. ఆయన ఇతర కథలు కూడా విలువలతో కూడుకున్నవి... సొదుం జయరాం రాచకొండ రచనా పురస్కారాన్ని అందుకున్నారు.

పొద్దుటూరు నుండి శాసనసభ్యుడిగా పనిచేసిన ఎం.వి. రమణారెడ్డి 'పరిష్కారం' అన్న కథా సంపుటి వెలువరించారు. ఎం.వి. రమణారెడ్డి అనేక యితర రచనలు చేసినప్పటికీ కథలు రాయడం ఆలస్యంగా ప్రారంభించారు. ఆయన జైలులో వుండగా తొమ్మిది కథలు రాశారు. అందుకే మిత్రులు సింగమనేని నారాయణగారు 'రమణారెడ్డిని జైలులో పెట్టాలి' అంటూ సరదాగా వ్యాఖ్యానిస్తుంటారు. ఆ తొమ్మిది కథలతోనే 'పరిష్కారం' అన్న కథా సంపుటి వేశారాయన.

ఈ కథలు ఎక్కువ భాగం కడపజిల్లాలోని సామాన్యుడి వేదనని తెలిపేవే... పరిష్కారం అన్న కథ యిప్పటికీ రాయలసీమలో కొనసాగుతోన్న పెత్తందారీ పద్ధతులని ప్రతిబింబించడమే కాకుండా, అటువంటి పరిస్థితులు యికపై వుండరాదనీ, ఒక సామరస్యతతో చిత్రమైన... పాఠకుడికి నచ్చే మలుపుతో ఈ కథ ముగుస్తుంది... మేధావుల ప్రశంసలందుకున్నదీ కథ.

ఆ రోజుల్లోనే రమణారెడ్డిగారు రాసిన 'సాధ్వి' అన్న కథ పాఠకులని ఆశ్చర్య చకితుల్ని చేసింది. లవకుశులని పెంచి పెద్దచేసి రాముడి కప్పగించడానికొచ్చిన సీత...

"బలవంతుడైన శత్రువు ఆడదాన్ని అపహరించుకుపోతే ఆ అబలకు ఏ హానీ కలగకుండా కాపాడే బాధ్యత పురుషునిది... ఏడాది పాటు ఏ అతీ గతీ లేకుండా పరపురుషుని వద్ద వదిలిపెట్టి ఆమె శీలాన్ని శంకించడం ఏ మగవాడికయినా న్యాయ మంటారా? మగవాడి అసమర్ధతకు కూడా బాధ్యత స్త్రీలదేనా?

రావణుడు అందవిహీనుడు కాదు... ఐశ్వర్యంలో ఈ భూమండలమంతా కలిసినా అతడికి సాటిరాదని మీరే చెప్పారు.... అతడు గుణహీనుడు కాదని నా అనుభవమే చెప్తోంది... అంతటి వాడిని చీదరించి అహర్నిశలూ మీ కోసం పరితపించిన నన్ను అగ్ని పరీక్షకు గురిచేయడం అమానుషం కాదా? అంటుంది సీత... ఇది నిజంగా ఎంత గొప్ప మాట...

మంచి స్త్రీవాద కథ సాధ్వి... సీత పక్షాన నిలబడి రమణారెడ్డిగారు కథ రాయడం స్త్రీవాదుల అభిమానాన్ని చూరగొంది... ఆయన ఇతర కథలు కూడా పీడితుల పక్షాన నిలబడి రాసినవే...

అదే తరానికి చెందిన కేతు బుచ్చిరెడ్డి 'ముత్యాలు రత్నాలు', 'ఇదిగో సూర్యుడు' అన్న రెండు కథా సంపుటాలు ప్రచురించారు... ప్రేమ, కరుణ, ఆర్ద్రి, దయ వీరి కథల్లో అడుగడుగునా తొంగి చూస్తాయి. సమాజంలోని అసమానతలు, అంతరాలు వాటిలో నలుగుతున్న మనుషుల అంతః సంఘర్షణలు వీరి కథా వస్తువులు. వీరు రాసిన అనేక కథలకు బహుమతులు, సన్మానాలు పొందారు.

ఇకపోతే నాలుగు దశాబ్దాలుగా కథా రచనని కొనసాగిస్తోన్న కేతు విశ్వనాథరెడ్డి కడపజిల్లా గర్వించదగిన కథా రచయిత...

— — — — — * * * — — — — —

ఇకపోతే నాలుగు దశాబ్దాలుగా కథా రచనని కొనసాగిస్తోన్న కేతు విశ్వనాథరెడ్డి కడపజిల్లా గర్వించదగిన కథా రచయిత... కడపజిల్లా గ్రామసీమలు... యివ్వాళ ఆ గ్రామ సీమల్లో ప్రవేశించిన అనూహ్యమైన పరిణామాలలో తన వ్యక్తిత్వపు మూలాలను వెతుక్కుంటోన్న విశిష్ట కథకుడు.

— — — — — * * * — — — — —

కడపజిల్లా గ్రామసీమలు... యివ్వాళ ఆ గ్రామ సీమల్లో ప్రవేశించిన అనూహ్యమైన పరిణామాలలో తన వ్యక్తిత్వపు మూలాలను వెతుక్కుంటోన్న విశిష్ట కథకుడు. కథా రచయితగా అతడు కడప గ్రామీణ జీవితానికి సంబంధించిన అత్యధిక అంశాలను కథల్లోకి తీసుకువచ్చారు.

కడప జన జీవన వైవిధ్యాన్నీ, కరువునీ, కక్షలనీ, హత్యలనీ, ఆత్మహత్యలనీ, యింకా గ్రామీణ జీవితపు వెలుగు నీడల్నీ, మంచి చెడ్డలనీ, అభివృద్ధి క్షీణతలనీ కూడా ఆయా కాలానుగుణంగా అక్షరబద్ధం చేస్తూ వచ్చిన రచయిత కేతు విశ్వనాథరెడ్డి. ఆయన భౌతికవాది, పీడిత జన పక్షపాతి.

వీరి కథల్లో 'నమ్ముకున్న నేల', 'కూలిన బురుజు', 'గడ్డి' వంటి ఎన్నో కథలు కడపజిల్లా స్థానీయతను ప్రతిబింబించినవే... అలాగే స్త్రీల పక్షాన నిలబడి రాసిన పురుష రచయితల్లో విశ్వనాథరెడ్డి పేరు ప్రధానంగా చెప్పుకోవచ్చు. ఆయన కథల్లో చాలాచోట్ల రూపానికంటే సారానికే ప్రాధాన్యతనివ్వడం మనకి కన్పిస్తుంది... అలాగని ఆయన కథల్లో శిల్పం వుండదా అని మనం అనుకుంటే పొరబడినట్లే... వల్లంపాటిగారన్నట్లు తన భావజాలానికి వ్యతిరేకులైన వారి దృక్పథం నుండి కథ చెప్తూ, తన దృక్పథానికి ఎటువంటి హాని కలగకుండా కాపాడుకోగల నైపుణ్యం, కథన చాతుర్యం వీరి కథల్లో మనం చూస్తాం.

కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారంతో పాటు యింకా అనేక ఇతర జాతీయ, రాష్ట్రీయ పురస్కారాలను ఆయన అందుకున్నారు... అంతేగాక ఆచార్యులుగా దూరవిద్యా విధానంలో తెలుగు భాషా సాహిత్యాలను సమకాలీన సమాజ అవసరాల కనుగుణంగా ఆధునీకరించడానికి ఆయన ఎంతగానో కృషి చేశారు...

శిరీష అన్న పేరుతో అనేక కథలూ, నవలలూ రాసిన మల్లెమాల వేణుగోపాల్‌రెడ్డి నవలా రచయితగా కంటే కథకుడిగా ప్రజ్ఞులు... ఆయన కథల్లో భాష, శైలి, శిల్పం అంటే కథకు వుండాల్సినటువంటి స్వరూప స్వభావాలు చక్కగా అమిరిపోతాయి. ఇటువంటి కథలు చూసినప్పుడే ఒక చక్కని కథా వస్తువు తనంతట తానుగా శిల్పాన్ని ఎంచుకుంటుంది అన్న విషయం గుర్తొస్తుంది.

మల్లెమాల వేణుగోపాల్‌రెడ్డిగారు రచయితయిన డాక్టరు... డాక్టరయిన రచయితా కాబట్టి - దాదాపుగా ఈ వస్తువులన్నీ ఆయన జీవన పరిధిలో వున్నవే కాబట్టి ఎక్కడ మొదలుపెట్టాలో... ఎక్కడ ముగించాలో ఆయనకి బాగా తెలుసు. కాబట్టి శిల్పం తనంతట తానుగా, అత్యంత సాధారణంగా కుదిరిపోతుంది.

'వ్యక్తం కంటే అవ్యక్తంలోనే నివురూ వుంటుంది, శీతువూ వుంటుంది. అదే శిల్పమంటే... అదే అనిర్వచనీయత... క్రింది అనుభూతికి పై మెట్టు... రసగుణ పారాణులయిన మంచి చదువరులు ఆనందకోశాన్ని తృప్తి పరచుకునేది ఇటువంటి గొప్ప కథల పఠనంతోనే అంటారు విహారిగారు మల్లెమాల కథల గురించి మాట్లాడుతూ...

మల్లెమాలగారికి జీవితమూ, సాహిత్యమూ వేరువేరు కావు... సాహిత్యంలో ఏదైతే చెప్తారో, జీవితంలో కూడా అదే అభ్యుదయ భావాలతో జీవిస్తారు... మిత్రుడు శశిశ్రీ అన్నట్లుగా జీవితంలో, రచనలో, మాటలో సామ్యం సాధించిన వ్యక్తి మల్లెమాల...

ఖాజా 'పుట్టుమచ్చ'తో ముస్లిం ప్రజల అస్తిత్వ వేదన సాహిత్యంతో మొదలయిందనీ, ముస్లిం స్త్రీల జీవితాల్లోని కష్టాలను, కన్నీళ్ళను, బురఖాలను, తలాక్‌ను నిరసిస్తూ షాజహానా మంచి కథలు రాస్తోందనీ యిప్పుడు మనకు తెలుసు. అయితే ఎనభయ్యో దశకంలోనే షేక్ హుసేన్ సత్యాగ్ని ముస్లిం స్త్రీల జీవితాల్లోని చీకటి కోణాలను బహిర్గతం చేస్తూ మంచి కథలు రాశారు.

బురఖా పద్ధతిని నిరసిస్తూ, తలాక్ అన్న సంప్రదాయం మూలంగా ఎంతమంది ముస్లిం స్త్రీల జీవితాలు ఛిద్రమయి పోతున్నాయో అప్పట్లోనే సత్యాగ్ని చాలా లోతుగా, ఆర్తితో కథలు రాశారు. 'యంత్రం' అన్న కథలో వరుసగా ఆడపిల్లల్ని కన్నందుకు రజియాను ఆమె భర్త మూడుసార్లు తలాక్ అని అరిచి వదిలి పెట్టేస్తారు. కొన్నాళ్ళ తర్వాత ఆమె తల్లిదండ్రులు ఆమెని మళ్ళీ పెళ్ళి

చేసుకోమంటూ బలవంతంగా ఒప్పించాలని ప్రయత్నించి నపుడు నిర్ద్వందంగా రజియా ఎదిరిస్తుంది... తాను లాయరై మరెందరో స్త్రీలకు జరుగుతోన్న యిటువంటి అన్యాయాలను తాను ఎదుర్కోవాలని నిర్ణయించు కుంటుంది.

అలాగే 'ఖులా' అన్న కథలో భార్యని తన తండ్రి కట్టుబానిసగా చూస్తుంటే... తన తండ్రి చేసేదే సరయినదనీ మామ చెప్పినట్లు పడుండమని ఆదేశిస్తాడు భార్యని హుసేన్ భాషా... నాదిరా అది జీర్ణించుకోలేదు. చాలారోజుల తర్వాత పుట్టింటికి పంపమని అడిగినందుకు ఆమెకి నీచమైన సంబంధం అంటగట్టి... తలాక్ నోటీసు పంపుతాడు...

కట్టుబానిసలా అతడికీ, అతడి కుటుంబానికీ నానాచాకిరీ చేస్తూ నేను పడుండలేను. నాకు 'మెహర్' అక్కర్లేదు.... నేనే అతడికి 'ఖులా' యిస్తాను అంటుంది నాదిరా... ముస్లిం స్త్రీల దుర్భర పరిస్థితులను తెలియ జేయడం కోసం షేక్ హుసేన్ సత్యాగ్ని రాసిన ఈ కథలన్నింటినీ 'పాచికలు' అన్న కథా సంపుటిగా ప్రచురించారు స్కైబాబు ఇటీవల...

'కథా ప్రస్థానం', 'దారి తప్పిన యాత్రికులు', 'పగటి చుక్కలు' వంటి మూడు కథా సంపుటాలు ప్రచురించిన డా॥ ఎన్. రామచంద్ర కడప జిల్లా నుండి పేర్కొనదగిన మరో కథకుడు.... వీరు ఎక్కువగా స్త్రీ జనాభ్యుదయ దృక్పథంతోనే కథలు రాయడం జరిగింది. వీరి కథల్లో 'సెంటు నాయుడు', 'యుగముని వ్యవసాయం' చెప్పుకోదగిన కథలు. వీరికి పేరు తెచ్చిపెట్టినవి...

ఆధునిక కథా సాహిత్యంలో కడప రచయితల పాత్ర యిదంతా ఒక ఎత్తయితే ఈ మూడో తరం... యిప్పుడు బలంగా వీస్తోన్న గాలి యివ్వాల్టి యువ రచయితలు మరో ఎత్తు...

గత పది పదిహేనేళ్ళ తెలుగు కథని గాని మనం పరిశీలించినట్లయితే అంటే కడప అనే కాదు మొత్తం మీద యివ్వాళ తెలుగు కథ కేవలం కాలక్షేపం బఠానీ అయితే కాదు... దేశీయంగా, జాతీయంగా, అంతర్జాతీయంగా వచ్చిన, వస్తోన్న మార్పులన్నింటినీ కూడా కథల్లో ప్రతిబింబిస్తూ రాస్తున్నారు యువ రచయితలు... పేరు కోసమో, డబ్బు కోసమో కాకుండా సమాజం పట్ల ఒక బాధ్యతతో, నిబద్ధతతో సాహిత్యాన్ని సృష్టిస్తున్నారు.

మన రాష్ట్రంలో మిగిలిన ప్రాంతాలకంటే కూడా ముందే కడప జిల్లా నుంచి అనేకమంది స్త్రీలు కువైట్ వంటి గల్ఫ్ దేశాలకు వెళ్ళి కుటుంబాన్ని సాకాలనుకోవడం ఎక్కువగా కన్పిస్తుంది. ఈ నేపథ్యంలో నుండి చక్ర వేణు రాసిన 'కువైట్ సావిత్రమ్మ' చాలా లోతుగా, హృద్యంగా జీవితాన్ని పట్టుకున్న కథ... జీవితాన్ని, కుటుంబాన్ని రక్షించుకోవడం కోసం సావిత్రమ్మ కొంగుపరిచి డబ్బు సంపాదించిన వైనాన్ని, విషాదాన్ని చిత్రిస్తూ చక్ర వేణు సావిత్రమ్మ మరిది తన భార్యను కూడా ఈసారి సావిత్రమ్మతో పాటు కువైట్ తీసుకెళ్ళాలని కోరడమనే దృశ్యాన్ని చిత్రిస్తాడు. అది పాఠకుడి హృదయాన్ని హృదయ విదారకంగా తాకుతుంది.

ప్రాణాధికంగా ప్రేమించిన పశువుల్ని రైతు మేతలేక కరువు మూలంగా కబేళాలకు అమ్ముకోవలసిన పరిస్థితిని లోతుగా చిత్రించిన కథ 'కసాయి కరువు'... చక్ర వేణు రాసిన ఈ రెండు కథలూ కూడా ఆధునిక కథా సాహిత్యంలో శాశ్వత విలువను సంపాదించుకున్నాయి... అతి చిన్న వయసులో మరణించకుండా వున్నట్లయితే కడప జిల్లా స్థానీయతను ప్రతిబింబించే మరిన్ని కథలు ఆయన కలం నుండి వెలువడి వుండేవి... చక్ర వేణు 'కొత్త చదువు' అన్న కథా సంపుటి వెలువరించారు.

వరుసగా వర్షాలు లేకపోవడం, పంటలన్నీ తడి లేక ఎండిపోవడం, సాగునీటి సంగతలా వుంచి గుక్కెడు తాగు నీటికి కూడా కటకటలాడి పోవడం, కరువు, దాని మూలంగా ఏర్పడిన కక్షలూ... వీటన్నింటి వలన మొత్తం గ్రామీణ జీవితం విధ్వంసమయి పోవడం... వ్యవసాయంతో పాటు వ్యవసాయాధారిత మిగిలిన చేతివృత్తులన్నీ కూడా నశించిపోవడం ఈ మొత్తం కడప గ్రామీణ జీవన చిత్రాలన్నింటినీ కూడా యువ రచయితలు కథల్లో ప్రతిఫలిస్తూ వచ్చారు...

— — — — * * * — — — —

చక్రవేణు 'కసాయి కరువు', 'కువైట్ సావిత్రమ్మ' వంటి శాశ్వత విలువలు కల్గిన కథలు రాసిన సమయంలోనే మతోన్మాదాన్ని ప్రతిబింబిస్తూ 'మసీదు పావురం', 'మురళి వూదే పాపడు' వంటి కథలు రాసిన దాదా హయాత్ క్రమంగా కడపజిల్లాకు సంబం ధించిన ప్రత్యేకమైన సమస్యల మీద దృష్టి సారించారు.

— — — — * * * — — — —

చక్రవేణు 'కసాయి కరువు', 'కువైట్ సావిత్రమ్మ' వంటి శాశ్వత విలువలు కల్గిన కథలు రాసిన సమయంలోనే మతోన్మాదాన్ని ప్రతిబింబిస్తూ 'మసీదు పావురం', 'మురళి వూదే పాపడు' వంటి కథలు రాసిన దాదా హయాత్ క్రమంగా కడపజిల్లాకు సంబం ధించిన ప్రత్యేకమైన సమస్యల మీద దృష్టి సారించి 'సెగ మంటలు', 'గుక్కెడు నీళ్ళు', 'ఎల్లువ' వంటి గొప్ప కథలు పాఠకుల కందించారు. తాగడానికి 'గుక్కెడు నీళ్ళు' దొరక్క మరణించిన ముసలమ్మ జిల్లాలోని నీటి ఎద్దడినీ, కరువునీ కళ్ళకు కడుతుంది.

దాదా హయాత్ అనువాదకుడు కూడా... అరవై కథలు రాసిన దాదా హయాత్ యింతవరకూ సంపుటి తీసుకురాకపోవడం దురదృష్టం... పొద్దుటూరులో న్యాయవాద వృత్తిలో వున్నారు.

విస్తృతమైన జీవితానుభవంతో సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలని నిశితంగా పరిశీలించి, అర్థం చేసుకుని వైవిధ్యభరితమైన కథలు రాసిన నన్నపురెడ్డి వెంకట్రామిరెడ్డి యివ్వాళ రాస్తోన్న యువ కథా రచయితల్లో నిస్సందేహంగా మొదటి స్థానంలో నిలుస్తారు.

చనుబాలు, కొత్త దుప్పటి, కన్నీటి కత్తి, పాటలబంది, తడి యిలా ఆయన రాసిన యాభై కథల్లో ఏ కథను స్పృశించినా ఒక్కొక్కటి ఒక్కొక్క చరిత్ర.... గ్రామీణ రైతు జీవితం ఆయనలో ఎంతగా మమేకమై పోయిందంటే నిరంతరం తన వేళ్ళని పొలాల్లో వెతుక్కుంటున్న వ్యక్తి వెంకట్రామిరెడ్డి... అంతేకాకుండా ఆయన కథల్లోని ఉపమానాలన్నీ కూడా పొలాల్లోనే దొరుకుతాయి... స్త్రీని వర్ణించాల్సి వచ్చినా సరే చాలా ఉన్నతంగా ప్రకృతిలోకెళ్ళి తగిన ఉపమానాలని పట్టుకొస్తాడు.

జిల్లాలో వ్యవసాయం ఉద్ధాన పతనాల గురించీ, దళిత జీవిత సమస్యల గురించీ, వలసల గురించీ, ఒకే కుటుంబం లోని మనుషుల మధ్యన సంబంధాలు ఆర్థిక సంబంధాలుగా మారి పోతున్న వైనాన్ని గురించీ ఏది రాసినా సరే ఒక కొత్తదనం, ఒక సార్వజనీనం... జిల్లాలోని వివిధ సామాజిక సంబంధాలలోని ఆధిపత్య రూపాల గురించి లోతైన పరిజ్ఞానంతో స్థానిక జీవితాన్ని విశదంగా పాఠకుల ముందు పరిచిన రచయిత యితడు... వస్తువు మాత్రమే కాకుండా కథన చాతుర్యమూ, భాష నిండుగా కలిగిన ఈ రచయిత ఒక ప్రత్యేకమైన జీవన దృక్పథం

కల్గిన వ్యక్తి... 'అమ్మ', 'తడి', 'తమ్ముడి ఉత్తరం' నాటి నుండీ కూడా పాఠకులకు ఎంతగానో చేరువైన రచయిత. ఆయన కథలనేకం యితర భాషల్లోకి అనువదింప బడ్డాయి...

జీవితాన్ని కవిత్వంతో మమేకం చేసుకున్న రాధేయ కథలు కూడా రాశారు. అందునా కడప జిల్లాకు సంబంధించిన రచయిత అనుకుంటే ఆశ్చర్యం వేస్తుంది. చాలామందికి రాధేయ అనంతపురంకి సంబంధించిన వ్యక్తిగానే తెలుసు. కవుల్లోని ప్రతిభను వెలికితీసే క్రమంలో ఆయన స్వంతంగా ఉమ్మిడిశెట్టి సాహితీ పురస్కారం స్థాపించి గత యిరవై సంవత్సరాలుగా నిరాఘాటంగా సాగిస్తూ వస్తున్నారు. ఆయన కథల్లో కూడా అక్కడక్కడా కవిత్వాంశ తొంగి చూస్తూ వుంటుంది. తక్కువ కథలే రాసినప్పటికీ ప్రతీ కథా పాఠకుల అభిమానం చూరగొన్నది.

ప్రధానంగా అనువాద కథకుడైన కొమ్మిశెట్టి మోహన్ 'పాశం' అన్న అనువాద కథల సంపుటిని ప్రచురించారు... 'మార్జాలోపాఖ్యానం' వంటి కథలను రాసి పాఠకులకు దగ్గరయ్యారు.

కడప జిల్లా మాండలికాన్నీ, యాసనీ లోతుగా పట్టుకుని యివ్వాల్టి గ్రామీణ జీవితాన్ని, వలసలనీ, అణగారిపోతున్న వృత్తులనీ, కళలనీ కూడా తన కథల్లో ప్రస్తావిస్తూ వస్తోన్న తవ్వా ఓబుల్‌రెడ్డి సాహితీ లోకంలో తనదైన స్థానాన్ని ఏర్పరచుకున్నారు. ఇరవై కథలు పైగా రాసిన ఈ రచయిత సంపుటి వేయాల్సి వుంది. ఇటీవల అచ్చిగారి రాజేంద్రప్రసాద్‌తో కలిసి 'కడప కథ'కు సంపాదకత్వం వహించారు.

అలాగే 'సెప్పుకింద పూలు', 'చుక్క పొడిచింది' వంటి ఆకట్టుకునే కథలు రాసి ఆ తర్వాత చాలాకాలం మౌనంగా వుండిపోయిన పాలగిరి విశ్వప్రసాద్ ఇటీవలే 'చుక్క పొడిచింది' అన్న కథా సంపుటి ప్రచురించడం ముదావహం. అతడి కలం నుంచి మరిన్ని మంచి కథల కోసం సాహితీ జగత్తు ఎదురుచూస్తోంది.

ఇవ్వాళ ఇటువంటి ప్రామిసింగ్ రైటర్స్ కడపలో చాలామందే వున్నారు. జీపొచ్చిందంటూ సాహితీ లోకంలోకి దూసుకొచ్చిన నేంపల్లె షరీఫ్, 'శిలబండి' రాసి సర్వ సాహితీ లోకాన్ని తన వైపుకు తిప్పుకున్న

— — — — * * * — — — —

తొలి తెలుగు కవయిత్రి తాళ్ళపాక తిమ్మక్క ఉద్భవించిన నేల మీద, మొల్ల 'రామాయణం' రాసిన నేల మీద స్త్రీ రచయితలు లేకపోవడం నిజంగా దురదృష్టకరం. రాణీ పులోమజాదేవి కడపకి సంబంధించిన రచయిత్రిగా తెలుస్తోంది.

— — — — * * * — — — —

వేంపల్లె గంగాధర్ యిద్దరూ కూడా కడప గ్రామీణ జీవితాల మీద ప్రభుత్వం యొక్క పెత్తనాన్ని, అంటే వ్యవసాయం యివాళ రైతుకి సంబంధించింది కాకుండా ప్రభుత్వానికి సంబంధించిందయి పోయిన వైనాల్నీ, సన్నకారు రైతులంతా కూలీలుగా మారిపోతున్న విధానాన్ని తమ కథల్లో నమోదు చేస్తూ వస్తున్నారు.

ప్రాథమికంగా పాత్రికేయుడే అయినప్పటికీ అనేకమంది యువ కథకులను జిల్లా నుండి ప్రోత్సహిస్తూ 'సాహిత్య నేత్రం' వంటి పత్రికను నడిపిస్తూ విస్తృతంగా కవిత్వం రాసే 'శశిశ్రీ' అరవై కథలకు పైగా రాశాడంటే ఆశ్చర్యమేస్తుంది. ఇటీవలే అతడు ప్రచురించిన 'దహేజ్' కథా సంపుటి పాఠకుల ప్రశంసలనందుకుంది.

విస్తృతంగా బాలల కథలు రాసిన డి.కె. చదువుల బాబు సమాజ సంబంధిత కథలను కూడా యాభైకి పైగా రాశాడు. బాలల రచయిత ప్రసిద్ధుడు. కథలు కాక కవితలు, వ్యాసాలు, నాటకాలు కూడా రాశారు.

ఇంకా ఆరవేటి శ్రీనివాసులు, ముంగర శంకరరాజు, ఎన్.ఎస్. ఖలందర్, మాజి వేముల రమణారెడ్డి, డి.రామచంద్రరాజు వంటి ఎందరో కథా రచయితలు కడప కథా సాహిత్యాన్ని సుసంపన్నం చేస్తున్న వారే...

అయితే కడప కథా సాహిత్యంలో నాక్కన్పించిన లోటు అంటే ఆధునిక కథా సాహిత్యంలో స్త్రీ రచయితలు లేకపోవడం...

తొలి తెలుగు కవయిత్రి తాళ్ళపాక తిమ్మక్క ఉద్భవించిన నేల మీద, మొల్ల 'రామాయణం' రాసిన నేల మీద స్త్రీ రచయితలు లేకపోవడం నిజంగా దురదృష్టకరం. రాణీ పులోమజాదేవి కడపకి సంబంధించిన రచయిత్రిగా తెలుస్తోంది. యాభైకి పైగా కథలు రాశారు... యింకా బసిరెడ్డి రాజేశ్వరి, పసుపులేటి పద్మావతి, బి. పద్మావతి, ఇటీవల మంచి కవిత్వంతో సాహితీ లోకంలోకి అడుగుపెట్టిన వనజాక్షి వంటి వారు స్త్రీ రచయితలు వున్నప్పటికీ యింకా స్త్రీలు రాయాల్సిన అవసరం వుంది.

ఇంతమంది కథా రచయితలను గురించి చెప్పుకుని నందలూరు కథా నిలయం గురించి చెప్పుకోనట్టయితే అది లోపంగానే మిగిలిపోతుంది. నిజానికి కథా రచయితల కంటే కూడా ఎక్కువగా కథని ప్రేమించే అచ్చిగారి రాజేంద్రప్రసాద్ వ్యక్తిగతంగా 'కథా నిలయం' సంస్థాపకుడు... శ్రీకాకుళంలో కూడా మాస్టారు ఏర్పరచిన కథా నిలయాన్ని చూసి స్ఫూర్తి పొంది ఈ కథా నిలయాన్ని స్థాపించాడు. అంతేకాకుండా కడపజిల్లా విశిష్ట కథకుడు కేతు విశ్వనాథరెడ్డి పేరుతో ప్రతి యేటా ఒక కథా రచయితకి పురస్కారాన్ని అందిస్తూ వస్తున్నారు. అనతి కాలంలోనే ఈ పురస్కారం ప్రతిష్టాత్మకంగా సాహితీ లోకంలో ప్రశంసలందుకోవడం విశేషం.

ఈ వ్యాసం ప్రారంభంలో మనం ఒకే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లోని అసమ అభివృద్ధి గురించి... సీమలో సాహిత్యం ఆలస్యంగా ప్రారంభం కావడం గురించీ ప్రస్తావించుకున్నాం...

ఈ వ్యాసం రాయడం పూర్తయ్యే వేళకి మరో మంచి వ్యాసం చదివే అవకాశం నాకు లభించింది. 'రాయలసీమ అస్థిత్వ స్పృహ' గురించి పాణి రాసింది...

"చైతన్యవంతమైన మధ్యతరగతి లేకపోవడం... అణగారిన ప్రజలను ఆయా సమయానుకూలంగా ఉద్యమ స్ఫూర్తినందించే సరైన మార్గదర్శకత్వం లేకపోవడం, చరిత్రను, ఆర్థిక రాజకీయాలను, సంస్కృతిని ప్రజాస్వామిక దృక్పథంతో వెలికితీసి వ్యాఖ్యానించడంలో లోపం జరగడం యివన్నీ కారణాలు కావచ్చు. బలీయమైన భూస్వామ్య సంబంధాలున్న చోట ప్రాంతీయ స్పృహ, అసమ అభివృద్ధి వ్యూహానికి, పాలకుల వివక్షకు వ్యతిరేకంగానే కాక స్థానిక సమాజంలోని ఆధిపత్య నిర్మాణాలకు వ్యతిరేకంగా విస్తరించ వలసి వుంటుంది" అన్నది ఆ వ్యాసంలోని సొంత సారాంశం.

ఇది చదివాక ఏదో సమాధానం దొరికినట్లుగా అయింది.

**('మల్లెమాల కథలు' ఆవిష్కరణ సభలో కడపలో సమర్పించిన పత్రం)**

## సాహిత్య చరిత్ర

# ఖమ్మం కథాసుధ

రౌతు రవి



అటు భద్రాద్రి నానుకొని గోదావరి, ఇటు స్థంభాద్రి నానుకొని మున్నేరు. నడుమ నర్తన చేయు కన్నె కిన్నెరసాని. నల్లబంగారం, గ్రానైట్, డోలమైట్ గనులు సహజ సంపదలతో పాటు సహజ సాహితీ సంపద కల్గిన జిల్లా ఖమ్మం. ఎన్నో సాహితీ ప్రత్యేకతలు కల్గిన కథా రచయితల జీవిత విశేషాలు. వారి రచనా రమ్యతను తెలిపే వ్యాస మాలికే 'ఖమ్మం కథాసుధ'. రచయిత తాటి కొండల నరసింహారావుగారు కవిత్వం, కథ, వ్యాసాలు మొదలగు ప్రక్రియలలో ఎంతో అనుభవం కల్గినవారు. 'అపురూప' పత్రికకు సంపాదకులుగా కూడా ఉన్నారు. వీరు బహుముఖ ప్రజ్ఞాశాలి.

రాయలసీమలాంటి ప్రాంతాలలో కథ పరవళ్ళు తొక్కుతున్న సంగతి మనకు తెలుసు. అలాంటి ప్రాంతం వారు కూడా చేయని ఒక చక్కని ప్రయత్నం. ఖమ్మంజిల్లా కథకుల చరిత్రను కథాసుధగా పుస్తక రూపంలో తీసుకురావడం 'ఏ గూటి చిలక ఆ గూటి పలుకన్నట్లు' తన గూటికి సంబంధించిన సాహితీకారుల చరిత్రను ఎంతో శ్రమ కోర్చి ఏర్చి కూర్చినారు.

ఈ పరిశోధనాత్మక వ్యాసాలలో తొలి తరం కథకులు మాడపాటి రామచంద్ర రావు నుండి నేటి సామాజిక స్పృహతో కథలు రాస్తున్న శిరంశెట్టి కాంతారావు. దీప్తి, నీలిమల దాకా వారి జీవిత విశేషాలు, శైలి, మాండలికాలు, వారి వారి సామాజిక నేపథ్యాలు, సామాజిక ఉద్యమాల ప్రభావం, పాత్ర చిత్రణలోని వారి చైతన్యం ఇలా ఎన్నో విషయాలను వీరు విశ్లేషించారు.

మొట్టమొదటి తెలుగు టాకీ 'భక్త ప్రహ్లాద'లో గేయాలు, మాటలు రాసిన రచయిత చందారి కేశవదాసుని సంబంధించి విశేషాలు, ఆయన రాసిన 'కనకతార' నాటకం యొక్క ప్రత్యేకతలు నేటి తరానికి తెలియనివే. ప్రతి నాటకానికి ముందర పాడుకొనే "పరబ్రహ్మ పరమేశ్వర" అనే ప్రార్థనాగీతం ఈయనే రాశారని తెలిసి ఖమ్మం కళాకారులు ఆశ్చర్య పోయారు. ఖమ్మం వాసి ఈ చందాల కేశవదాసని కథా సుధ చదివాకనే చాలామందికి తెలిసింది.

1923లో తొలి కథకులు 'అడవిగాచిన వెన్నెల' రచయిత మాడపాటి రామచంద్రరావు, దేశ్‌ముఖ్ సోమరాజు రామానుజరావు, జమిందారు పర్సా దుర్గాప్రసాదరావులు కూడా కథలు రాశారని, ఆ రోజులలో సాహితీ జీవుల అధ్యయనం ఎలా వుండేది. ఉర్దూ భాషా ప్రభావం, వ్యవహారి కంలో రచనలు చేసింది ఎవరు ఇలా ఎన్నో విషయాలు చెప్పారు తాటి కొండాల వారు. ఆనాడు ఖమ్మం కథకులు కథ కోసం కథ రాయలేదు. ప్రజా చైతన్యం కోసం, దోపిడీకి, నైజాం పీడనకు వ్యతిరేకంగా కలం పట్టారు.

కలాన్ని, తుపాకిని కూడా పట్టిన యోధులకు పుట్టినిల్లు ఖమ్మం. 'నా తెలంగాణా కోటి రతనాల వీణ'. 'నైజాం రాజు జన్మ జన్మల బూజు' అంటూ తెలంగాణా పోరాటంలో పాల్గొన్న దాశరథి కృష్ణమాచార్య, హీరాలాల్ మోరియా, రావెళ్ళ వెంకట రామారావు, పుల్లాబొట్ల వెంకటేశ్వర్లు, ఖమ్మంజిల్లా ఆదికవి 'వరాహ పురాణకర్త' హరిభట్టు, కవిరాజ మూర్తిగా పేరొందిన సర్వదేవభట్ల నరసింహ మూర్తి, బెల్లంకొండ చంద్రమౌళి శాస్త్రిగారు. వీరందరు నాటి ప్రజా ఉద్యమాల స్ఫూర్తితో కలం పట్టిన మొదలైన వారి రచనలు, విశేషాలు చోటు చేసుకున్నాయి.

ఆదిరాజు వీరభద్రరావుగారి "ఆదిలక్ష్మి' కథ తెలంగాణా పదాలతో, గ్రాంథిక భాషతో సాగిన ప్రాచుర్యం పొందిన కథ. ఇది నిరక్షరాస్యత తెచ్చే అమాయకత్వపు ప్రమాదాన్ని తెలిపే కథ.

'మణెమ్మగారి మనవడు'' ధూమ పాన వ్యతిరేక సందేశాన్నిచ్చిన ప్రామాణిక భాషలో సాగి కథగా చెప్పారు. దీని రచయిత ఇటికాల నీలకంఠరావుగారు. పర్సా దుర్గాప్రసాద్‌రావుగారి "గెలుపు మనదే" కథా సంపుటి, ఏడు కథలతో కూర్చినది. ఇందులోని రెండు జెండాలు కథ "తెలంగాణా తొలి తరం కథలలో" స్థానం సంపాదించినది. భాషా శైలి కథా కథనాలలో ఉత్తమమైన సంపుటిగా నాడు పేరొందినది. శ్రీ తాళ్ళూరి రామానుజ స్వామిగారు ఉత్తమ పురుషలో కథ చెప్పడంలో సిద్ధహస్తులని, వీరికి సామాన్యులే కథా వస్తువని తెలిపారు.

నాటితరం కథకుల విషయాలే కాకుండా, నేటితరం కథకుల విషయాలు కూడా తెలియజేశారు రచయిత మాడపాటి రామచంద్ర రావు, ఆదిరాజు వీరభద్రరావు, నీలకంఠ రావు, బెల్లంకొండ లక్ష్మణసూరి, డి. రామలింగం, శొంఠి కృష్ణమూర్తి, కొలిపాక మధుసూదన రావు, చావా శివకోటి, దిలావర్, జాతశ్రీ, రావులపాటి, శిరంశెట్టి, సాదనాల, అఫ్సర్, వంశీకృష్ణ, యాకూబ్, షాజహానా, హరీష్, దీప్తి, జీవన్ మొదలగు 36 మంది కథకుల విశేషాలను కూర్చిన ఈ వ్యాసాలు ఖమ్మంజిల్లా సాహిత్య చరిత్రగా చెప్పవచ్చు. భావితరాలకు జిల్లా చరిత్రను 'ఖమ్మం కథా సుధ' రూపంలో అందించి, ఒక మంచి రచయితగా తన బాధ్యతను నిర్వర్తించారు రచయిత. తాటికొండలవారి ఈ శ్రమను జిల్లా సాహితీవేత్తలందరరూ అభినందించారు. 'కథా సుధ' ప్రతి సాహితీకారుని ఇంట, గ్రంథా లయాల లోను ఉండదగినది. వీరి కలం నుండి మరిన్ని రచనలు రావాలని ఆశిస్తూ 'సాహితీ స్రవంతి, ఖమ్మంజిల్లా కమిటీ' రచయితకు అభినందనలు తెలియజేస్తున్నది.

★

# బాలల ప్రపంచంలోకి...

**విద్య అనే పుష్పానికి 'పఠనం' అనేది ఒక పూరేకు మాత్రమే. మానసిక, శారీరక శిక్షణ పొందిన వారిగా తయారు చేయడం ఉపాధ్యాయుని విధి. అద్భుత కథల ద్వారా, ఆట పాటల ద్వారా ప్రకృతి సౌందర్యంతో వారి హృదయాల్ని పరులకు మేలు చేయడానికి ఉత్తేజం కల్గించాలి. బాలలు ఆలోచించేటట్లు చేయడం ఉపాధ్యాయుని అత్యంత సూక్ష్మ గుణాల్లో ఒకటి. ప్రకృతి మధ్యలో ఆలోచించుకొని, చుట్టూ చూసి అనుభూతి చెందే అవకాశం బాలలకు యివ్వాలి. ఆలోచింప చేసే పాఠాలు ప్రకృతిలో జరపాలి.**

## టి. రత్నమయ్య

విద్యను వికసించిన పుష్పంగా భావిస్తే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల, ఆటలు, పాటలు, ప్రకృతి, పరిసరాలు. తోట పని, కథలు, పుస్తకాలు, విహార యాత్రలు. ఇవన్నీ పూరేకులు. పైవీ అన్నిటి సమిష్టి కృషియే "బాలల సంపూర్ణ విద్యా వికాసం."

**తల్లిదండ్రులు :** తల్లిదండ్రుల ప్రేమకు ఫలితం పిల్లలు. వారి ఆలనా పాలనా, పోషణలోనే బాలలు జీవితం గడపాలి. తల్లిదండ్రులు తమ పిల్లలు శుభ్రత పాటించేలా చూడాలి. కడిగిన ముత్యాల్లా కనబడేలా తయారు చేయాలి. నైతిక, ఉన్నత ప్రమాణికత గల తల్లిదండ్రుల అడుగుజాడల్లో పిల్లలు నడుస్తారు.

పిల్లలు సరసమైన వారుగా, ఉదార హృదయులుగా తయారగుటకు కుటుంబం ఆధారం. పిల్లలే కుటుంబ దర్పణం. ఒక నీటి బిందువులో సూర్యుడు ప్రతిఫలించినట్లే తల్లిదండ్రుల నైతిక స్వచ్ఛత వారి పిల్లల్లో ప్రతిఫలిస్తుంది. బాలల్లో ఆనందం కలుగజేసే కర్తవ్యం తల్లిదండ్రులదే. శ్రమను ప్రేమించడం పిల్లలకు నేర్పాలి.

తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఉమ్మడి యత్నాలే పిల్లలకి మహదానందం ఇవ్వగలవు. పిల్ల మనసుల్ని గురించి అనుకునే టపుడు మంచు ముత్యాలు తొణికిసలాడే మృదువైన గులాబి పువ్వుని గురించి ఎవరైనా ఊహించుకోవాలి. ఆ మంచు బిందువులు చెదిరిపోకుండా ఆ పువ్వుని ఏరాలంటే ఎంతో జాగ్రత్త, సౌకుమార్యం కావాలి.




**ఉపాధ్యాయులు :** పసివారిని భావి పౌరులుగా తీర్చిదిద్దడానికి వలసిన విజ్ఞానాన్ని, నైపుణ్యాన్ని అందించాల్సిన ఉపాధ్యాయులు సదా చిరునవ్వుతో మెలగడం, నూతన ప్రక్రియలు అమలు చేయడం పట్ల ఆసక్తి కల్గి ఉండటం ముఖ్యం.

ఉపాధ్యాయునిలో మంచిని, మానసిక సౌందర్యాన్ని, అందాన్ని, సత్యాన్ని పసివారు దర్శిస్తారు. ఉపాధ్యాయుని మాటలు బాలల హృదయానికి అందాల బాలల్లో నిగూఢముగా యున్న వివిధ సామర్థ్యాలను వెలికి తీయడానికి చిత్రలేఖనానికి, సంగీతానికి ప్రత్యేక స్థానం యిచ్చి వారి ప్రతిభను అభివృద్ధి చేయాలి.

కృత్యాధార బోధనా విధానంలో బాలల ఆహ్లాదకరమైన ప్రపంచం ఉంది. విత్తనంలో వృక్షం వున్నట్లే, పసివానిలో సంపూర్ణ వ్యక్తి ఉన్నాడు. పిల్లల్ని కొట్టి – తిట్టి అదుపులో ఉంచాలన్న ఆలోచన రానీయకూడదు. తమ మనస్సులోని మాటను తెలిపే చొరవను బాలలకు యివ్వాలి. బోధనలో కష్టమైన కర్తవ్యం అనుభూతిని నేర్పడం. ఊహలో బోధించడం సులువు. ప్రత్యక్షంగా పనిచేయడం, దాన్ని సాధించడం చాలా కష్టం. ఆటలు, పాటలు, పరిసరాల పరిచయం, కథలు, సంగీతం యివే అభ్యసనానికి పునాదులు.

విద్య అనే పుష్పానికి 'పఠనం' అనేది ఒక పూరేకు మాత్రమే. మానసిక, శారీరక శిక్షణ పొందిన వారిగా తయారు చేయడం ఉపాధ్యాయుని విధి. అద్భుత కథల ద్వారా, ఆట పాటల ద్వారా ప్రకృతి సౌందర్యంతో వారి హృదయాల్ని పరులకు మేలు చేయడానికి ఉత్తేజం కల్గించాలి. బాలలు ఆలోచించేటట్లు చేయడం ఉపాధ్యాయుని అత్యంత సూక్ష్మ గుణాల్లో ఒకటి. ప్రకృతి మధ్యలో ఆలోచించుకొని, చుట్టూ చూసి అనుభూతి చెందే అవకాశం బాలలకు యివ్వాలి. ఆలోచింప చేసే పాఠాలు ప్రకృతిలో జరపాలి.

కొంచెం కల్పనా శక్తి, మరికొంచెం ఆలోచనా శక్తి. విద్యా విషయక ఆధునిక సాహిత్యంలో పరిచయం ఉపాధ్యాయునికి ఉండాలి. ఒక చిరునవ్వు, ఒక ప్రేరణ పిల్లల హృదయాల్ని నడిపిస్తుంది. వారి సంతోషానికి కాల పరిమితి లేదు. బోధన ద్వారా బాలలకు నేర్పిన దానికంటే – ఉపాధ్యాయులు నేర్చుకొనేదే ఎక్కువ.

**పాఠశాల :** తమ దేశాన్ని ప్రేమించే వారుగా, ఆరోగ్యవంతమైన వారుగా, శారీరక, మానసిక శిక్షణ పొందిన వారుగా తయారు చేయడం పాఠశాల విధి. ప్రాథమిక తరగతులు భవిష్యత్‌కు పునాదులు. ప్రాథమిక విద్యా బోధనలో ముఖ్య ఆచరణ కృత్యాధార బోధనా విధానం. విద్యార్థులకు అది సంపూర్ణ

వికాసం గల మేధా జీవితం. పరిశీలన, ఆలోచన, శ్రమ, సంతోషం, అనుభవం బోధనాత్మక ఆదర్శాలు.

పాఠశాలలో బాలలు జ్ఞానం, నైపుణ్యం, పఠనం నేర్చుకుంటారు. పసివాడు పుట్టినప్పటి నుండి 7 సం॥లు వచ్చేలోపే తన యింగితానికి, అనుభూతులకి, ఇచ్ఛకి, నడవడికకి సంబంధించినవి – తన మిగిలిన జీవిత కాలమంతటి కంటే కూడా ఎంతో ఎక్కువ నేర్చుకుంటారు.

పాఠశాలలో బోధన పిల్లల జిజ్ఞాసని, ఆతృతని రేకెత్తించే మార్గంలో రావాలి. అధ్యయనం శారీరక, మానసిక శక్తుల క్రీడలతో ముడిపడి ఉంది. శారీరక శ్రమ మరియు అధ్యయనంతో సృజనాత్మకత (Creativity) సాధింపబడుతుంది.

పాఠశాల విద్యకు ఆలయం. ఇందులో భవనములు, పుస్తకములు, ఆటస్థలం, తోట, నీరు, స్వచ్ఛమైన గాలి, వెలుతురు, శుభ్రమైన పరిసరాలు ఉండాలి. మనకు శరీరం ఎంత అవసరమో, బడికి భవనములు అంతే అవసరం. పాఠశాల సమాజంలో 'Watch Tower'గా ఉండాలి. సమాజంలోని వనరులను పాఠశాల ఉపయోగించుకోవాలి.

**ఆటలు :** ప్రజాస్వామ్య పరిరక్షణకు ఆట స్థలాలు ఊయల వంటివి. శరీర సౌష్టము పెంపొందడానికి, అన్ని అవయవాలు క్రమరీతిలో పనిచేయడానికి, శరీరంలో ఏర్పడే మలినాలను విసర్జించడానికి ఆటలు చాలా అవసరం. ఆరోగ్యవంతమైన మంచి మనస్సు, ఆరోగ్యవంతమైన శరీరంలోనే ఉంటుంది. ఆటలే అసలైన చదువు. ఆటలంటే మంచి నడత. ఆటలు శీల నిర్మాణమునకు తోడ్పడతాయి.

హృదయంలోంచి స్వయంగా ఉత్పన్నమయ్యేటటువంటి యధార్థ క్రమశిక్షణ ఆటల ద్వారా లభిస్తుంది. ఆటలు లేకుండా సంపూర్ణ మానసిక అభివృద్ధి లేదు. ఆరోగ్యవంతమైన శరీరం, మనస్సు, నిర్మలత్వం, శక్తి ఆటల వల్లనే కల్గుతాయి. 'ఆటలు' పిల్లల హృదయాన్ని పరులకు మేలు చేయడానికి ఉత్తేజపరుస్తాయి. ఆటల ద్వారా పిల్లల హృదయాలకి ఖచ్చితమైన దారి తెలుసుకోవచ్చు. పిల్లల ఊహలు ఆటలు లేకుండా ఉండవు. పిల్లల ఊహకి అవకాశం

— — — — — * * * — — — — —

**పిల్లల హృదయాలు ఉద్రేకంతో కొట్టుకోవాలంటే కథలు వినిపించాలి. మానసిక బలాన్ని వృద్ధి చేయడానికి, మనసుకి శిక్షణ యివ్వడానికి కథలు సాటిలేని మార్గం. పిల్లల ఆలోచనలకి, అనుభూతులకి కథలు సజీవ ఆధారాలు. కథలు మెదడును జాగృతం చేస్తాయి.**

— — — — — * * * — — — — —

యివ్వాలి. ఆటలు మెదడును జాగృతం చేస్తాయి.

**గేయాలు – సంగీతం :** విజ్ఞానం, వికాసం, వినోదం కలిగించేవి గేయాలు. గేయాలు 'ధారణ' శక్తి పెంపొందిస్తాయి. గేయాలు మనసుకి చక్కని శిక్షణ యిస్తాయి. గేయాల ద్వారా బోధన సమర్ధవంతంగా ఉంటుంది. సంగీతం మేధాభివృద్ధికి ముఖ్య సాధనం. సంగీతం హృదయ ఔన్నత్యానికి మూలం. సంగీతం ప్రకృతి చుట్టూ వున్న ప్రపంచాన్ని, మనసులో వున్న దివ్యమైన భావాల్ని జాగృతం చేస్తుంది. స్వయం బోధనకి సంగీతం శక్తివంతమైన సాధనం. శ్రావ్యమైన సౌందర్యాన్ని అనుభవించడం బాల్యంలో మాత్రమే సాధ్యం. సంగీతం "ఆలోచనా మృతం". సంగీతం మనసుని విద్యావంతం చేస్తుంది. సంగీతం పిల్లవాని హృదయాన్ని తెరుస్తుంది.

**కథలు :** బాలలకు విద్యపై అభిరుచి కల్గించడం కోసం, ఉపాధ్యాయుల మరియు విద్యార్థుల సాన్నిహిత్యం పెంచుటకు కథ మంచి సాధనం. కథల వలన బాలల్లో ''అవధానం'' అలవడుతుంది. భాష సంస్కరింపబడుతుంది. సాహిత్య పరిచయం కల్గుతుంది. పిల్లవానిలో నేర్చుకోవాలనే కోరిక జాగృతం అవుతుంది. ఉపాధ్యాయుల్ని యిష్టపడతారు. మంచి కోసం, సత్యం కోసం, అందం కోసం, సంస్కృతీ అనుభూతుల కోసం కథలు తోడ్పడతాయి. ప్రతి పిల్లవానికి ఆనందం కలుగజేసేవి కథలే. అద్భుతమైన కథల ద్వారా పిల్లల హృదయాలకు దారి తెలుస్తుంది. పిల్లల ఊహలు కథల్లేకుండా ఉండవు. కథలు పిల్లల ఆలోచనలనీ, భాషను ఉత్తేజితం చేస్తాయి.

పిల్లల హృదయాలు ఉద్రేకంతో కొట్టుకోవాలంటే కథలు వినిపించాలి. మానసిక బలాన్ని వృద్ధి చేయడానికి, మనసుకి శిక్షణ యివ్వడానికి కథలు సాటిలేని మార్గం. పిల్లల ఆలోచనలకి, అనుభూతులకి కథలు సజీవ ఆధారాలు. కథలు మెదడును జాగృతం చేస్తాయి. కథల వలన పిల్లవాడు ప్రపంచాన్ని తమ మనసులోనే గాక తన హృదయంతో కూడా తెలుసుకొని స్పందిస్తాడు.

**తోట పని :** బాలల మానసిక శారీరక వికాసానికి బడి తోట అవసరం. తోటలేని విద్యాలయం దేవుడు లేని గుడి వంటిది. సృష్టిలోని మొక్కల పెరుగుదలకు, బాలల వికాసానికి చాలా సన్నిహిత సంబంధం ఉంది. విత్తనం నాటి, నీరుపోసి, మొక్కలను పెంచి పెద్ద చేసినపుడు ఆ మొక్కలే పుష్పాలు, ఫలాలు యిస్తుంటే తోట కోసం బాలలు పడిన శ్రమలోని ఆనందానికి మేర ఉండదు.

శ్రమ ఫలితంగా పిల్లవాడు పరిణితి చెందుతాడు. శ్రమలోని ఆనందంతో మరి దేన్ని పోల్చలేము. బాలలకు శ్రమ విలువను గురించి బోధించడంలోనే ఉన్నత బోధనా యుక్తి ఉంది. ఇతరులతో కలిసి పనిచేసే అనుభవాన్ని పిల్లవాడు పొందాలి. పిల్లవాడి చేతులు ఎంత నేర్పుగా ఉంటే, పిల్లవాడు అంత చురుగ్గా ఉంటాడు. నేర్పు బౌద్ధిక శారీరక పటుత్వం మీద ఆధారపడి ఉంటుంది.

అలసట లేకుండా మంచి ఆరోగ్యం అసాధ్యం. శ్రమించిన తరువాత విశ్రాంతి తీసుకుంటున్నప్పుడే ఆరోగ్యవంతమైన జీవ రసాయన ప్రక్రియ జరుగుతుంది. దృష్టి లోపానికి కారణం విటమిన్లు లోపించిన ఆహారం మరియు తగినంత శరీర వ్యాయామం లోపించడం. ఆరోగ్యకరమైన ఆహారం, మంచి నిద్ర, శరీర వ్యాయామం పిల్లల్ని 'అస్వస్థత'ల నుంచి కాపాడతాయి. వాళ్ళకి చుట్టుతా వున్న ప్రపంచం పట్ల ఆనందాన్ని, ఆహ్లాదాన్ని కల్గిస్తాయి. చలికాలంలో శరీరంలోని విటమిన్ల విలువ సూర్యరశ్మి తీవ్రంగా తగ్గడం వల్ల నాడీ మండలం అలసిపోయేటట్లు చేస్తుంది. శ్రమ వలన నాడీ మండలం చైతన్యవంత మవుతుంది.

ఒక మనిషి సౌందర్యం చాలా స్పష్టంగా శ్రమలోనే వెల్లడవుతుంది. మానవ సంబంధాలు, సాంఘిక జీవనం, మానవ శ్రేయస్సు కోసం చేసే శ్రమలోనే వెల్లడవుతాయి. శ్రామిక జనం పట్ల పిల్లల ప్రేమ మానవ నీతికి మూలం అవుతుంది. శారీరక

వ్యాయామం పట్ల కండరాలు అభివృద్ధి చెంది బలపడతాయి. సౌందర్య సృష్టి కోసం పనిచేయడం అనేది పసి హృదయాల్ని ఉన్నతం చేస్తుంది.

**పుస్తకాలు :** పుస్తకాలయం పాఠశాలకు హృదయం వంటిది. మన దేహంలో కేంద్ర నాడీ వ్యవస్థ మాదిరి. పాఠశాలలో పుస్తకాలయం విజ్ఞాన మందిరంగా భాసిల్లుతున్నది. చిన్నతనంలోనే పుస్తక పఠనంలో చక్కని అభిరుచి కల్గించి విరామ కాలాన్ని సద్వినియోగపరచుకొనేటట్లు పిల్లల్ని ప్రోత్సహించాలి. పుస్తకాలు పిల్లవాడి ఆంతరంగిక జీవితంలో పెద్ద పాత్ర వహిస్తాయి. పుస్తకం తమకి తాముగా ప్రపంచాన్ని దర్శించి అర్థం చేసుకోగల గవాక్షం. ప్రకృతి, సంగీతం, సృజనాత్మకత యిముడ్చుకుంటేనే పుస్తకం అనే గవాక్షం తెరుచుకుంటుంది.

బౌద్ధికంగా, నైతికంగా స్వతంత్ర జీవితానికి బాలలను సిద్ధం చేయడానికి పుస్తక ప్రపంచంలోకి నడిపించాలి. 'పుస్తకం' ఒక మిత్రునిగా వివేకమైన ఉపాధ్యాయుడిగా ఉంటుంది. పఠనానికి ఏకాంతం ఉండాలి. అది ఆలోచనల స్వయం బోధనకు ఆరంభం. పాఠశాల నిజమైన సంస్కృతీ కేంద్రంగా తయారవడానికి పిల్లలకి పుస్తకాలంటే ప్రేమ ఏర్పరచాలి. స్వాతంత్ర్యోద్యమ సమరయోధులను సమకూర్చి పెట్టింది పుస్తకాలయమే. సంఘ సంస్కరణలకు పుస్తకాలయం ఆటపట్టుగా నిలిచి పని చేసింది. ఆనందంతో పాటు శరీరాన్ని, మనసుని అభివృద్ధి వైపు మళ్ళించేది బాలల సాహిత్యం.

**ప్రకృతి పరిసరాలు :** బాలలు ప్రకృతి ఒడిలో పరవశించి ప్రకృతితో స్నేహం చేసి, ప్రకృతి రహస్యాలు తెలుసుకుంటారు. వెన్నెల, నదులు, వాగులు, వంకలు, పొలాలు, సూర్యకిరణాలు, చల్లటిగాలి, ఆకాశంలో రంగులు – అన్నీ 'ప్రకృతి' వారికి యిచ్చిన బహుమతులు. బాలలను వాటిని అనుభవింపనీయాలి. సూర్య కిరణాలు, స్వచ్ఛమైన గాలీ యీ రెండు పిల్లలకి నేస్తాలే. నీళ్ళతో హాయిగా ఆడుకోవడం అంటే పిల్లలకి సరదా. ప్రకృతిలో సహవాసం పిల్లల జీవితాలపై మంచి ప్రభావాన్ని చూపుతుంది. భూమి స్పర్శ మహదానందాన్ని యిస్తుంది. తండ్రి కౌగిటి కన్నా సూర్యుని వెచ్చని కిరణాలే వారికి ప్రీతికరం. మన దృష్టికి అందనిది వారికి అద్భుతంగా కనిపిస్తుంది.

— — — — * * * — — — —

**శిశువు 'నల్లబల్ల' కేసి చూసి ఎక్కువ నేర్చుకుంటాడో? కిటికీలోంచి చూసి ఎక్కువ నేర్చుకుంటాడో? ఎవరు చెప్పలేదు. పుస్తకాల ద్వారా పిల్లవాని హృదయంలో ప్రవహించేదంతా చుట్టుతా ఉండే ప్రపంచాన్ని బట్టే సాధ్యపడుతుంది.**

— — — — * * * — — — —

పిల్లలకి ఆప్తులైన మిత్రులు పువ్వులు. రంగుల పరిచయం పెరిగే కొలది కళాదృష్టి అలవడుతుంది. చందమామలో కుందేలు ఉందన్న విషయమే బాలలకి బాగా నచ్చుతుంది. అది వారి అమాయకత్వం కాదు. ప్రకృతి పట్ల వారికున్న ప్రేమ. కథలలోని అద్భుతాలే వారికి యిష్టం. ప్రకృతి పిల్లవాడిలోని గ్రహణ శక్తిని బయటకి లాగి, సానపట్టి మరింత విస్తృతపరుస్తుంది.

**విహార యాత్రలు :** సజీవ ఆలోచనలకి, భాషకి ఆధారం విహార యాత్రలు. ప్రకృతిలో నూతన విషయాలు పంచేంద్రియాల సహాయంతో గ్రహిస్తారు. ప్రకృతి దగ్గరికి యాత్రలు చేయడం సృజనాత్మకతకి మొదటి ప్రేరణ అవుతుంది. పొలంలోకి, అడవిలోకి నదిగట్టుకి, పరిసర గ్రామాలకి విహార యాత్రలు పిల్లలు హృదయాల్ని స్పందింప చేస్తుంది. అనుభూతుల కోసం బాలలు ప్రకృతిలోకి వెళ్ళాలి. ప్రకృతియే ఆలోచనలకీ, సృజనాత్మకతకి, జిజ్ఞాసకి, హేతువుకు పుష్కలమైన ఆధారం.

ప్రకృతి ధర్మాలు తెలుసుకుంటే పిల్లవాడు వ్యక్తిగా తయారవుతాడు. ప్రకృతి శక్తుల్ని ఉపయోగించుకోవడంలో మానవుడు చైతన్యయుతమైన అడుగు వేసినపుడే ప్రకృతి అతనికి ప్రతిఫలం ఇస్తుంది. సౌందర్యం కోసం, శ్రమ కోసం యాత్రలు చేయాలి. బాల్యం అనే బంగారు కాలంలోనే పరిసరాల పట్ల భావుకత ఉండాలి. తరగతి గదిలో బోధించిన విషయాలు యాత్రల ద్వారా ప్రత్యక్షంగా చూసి తెలుసుకొన వీలుంటుంది.

చెట్ల నీడలోకి, నీళ్ళ దగ్గరికి, పొలాల్లోకి, ఆరు బయటికి పిల్లలు వెళ్ళడానికి తహతహలాడుతుంటారు. శిశువు 'నల్లబల్ల' కేసి చూసి ఎక్కువ నేర్చుకుంటాడో? కిటికీలోంచి చూసి ఎక్కువ నేర్చుకుంటాడో? ఎవరు చెప్పలేదు. పుస్తకాల ద్వారా పిల్లవాని హృదయంలో ప్రవహించేదంతా చుట్టుతా ఉండే ప్రపంచాన్ని బట్టే సాధ్యపడుతుంది. వ్యక్తి ఎల్లప్పుడు ప్రకృతి శిశువే. అపరిమిత ఐశ్వర్యం, తరగతి సౌందర్యం వున్నది. ప్రకృతి ప్రపంచం. ప్రకృతిలోనే పసివాని వివేకానికి శాశ్వత ఆధారం ఉంది. చుట్టుతా వున్న ప్రపంచం, వస్తువులు, ప్రకృతి పసివాని వ్యక్తిత్వం పెంచుతుంది. శాస్త్రీయ సత్యాలను బాలలు తమ చుట్టూతా ఉండే ప్రపంచంలో దర్శించాలి. ప్రతి పిల్లవాడు తమ తత్వాన్ని బట్టి చుట్టుతా వున్న ప్రపంచంలోకి నిశితమైన శోధకుడిగా వెళతాడు. అన్నింటిలోకి అత్యంత అద్భుతమైన 'ప్రకృతి' అనే పుస్తకం బాలలు చదివేటట్లు చేయాలి.

ఒక నీటి బిందువు గురించి ఉపాధ్యాయుడు చెప్పేది వినగానే ప్రొద్దుటి పొగమంచు, నల్లని మేఘాలు, తొలకరి చినుకులు తమకి తామే ఊహించుకుంటారు. ఆలోచింపచేసే పాఠాలు ప్రకృతిలో జరపాలి.

'ప్రకృతి' మంచి ఆరోగ్యానికి మూలం. పిల్లవానిని ప్రకృతి పరివేష్టించి ఉండాలి. తగు మాత్రం చల్లదనంలోనూ పిల్లలు ఆరోగ్యాన్ని దృఢపరచవలె. పుష్టికరమైన ఆహారం, ఎండ, స్వచ్ఛమైన గాలి. పరిశుభ్రమైన నీరూ, ఒక మోస్తరు పని, వినోదం, మంచి ఆరోగ్యమునకు నిరుపమాన ఆధారాలు. ప్రకృతి పుస్తకం చదవడం పిల్లలకి ఆసక్తిగా వుంటుంది. ప్రకృతి రహస్యాల ఆవిష్కరణే చదువు. ప్రకృతి పుస్తకం చదవడం అంటే మానసికమైన చురుకుదనం తేవడమే. ప్రకృతిలో ప్రతిదీ మారుతుంది. మార్పును సమర్థించేవాడు మేధావి. 'బోధన'కు ప్రకృతి సారభూతమైన, శక్తివంతమైన ఆధారం.

బాలలు బలంగా, సాహసంగా, ధైర్యంగా, తెలివిగా, యుక్తిగా, దయగా తయారవ్వాలి. అందం, ఆటలు, కథలు, సంగీతం, చిత్రలేఖనం, కల్పనలు, సృజనల ప్రపంచంలో బాలలు జీవించాలి.

**(గిజుభాయి రచనల ఆధారంగా)**

# కవితలు

## నేనెవరిని?



**ఆర్.కె.**

ఈ దేశం నాదేననుకున్నా
ఇక్కడేగదా మరిపుట్టాను - ఇక్కడే గదా పెరిగాను
ఇక్కడే జీవనమాధుర్యాన్ని చవిచూడాలనీ
ఇక్కడే ఈ తనువు చాలించాలనీ మనసారా కోరుకున్నా
ఈ మట్టీ, ఈ గాలీ నాదేననుకున్నా
సుజలాం, సుఫలాం, మలయజ శీతలాం
సస్యశ్యామలాం మాతరం- వందేమాతరం
అంటూ ఆనందంగా పాడుకుని మురిసిపోయాను
నామాతృభూమి అందాలకూ, ఆదరణకూ సాటిలేనిదనుకున్నా
కానీ! ఇదేమిటి? నేనిక్కడుండటానికి వీలులేదంటున్నారు
ఎక్కడ పుట్టానో అక్కడికి వెళ్ళిపొమ్మంటున్నారు
ఇదంతా నామాతృభూమి కాదా! ఇందులో అంతరాలున్నాయా
ఆంధ్రలో అలజడులు-ముంబాయిలో విధ్వంసం
గుజరాతీలో మారణహోమం-కాశ్మీరం నిప్పుల కుంపటి
అస్సాంలో హిందీ మాట్లాడినా చావేగతి- అయోధ్యలో ఆరని మంటలు.
అమ్మా! భారతీ! ఎక్కడున్నావు తల్లీ
నేనేం చేశాననీ-ఎందుకీ హింస రచన
నీవు తల్లివిగదా- నీబిడ్డల పరస్పరహననాన్ని సహించగలుగుతున్నావా.
మూగగా రోదిస్తోంది మనస్సు
సుదూరంగా ఏదో అలికిడి- అస్పష్టంగా వున్న ఆకారం దాపులకొచ్చింది.
మహోన్నతంగా నిలచిన హిమాలయ శిఖరాల నుంచి
కన్యాకుమారి వరకూ విస్తరించిన నామాతృమూర్తి మంగళరూపం.
సాగర జలాలు ఆమె పాదాలనభిషేకిస్తుంటే
ఆమె కరుణా పూరిత దృక్కులలో ఏదో ఆవేదన గోచరించింది.
ప్రేమగా నా తలనిమిరింది- బాధ పడుతున్నావా నాయనా.
అకారణంగా జరుగుతున్న ఈ విధ్వంసాన్ని
నిస్సహాయంగా చూస్తున్నానురా నేను.
ప్రేమాభిమానాలు పంచుకుంటూ- సుఖంగా జీవించే నాబిడ్డలను.
ఎవరెవరో రెచ్చగొడుతున్నారు- ఏవేవో నినాదాలు పుట్టుకొస్తున్నాయి.
ఏం చేయను చెప్పు- ఒక్కసారి గతంలోనికి చూచుకుంటే
ఒకప్పుడు 56 రాజ్యాలుగా నా దేహమంతా ఛిద్రం చేశారురా!
అక్కడితో వూరుకున్నారా- యుద్ధ భేరీలు నిరంతరం మ్రోగుతుండేవి.
ఆలోచనలెప్పుడూ రాజ్య విస్తరణ మీదే
ఈ దురాశేవీరిని నిస్తేజపరచింది.
నిరంతర పోరాటాలతో బలహీనులైపోయారు.
ఈ చిల్లర రాజ్యాలు బలమైన విదేశీదాడులనెదుర్కో లేకపోయాయి.
దోపిడీలు, దురాక్రమణలతో విదేశీయులకు బందీనయిపోయానురా.
వెయ్యేళ్ళ బానిసత్వాన్ని అనుభవించానురా తండ్రీ!
ఎన్నెన్ని బాధలవి-ఎన్నెన్ని అవమానాలు-ఎవరితో చెప్పుకునేది?
చివరకు నా బిడ్డలే రోషంతో లేచారు- కదం త్రొక్కుతూ కదిలారు.
దేశమంతా ఒక్కటై ఉవ్వెత్తున లేచింది- చూచి తీరాలిరా ఆ పౌరుషం.
కన్న తల్లి విముక్తి కొరకు తమ ప్రాణాలు ఫణంగా పెట్టారు
నమ్మలేని త్యాగాల పరంపర- చిరునవ్వుతో ఉరికంబాలెక్కారు.
నాబిడ్డల సత్యపరాక్రమాలు చూచి, ఉప్పొంగి పోయిందీ మాతృ హృదయం.
పరవశించిపోయింది నా అంతరంగం- ఆ త్యాగాల ఫలితంగా
స్వేచ్ఛా వాయువులు చల్లగా, సుగంధ భరితంగా వీచాయి.
తన బిడ్డల సౌభాగ్యం చూచి ఏ తల్లి పరవశించదు
కానీ అది ఎంతో కాలం నిలువ లేదురా- అర్థ శతాబ్దం కూడాకాలేదు.
మళ్ళీ తెగ తెంపుల నీలినీడలు పరచుకున్నాయి.
అప్పుడు రాజ్యాలయితే- ఇప్పుడు రాష్ట్రాలూ, ప్రాంతాలూ
అప్పుడు రాజ్య విస్తరణయితే- ఇప్పుడు అధికార దాహం
ఏదైతేనేం స్వార్థ వ్యూహాలకు - నా బిడ్డలే గదా సమిధలు
విద్వేషం పడగ విప్పుతోంది.
విజేతలుగా శోభించవలసిన నా బిడ్డలు-
విధ్వంసం సృష్టించటంలో మునిగిపోయారు.
అంగ, వంగ, కళింగ అంటూ మళ్ళీ ముక్కలు చెక్కలైపోతారా?
శకలాలుగా, కనీసం దారిద్ర్యాన్ని దాటలేని
బలహీనులుగా మిగిలిపోదామా?
ఇలా నన్ను నిలువునా దహిస్తున్న బాధ నాలకించేవారెవ్వరు.
మాతృభూమి విశాలహితం గురించి ఆలోచన ఎవరికుంది
చరిత్ర మళ్ళీ పునరావృతమవుతుందా!
అదేరా నా భయం, కన్నా.

---

## మినీ కవితలు

**బొబ్బిలి జోసెఫ్**

### అంటు

తాగేందుకు నీళ్ళడిగితే
చెయ్యిపైకెత్తి మరీ
పోస్తున్నారు
అసలా బావిని
తవ్వించే వాడని మరచి

### ప్రేమ

మోడైన మొక్కకు
రోజూ నీళ్ళు పోస్తున్నా

ఆశల చిగుళ్ళు
మొగ్గ తొడిగాయి

### రక్షణ

కాపాడు దేవుడా అని
పగలంతా ప్రార్థించి

చీకటిపడగానే
గుడికే తాళం వేస్తాడే!

### ఒంటరి చెట్టు

బిడ్డలందరినీ
బడికి పంపి

దిగాలుగా
నిలబడ్డ కన్న తల్లి

### తలవంపులు

తలపాగా
సిగ్గుపడింది
ఎన్నికల సభల్లో
నేతల నెత్తి కెక్కాల్సి
వచ్చినందుకు

కథ

# అమ్మకో ఉత్తరం



**సాయంకాలం సమయం. అప్పుడే ఆఫీసు నుంచి వచ్చి కాస్త ఫ్రెష్‌అప్ అయి, హాల్లో సోఫాలో కూర్చుని పత్రికలు తిరగేయడం మొదలు పెట్టాను.**

**డా॥ కె.ఎల్.వి. ప్రసాద్**

అందరికి తెల్లవారకముందే పేపర్లు గుమ్మం దగ్గర పడివుంటాయి. నా దురదృష్టం ఏమిటో గాని, ఎంతమంది పేపర్ బోయ్స్‌ని మార్చినా ఆఫీసుకు వెళ్ళే ముందు పేపర్లు తెచ్చిన దాఖలాలు లేవు.

ఒకటి ఇంగ్లీషు, మరోటి తెలుగు పేపర్ కావడంతో, ఒక దాని ఆలస్యం మరో దానితో ముడిపెట్టి, మొత్తం మీద రెండు పేపర్లు కలిపి ఆలస్యంగానే తెస్తుంటాడు పేపర్ బోయ్!

అందుకే సాయంత్రం యింటికి రాగానే, ఆఫీసు చాకిరీతో ఆలసిపోయిన మనస్సు పత్రికా పఠనంతో కాస్త సేదదీరినట్లవుతుంది. పోస్ట్‌లో వచ్చే పత్రికలు సరేసరి! అన్నింటికి పూర్తిగా న్యాయం చేయడానికి సమయం చాలనే చాలదు. పైగా ఇంట్లో ఒక ఆడప్రాణి అనబడే మీ సహచరి ఒకతి మీతో కలిసి బతుకుతోందన్న సంగతి మీకు అసలు గుర్తుంటుందా? ఆ... పత్రికలతోనే కాపురం చేయండి మీరు? అంటూ దెప్పి పొడుస్తుంటుంది శ్రీమతి.

ఇది యీనాటి విషయం కాదు లెండి! పాతిక సంవత్సరాల క్రితం మా పెళ్ళయిన దగ్గర నుంచి, మా యిద్దరిది ఇదే తంతు! ఆవిడ అలా అనడం, నేను ఇలా చేయడం క్రమం తప్పకుండా జరిగిపోతూనే వున్నాయి.

వార్తా పత్రికలో నా కిష్టమైన సంపాదకీయం చదువుతున్న సమయంలో శ్రీమతి సీరియస్‌గా కాఫీ కప్పుతో ప్రత్యక్షమై నేను చదువుతున్న పేపరు కాస్తా లాగి, అవతల పారేసి చేతిలో విసురుగా కాఫీ కప్పు పెట్టింది.

పొగలు కక్కుతున్న కాఫీ కప్పు మాదిరిగానే ఆవిడ మెదడు కూడా ఏదో విషయంలో సలసల సెగలు కక్కుతోందని నాకు అర్ధమైపోయింది. నేను ఊహించినట్లుగానే ఆమె మనస్సు విప్పి నా ముందు పెట్టడం మొదలుపెట్టింది. నాందీ ప్రస్తావన మొదలయింది.

"ఏమండీ, అబ్బాయి చూశారా! కనీసం నేను ఉత్తరం రాసిన తర్వాత కూడా సమాధానం రాయలేదు. అంతేనండీ రెక్కలొచ్చిన పక్షులు కదా" అంది కాస్త ఉక్రోషం ప్రకటిస్తూ.

'ప్రగతి, ఎందుకు నీ పిల్లల్ని అంత తక్కువగా అంచనా వేస్తావు.

"అక్కడ వాడు ఎన్ని పాట్లు పడుతున్నాడో ఏమో! ఉత్తరం రాయాలంటే, కాస్త సమయం చిక్కాలి కదా! సమయం దొరికినా ఉత్తరం రాయాలనే అభిలాష ఉండాలి కదా! తీరా ఉత్తరం రాద్దాం అన్నాడనుకో వాడి మనస్సు బాగుండాలి కదా!" అన్నాను కాస్త సముదాయిస్తూ.

"ఆ మాత్రం సమయం దొరకదంటారా వాడికి! అమ్మా, నాన్న అనేవాళ్ళు వున్నారని గుర్తుంచుకుంటే, ఎలాగైనా వీలు చూసుకుని ఉత్తరం రాసి వుండేవాడు" అంది అంతలోనే ముక్కు చీదుతూ. "మరీ అంత త్వరగా వాడిమీద నీ అభిప్రాయం మార్చుకోకు ప్రగతీ! వాడు... నీ కొడుకేనన్న విషయం మరచిపోకు. పైగా నీ కోరికను తీర్చడానికే కదా, వాడు ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్ళింది! దేనికయినా కాస్త ఓపిక అవసరం కదా!"అన్నాను సౌమ్యంగా.

"ఏమోనండి, నా మనస్సు అసలు బాగుండటం లేదు, ఏదో అందరి పిల్లలు, అమెరికా వెళ్తుంటే 'నా కొడుక్కేం తక్కువ' అనుకున్నానే తప్ప, ఇంత మానసిక వ్యథను భరించాల్సి వస్తుందని కలలో కూడా అనుకోలేదు. ప్రాంతం కాని ప్రాంతంలో, పాపం నా బిడ్డ... ఎన్ని యిబ్బందులు పడుతున్నాడో ఏమో!" అంది బాధగా.

"ప్రగతీ! మళ్ళీ మొదటికే వస్తున్నావ్ సుమా! నువ్వు నీ భర్త ఎంత ధనవంతులయినా, పిల్లల కోసం ఎంత ఖర్చు పెట్టగల స్థోమత ఉన్నా అక్కడ కొన్ని ఇబ్బందులకు గురికాక తప్పదు. జీవితం నేర్పించే ఆ... పాఠాలు నేర్చుకొనకపోతే యీ పోటీ ప్రపంచంలో రేపు వాళ్ళకి చోటెక్కడ దొరుకుతుంది చెప్పు' అన్నాను కాస్త ఓదార్పుగా.



'అలా అని బిడ్డడు బాధపడ్తున్నాడని తెలిసి కూడా చాతకాని వాళ్ళలా మిన్నకుంటామా? తల్లిగా నేను, తండ్రిగా మీరు ఎలా తట్టుకోగలం చెప్పండి' అంది.

"అవును, తెలిసినా, యిక్కడ ఉండి వాడి కోసం మనం చేయగలిగిందంటూ ఏమీ లేదు కదా! వాడికి, మనకి మధ్య కొన్ని వేల మైళ్ళ దూరం. అదే ఏ హైదరాబాదో, విజయవాడో, విశాఖపట్నమో అయితే వాడి అవసరాలను బట్టి మనం ఆదుకుని వుండేవాళ్ళం. ఎక్కడ అమెరికా! ఎక్కడ టెక్సాస్ నగరం!!..."

"అవును నిజమే! ఏం చేయాలన్నా యిప్పుడు వేలు, లక్షలు కావాలి మరి! కొన్ని పనులయితే డబ్బున్నా కావు కదా! మీరు చెప్పిన మాట వినకుండా తప్పు పని చేశానేమోనని యిప్పుడు నాకు అన్పిస్తున్నది" అంది దీర్ఘంగా నిట్టూరుస్తూ.

"అలా అని పదే పదే మదనపడుతూ మనం చేసిన పని తప్పని భావించకూడదు ప్రగతి! రిస్క్ అనేది లేకుండా జీవితంలో విజయాలు ముందుకు తన్నుకుని రావు. సాహసం చేయకుండా, యీ రోజుల్లో అందమైన భవిష్యత్‌ను వూహించుకోలేం..."

"ఏమోనండి, ఎన్ని విధాలుగా ప్రయత్నించినా అబ్బాయి విషయంలో పొరపాటు చేశానేమోనన్న శంక నన్ను మానసికంగా కుదిపేస్తుంది. ఒక్క ఉత్తరం ముక్క రాసి వుంటే ...." అంటూ నా ముఖంలోకి సూటిగా చూసింది ప్రగతి.

"ప్రగతీ, నాకు తెలియక అడుగుతున్నా, ఒక విషయం కాస్త చెప్పు! దినం విడిచి దినం బాబుతో మాట్లాడుతున్నావ్, వారానికి ఒకసారైనా తప్పకుండా చాటింగ్ చేస్తున్నావ్, ఇంకా చరణ్ గురించి నీకు దిగులు ఎందుకు చెప్పు? నువ్వు అవసరానికి మించి ఆలోచిస్తున్నావేమోనని నా అనుమానం. అయినా ప్రసార సాధనాల్లో మనం యిన్ని రకాల విజయాలు చవిచూశాక కూడా యింకా ఉత్తరాలు, పత్తరాలు అంటావేమిటోయ్!" అన్నారు ఆమె ముఖాన్ని పరీక్షిస్తూ...

నాకు తెలుసు మీరు యీ మాట అంటారని! ప్రసార మాధ్యమాల్లో మనం ఎంత ప్రగతి సాధించినా, ఉత్తరాల విలువ ఉత్తరాలదే! మనస్సులోని మాటను నిశ్చింతగా, నిరభ్యంతరంగా కాగితం మీద పెట్టగల శక్తి ఒక ఉత్తరాల ద్వారానే వీలవుతుంది. అదొక గొప్ప అనుభవం, అనుభూతి! దాన్ని గురించి మరింతగా వివరించడం కొంచెం కష్టమే మరి!" అంది.

ఇది మరీ బావుంది! ఉత్తరాల మహిమ నాకు తెలీకపోవడం ఏమిటి? అవే కదా మనిద్దరిని జంట పక్షులు చేసింది! అయితే, ఆ... రోజులు వేరు. అప్పట్లో ఉత్తరాలే మనకు దిక్కు... ఎన్ని రోజులయినా, ఆ... ఉత్తరాల కోసమే ఎదురు చూసేవాళ్ళం. ఉత్తరం చదువుతుంటే ఆ... మనిషి ఎదురుగా నిలబడి మాట్లాడినట్లే వుండేది!

మరి యిప్పటి పరిస్థితి అలా లేదు కదా! ఈ రోజుల్లో ప్రతి నిమిషం విలువైనదే. అందుకే ఉత్తరాలు రాయడం కోసం, అంత సమయం కేటాయించే ఓపిక ఎవ్వరికీ లేదిప్పుడు. అయినా ఏమో పాత రోజులు మళ్ళీ తిరిగి వస్తాయేమో.. ఎదురు చూడాల్సిందే" అన్నాను నన్ను నేను సమర్ధించుకుంటూ...

"నాలాంటి వాళ్ళ దగ్గర ఉపన్యాసాలు దంచేయమంటే మీకసలు సమయమే తెలీదు. ఇప్పుడు టైమ్ ఎంతయిందో తెలుసా! సరిగ్గా రాత్రి పదిగంటలు. మీకు అసలు ఆకలి అన్పించటం లేదా? మళ్ళీ ప్రొద్దున్న లేచి డ్యూటికి వెళ్ళాలి కూడా! రండి భోజనం వడ్డించేస్తాను" అంటూ డైనింగ్ రూమ్‌లోకి దారితీసింది ప్రగతి. ఆకలి గుర్తుకు రావడంతో దాని అలజడి మరింత ఎక్కువయి ప్రగతిని అనుసరించాను మౌనంగా.

---

ఆ... రోజు రెండో శనివారం కావడం వల్ల ఆఫీసుకు సెలవు. ఆదివారానికి అదనంగా మరో రోజు సెలవు వచ్చిందంటే దానికి సరిపడినంత బద్ధకం కూడ తోడు వస్తుంది.

నేనెట్లాగు ఆ రోజు ఆలస్యంగా లేస్తానని తెలిసి ప్రగతి కూడ ఆ.. రెండు రోజులు బద్ధకానికి బానిస అయిపోతుంది. అందుచేత యితర రోజులకు భిన్నంగా పక్కమీద నుంచి లేవడాలు, కాలకృత్యాలు తీర్చుకోవడాలు, 'ట్రెడీమిల్' మీద నడవడాలు, టిఫిన్ చేయడాలు, బి.పి.బిళ్ళలు మింగడాలు అన్నీ ఆలస్యంగానే నడుస్తుంటాయ్.

ఆ...రోజు కూడ అదే విధంగా సెలవు రోజున సేద తీరుతున్నవేళ, వంటగదిలో ప్రగతి యుద్ధ ప్రాతిపదికన వంట చేయడంలో నిమగ్నమయిన తరుణంలో, యిద్దరి మధ్య నిశ్శబ్దాన్ని అడ్డంగా చీల్చుకుంటూ కాలింగ్ బెల్ అదే పనిగా ఏడ్వడం మొదలు పెట్టడంతో పాటు, 'పోస్ట్‌మేన్' అన్న కేక యిద్దరికి విన్పించింది.

రోజుల తరబడి ఉత్తరం కోసం ఎదురు చూస్తున్న ప్రగతి వంటగదిలో ఎక్కడిపని అక్కడ వదిలేసి, చేతులు చీర కొంగుకు అద్దుకుంటూ, ఇంటి గేటు దగ్గరికి పరిగెత్తింది. అప్పటికే 'పోస్ట్‌బాక్స్' లో ఉత్తరం పడేసి, పోస్ట్‌మేన్ తన డ్యూటీలో భాగంగా ముందుకు సాగిపోయాడు. సంగతి నాకు అర్థమయిపోవడంతో కదలకుండా ఉన్నచోటే వుండిపోయాను.

సీతాకోకచిలుకలా రంగు రంగుల స్టాంపులతో డబ్బా నుంచి అందంగా బయటికి కన్పిస్తున్న పొడవైన కవరును గబుక్కున బయటకు లాగి, అది తన సుపుత్రుడి నుండి వచ్చినదే అని రూఢి అయిన తరువాత, చెప్పలేని ఉద్వేగంతో అ.. ఉత్తరాన్ని గట్టిగా గుండెలకు హత్తుకుని, ఆనందంగా భర్త దగ్గరకు పరుగు తీసింది ప్రగతి.

"ఏమండోయ్ శ్రీవారూ వచ్చేసింది ఉత్తరం, బాబు రాశాడు" అంది ఎంతో ఆనందంగా, అతృతగా భర్తను సమీపిస్తూ ప్రగతి.

"పోనీ లేవోయ్, నీ కోరిక యిప్పుడు తీరింది కదా! నువ్ అ.. ఉత్తరం చూచి ఎంత సంతోషపడి పోతున్నావో, నీ ముఖకవళికలు చెప్పకనే చెబుతున్నాయి" అన్నాను మనస్సులోని నా సంతోషాన్ని కూడా వ్యక్తం చేస్తూ.



మరి ముందు మీరు చదివి అ తర్వాత నాకు యివ్వండి. నేను కాస్త తీరిగ్గా చదువుకుంటాను. యీలోగా వంటపని కూడా అయిపోతుంది అంది ప్రగతి.

"ఓ,కె, నువ్ ఎలా అంటే, అలానే!" అని, ఉత్తరం అందుకుని జాగ్రత్తగా కవరు విప్పి చదవడం మొదలు పెట్టాను అత్రంగా!

**"ప్రియమైన, అమ్మా! నాన్నగారూ!!**

ఉభయ కుశలోపరి, నా ఉత్తరం కోసం మీరు ఎంతో అత్రంగా ఎదురు చూస్తారని నాకు తెలుసు. ముఖ్యంగా యిలాంటి విషయాల్లో అమ్మ నావల్ల టెన్షన్‌కు గురి అయితే, ముందు నన్ను క్షమించాలి.

అమ్మా! యిక్కడికి వచ్చిన తరువాత పనుల వత్తిడిలో క్షణం తీరిక లేక ఉత్తరం రాసే సమయం చాలక యింత ఆలస్యం అయింది. ఆలస్యాన్ని అన్యథా భావించక నన్ను అర్థం చేసుకుంటారని విశ్వసిస్తున్నాను.

ఎంతో ధైర్యంతో, నమ్మకంతో, మీముందు గంభీరంగా ప్రవర్తించి ఈ విదేశీ నేల మీద అడుగుపెట్టిన మరుక్షణం నుంచి నాలో ఏదో చెప్పలేని లోటు చోటు చేసుకుంది. ఊహించని నిరుత్సాహం ఒక్కసారిగా వెన్నులో చలి పుట్టించింది. అదే సమయంలో నా భవిష్యత్తు కోసం చేరుకోవలసిన టార్గెట్‌లను జ్ఞప్తికి తెచ్చి నా మనస్సు నా వెన్నుతట్టి చైతన్యవంతుడి చేసింది. దానికి తోడు మీరు అందించిన ధైర్యంతో సాహసం చేస్తూ ముందుకు సాగిపోతున్నాను. నా ధ్యేయం ఫలిస్తుందని, దానికి మీ ఆశీస్సులు నాకు వెన్నంటి వుంటాయని ఆత్మవిశ్వాసంతో నా జీవితాన్ని, జీవన శైలిని మార్చుకుంటున్నాను.

నా విషయంలో మీకున్న కొన్ని అనుమానాలను గ్రహించలేనంతటి పసివాణి కాదు నేను. ఇక్కడి యీ నా క్రొత్త జీవితంలో నాకు ఎంతో మంది కొత్తవాళ్ళు, రకరకాల వ్యక్తిత్వం గలవాళ్ళు తారసపడుతుంటారు. ఈ నేపథ్యంలో నేను చెడు సహవాసాలను బానిసనవు తానేమోనని మీకు ఒక ప్రక్క, భయం భయంగా వుంటుందని నాకు తెలుసు. ఈ విషయంలో మీరు నిర్భయంగా, నిశ్చింతగా వుండవచ్చుని హామీ యిస్తున్నాను. ఇపుడే మీరు లేకుండా ఎన్నో జీవిత సత్యాలను గ్రహించగలిగాను. మన జీవన విధానానికి అనుగుణంగా నా జీవనశైలిని మలుచుకోవడం మొదలుపెట్టాను. ఇది మంచి ఫలితాలనే యిస్తుంది.

మరొక విషయం. నేను యిక్కడ స్థిరపడి పోవడం గురించి! యీ విషయానికి సంబంధించి మీ అనుభవాలు, మీ మనస్సుల్లో యిప్పటికే ముద్ర పడిపోయి వున్న కొన్ని ఉదాహరణలు మీ అనుమానాలకు ఊతం యివ్వవచ్చు. అందరి విషయంలోను యిలాంటి పొరపాట్లు జరగవు. అంతిమ కాలంలో తల్లిదండ్రులను గాలికి వదిలేసి, హాయిగా ఊహల ఉయ్యాలలో వూరేగడం అందరికి సాధ్యమయ్యే పని కాదు. సమాజంలో అందరూ గుండెను బండగా మార్చుకుని తిరిగే వాళ్ళు ఉండరు! మనస్సున్న మనుష్యులు కూడా మనలో వుంటారనేది జీవిత సత్యం. ఇది మీరు నమ్మాలి, దానితో పాటు నన్ను నమ్మాలి!

నాలాంటి వాళ్ళకోసం మన దేశంలో చదువు లేదని కాదు, అలాగే ఉద్యోగావకాశాలూ లేవని కాదు. కాని ఎన్నో సామాజిక సమస్యలు వ్రేళ్ళూని వున్న మన దేశంలో సామాన్యులకు ప్రతి చోట, ప్రతి స్థాయిలోను అటంకాలే ఎదురవుతున్నాయి. రోజు రోజుకు సమస్యలు జటిలమై, మానవీయత కోల్పోతున్న మనుష్యులు, రాక్షసత్వాన్ని ఒంటినిండా పులుముకుని తిరుగుతున్నారు. సూటిపోటి మాటలతో సున్నిత హృదయాలను గాయపరుస్తున్నారు. ఇది నేను భరించలేని పరిస్థితి. నాలాంటివాళ్ళు ఎదిరిస్తే అది విప్లవంగా మార్కు పడుతుంది. అది మీరు అస్సలు భరించలేరు! మీరు శాంతికాముకులు. ప్రశాంత జీవితాన్ని కోరుకుంటున్న వాళ్ళు. నావల్ల మీరు ఎలాంటి సమస్యలను ఎదుర్కోవడం నాకు యిష్టం లేదు. అక్కడ నేను నిరుద్యోగిగా తిరుగుతుంటే మీ ముఖాల్లో కన్పించే నిరుత్సాహం, నిస్సహాయత నేను భరించలేను. అందుకే యీ మార్గం ఎంచుకున్నాను. దానికి అమ్మ అశీస్సులు నాకు మరింత పట్టునిచ్చి నన్ను ముందుకు నడిపిస్తున్నాయి.

ఇక్కడ నన్ను అనవసరంగా ప్రశ్నించే వాళ్ళుండరు. కులం, మతం, ప్రాంతం యిక్కడ ఎవ్వరిని వేరుచేయవు. నేను ఎంత కష్టపడితే అంత ఫలితం నాకు అందుతుంది. అందుకే కష్టపడటం నేర్చుకుంటున్నాను. కష్టపడితే ఎలా సుఖపడవచ్చో తెలుసుకుంటున్నాను.

డబ్బు విలువను బట్టి చూస్తే డాలర్ యిప్పటికీ ప్రపంచాన్ని శాసిస్తూనే ఉంది. అందుకే నాకంటూ కొంత సంపాదించుకున్నాక మీ సమక్షంలో రెక్కలు కట్టుకుని వాలతాను. నాకు అందుబాటులోనికి వచ్చిన ఉద్యోగాన్ని అందుకుని మీకు సేవ చేసే అవకాశం పొందుతాను.

అమ్మా! గతంలో మీరు అ... నోట, యీ...నోట విన్న సంఘటనలను దృష్టిలో వుంచుకుని, నేను – మీ అభిరుచులకు భిన్నంగా మన సంస్కృతి, సంప్రదాయాలకు విరుద్ధంగా విదేశీ వనితతో చేయి చేయి కలుపుకుని వస్తానని భయపడ్తున్నారేమో! కాని యీ విషయంలో నూటికి నూరుపాళ్ళు మీ కొడుకునే అన్పించుకుంటాను.

ఇకపోతే నా చదువుతో పాటు యూనివర్శిటీలోనే చిన్న పార్ట్ టైం ఉద్యోగం యిచ్చి మా ప్రొఫెసర్ నన్ను ప్రోత్సహిస్తున్నారు. నా ఫీజుల్లో రాయితీ యిప్పిస్తున్నారు. కనుక ఆర్థికపరంగా మీకు భవిష్యత్తులో యిబ్బంది పెట్టబోవడం లేదని గుర్తు చేస్తున్నాను. మీ ఆశలను అడియాశలు చేసే ఏ చిన్న పనైనా చేసి మీకు యిబ్బంది కలిగించబోనని విన్నవించుకుంటున్నాను.

అమ్మా! నేను యిక్కడ సరయిన ఆహారం తీసుకోవడం లేదని, అలవాటు లేని పనులతో చాల కష్టపడిపోతున్నానని మీరు ఆందోళన చెందుతున్నారేమో! తప్పదు, ఎవరైనా సరే అన్ని రకాల కష్టాలకు మైండ్ సెట్ చేసుకుని యిక్కడికి రావలసిందే! ఎవరో వచ్చి ఏదో రాస్తారనే మూఢనమ్మకం యిక్కడ పరిస్థితులకు సరిపడదు. అది ఎంతటిదైనా ఎవరి పనివాళ్ళు చేసుకోవలసిందే! ఎన్ని కష్టాలైనా ధైర్యంగా ఎదుర్కొనవలసిందే!

అందుచేతనేనేమో, యిప్పుడు జీవితం మీద ఒక ఖచ్చితమైన అభిప్రాయం, నమ్మకం యేర్పడుతున్నాయి. అనుకున్నది సాధించగలననే ప్రగాఢ విశ్వాసంతో ముందుకు సాగుతున్నాను.

పై చదువుల పేరు మీద నా కోసం మీరు యిప్పటికే చాల ఖర్చు చేశారు. బ్యాంకు అప్పు నిమిత్తం ప్రతి నెల వేలకు వేలు కడుతున్నారు. అది నేను మరచిపోయేది కాదు. ఉద్యోగంలో చేరగానే నా మొదటిపని బ్యాంకు అప్పు తీర్చడమే. దాని గురించి మీరు పెద్దగా అలోచించవలసిన అవసరం లేదు. మీరు అలా ఆలోచిస్తున్నారని కూడ నేను అనుకోవడం లేదు.

చివరగా, నేను కోరుకునేదల్లా మీరు ఆనందంగా, ఆరోగ్యంగా ఉండడమే! అనవసరంగా ఆలోచించుకుని మనస్సు పాడు చేసుకోవద్దు. నేను ఎప్పటికి మీరు అశిస్తున్న కొడుకునే! మరి ముగించేదా?

ప్రేమతో
మీ రోహిత్

ఎప్పుడు వచ్చిందోగాని, శ్రీమతి నా వెనుక నిలబడి నాతోపాటు ఉత్తరం మొత్తం చదివేసింది. ఆనందంతో చెమ్మగిల్లిన కళ్ళను, ముఖాన్ని చీర కొంగుతో తుడుచుకుంటూ...

మన రోహిత్ ఎంత ఎదిగిపోయాడండి! అప్పడే జీవితాన్ని కాచి ఒడబోసినట్లుగా ఎన్నెన్ని విషయాలు రాశాడండీ!!" అంది ప్రగతి.

"మరి వాడు నీ కొడుకు కదా! నీ తెలివితేటలే వాడికి వచ్చాయి మరి!" అన్నాను మెల్లగా. అప్పటికే నా కళ్ళు వర్షించడానికి సిద్ధంగా ఉన్న సంగతి ఆమె గమనించకుండా జాగ్రత్తపడ్డాను.

ఇప్పుడు చాలా ధైర్యంగా ఉందండి, నా కొడుకు మీద యిప్పుడు నాకు పూర్తి నమ్మకం యేర్పడింది. ఇక పనికిమాలిన ప్రశ్నలతో వాడిని వేధించను అంది సౌమ్యంగా.

"అంతే ప్రగతి, నమ్మకంగా బ్రతకాలి. అనుమానాలతో అనుక్షణం ఆలోచిస్తూ పోతే మన ఆరోగ్యమే పాడయి చివరికి మన పిల్లల్ని దిక్కులేని వాళ్ళుగా చేసిన పాపం మనకే చుట్టుకుంటుంది. అబ్బాయి చెప్పినట్లే నడుచుకుందాం" అన్నాను ప్రగతి కళ్లల్లోకి సూటిగా చూస్తూ.

"భోజనం చేద్దాం పదండి, యిప్పటికే చాలా ఆలస్యం అయింది" అంటూ డైనింగ్ టేబుల్ వైపు దారి తీసింది ప్రగతి.

నాకు ఆమెను అనుసరించక తప్పలేదు!

---


## ప్రస్థానం చందా కట్టారా?

**లేనట్లయితే వెంటనే చందా కట్టండి.**

**5 & 10 సం॥ల చందా కట్టి పాత ప్రస్థానాలను బహుమతిగా పొందండి (2002 నుండి 2006 వరకు)**

### సాహిత్య ప్రస్థానం మాసపత్రిక చందా వివరాలు

**సంవత్సర చందా (వ్యక్తులకు) : రు.120/-** **సంవత్సర చందా (సంస్థలకు) : రు. 150/-**

**అయిదేళ్లకు : రు. 500/-** **పదేళ్లకు : రు. 900/-** **విడి ప్రతి : రు. 10/-**

**ప్రజాశక్తి బుక్‌హౌస్ బ్రాంచీలన్నిటిలోనూ సాహిత్య ప్రస్థానం లభిస్తుంది. ప్రజాశక్తి దినపత్రిక ఏజంట్లకు చెప్పి వారి ద్వారా కూడా తెప్పించుకోవచ్చు.**

మేనేజర్
ప్రస్థానం
1-1-187/1/2, వివేక్‌నగర్, చిక్కడపల్లి, హైదరాబాద్-20
ఫోన్ :27660013 ; వివరాలకు : 9490099059 ; ఇ.మెయిల్: Prasthanam_ss@yahoo.co.in

## కవితలు

# నగ్నచీర...



**కదిరె కృష్ణ**

ఎంతో వేదన
కొంతే ఊరట
బతుకు పల్లేరు గాయలతోట
నల్లబంగారానికి చిక్కని నల్లపూసలు
నవ్వి నవ్వి సావునతమైన బక్కెద్దు
కుడుముల పండ్ల కోసం కుక్క ఎదురుచూపులు
మృత్యుకోరల నడ్మ సన్నాసి ముసలోడు మల్ల పెళ్ళికొడుకు
మౌనం నీకు మహదానందనమే కావొచ్చు
నా మెడ చుట్టూ బిగుసుకుంటున్న ఉరి
మౌని మహజ్ఞానే కావొచ్చు
మాటల సముద్రం ఇంకిపోద్దా?
నడిబజార్లో వాడెవడో నా శీలాన్ని వేలం వేస్తుండు
నడిరేత్రి వెన్నెట్లో మరెవడో బలాత్కారాన్ని జుర్రుతుండు
మాటల కరువు మద్దతు బరువు
గుర్కావాడి కర్ర మనింటి ముందు గేటుతో మాట్లాడ్డం
సముద్రం చంద్రుడు ఏదో దేశ ధ్వంసం గురించి సుదీర్ఘంగా
చర్చించడం
నా చెవులు స్పష్టంగానే వింటున్నాయి
నెత్తురోడుతున్న దిక్కుల రోడ్ల కరాచాలనం
సూర్యకిరణాల గుత్తి ఆకుల స్పర్శభాష
ఆకాశ హాజరీ పుస్తకంలో 'చల్లకుండ' దస్తూరి ముద్ర నాకు తెలుసు
సముద్రాలు నదులు ఏర్లు చెర్వులు కుంటలు పిల్ల కాల్వలు
చెట్లు గుట్టలు పిట్టలు రాత్రి పగలు ఉదయం సాయంత్రాలు
ముచ్చటించుకోటం
ఆనచిన్కులు భూమి గత్తరగత్తరగా తిట్టుకోవటం
నా చెవులు వింటూనే వున్నాయి
పంటచేల పయ్యెట గాలిపాటకు మత్తెక్కిన మోట బేరలు
ద్వారపాల పాట వంత బాడడం నాకనుభవమే
కారంచేడు పొలాల్లో నా నెత్తురు కాల్వల్ల
జెండాముంచి పైకెత్తినవాడు
ఖైర్లాంజి జయంతి సభలో నాయదేవ్త నొసట్న మహద్ చెర్వు
మృతవీరుల నెత్తురుతో తిలకం దిద్దుతుంద్రో...

ముందల ముర్సినవ్వ పండ్ల గుర్తెరగనట్టు
మాట్లాడనందుకు సిగ్గుపడకముందే మాట్లాడు
బతుకుల్నా క్రమిస్తున్న వర్డల్‌బ్యాంక్ రోడ్‌రోలర్
పనివాని నవ్వుల్ని కర్కశంగా మింగేస్తుంది
ప్రపంచం కొమ్మ మీద మన్షుల అస్థిపంజరాల్ని ఏలాడదీస్కుంటున్న
ఔ గ్లోబల్ ఎయిడ్స్
లోకం నగ్నంగా సంచరిస్తుంది. ప్లీజ్! ఇగనైనా మాట్లాడు
నేను మనిషినేనని నాది నవ్వేనని కంప్యూటర్ ఒప్పుకోవాల్న?
ముఖానికి నగ్న చీకటి నద్దుకొని యానిమేషన్ సూర్యునికోసం
ఎదురుచూపులు
ఓర్నీ! ఆవు గంగడోలు పులులు నాకుతున్నై
ఎలుకకు గంట గట్టేతందుకు పిల్లుల శిఖరాగ్ర సమావేశం
రాత్రి పరవళ్ళు తొక్కించిన ఇంగ్లీషు చిత్రంలో సెక్సు భంగిమల మీద
చిర్నవ్వులు కురిపిస్తున్న సన్‌డాడీలు
సరిగ్గా నేను అదే చెప్తున్నా
ఆ మన్షంటే కేవలం చావేనా?
నిన్ను తగలబెట్టాన్కివాడు నిప్పురాజేస్తుండు
ఇప్పుడైనా నోరు విప్పు
బత్కు మహా ఎడారి ఆలోచన నీటి చెల్మె
నీలో పుట్టిందనే నా ఆనందం
మేక మెడ సన్నుగాన్ని పెద్దగా పట్టించుకోనక్కర్లేదు
ఔటాఫ్ ఆర్డర్‌గాన్ని నాకొరకేం పెదవిప్పక్కర్లేదు
నీకోసమే మాట్లాడు మైడియర్ వర్ణ మానవుడా!
మైక్ టెస్టింగ్ వన్...టూ...త్రీ
తన కోసం మాట్లాడ్డమంటే
అందరి... నట్టే!

---



# నువ్వు నువ్వుగా

**ఈతకోట సుబ్బారావు**

నువ్వు నువ్వుగానే బైల్దేరుతావు
నువ్వుగా మాత్రం తిరిగిరావు
వెళ్ళినప్పటి స్ఫటికం
తిరిగొస్తే సాలిగ్రావం
వెల్లవేసిన గోడపైన
పిడకలు కొట్టినట్టే
గుండెల్లో కోటి మరకలు
పసినవ్వంత స్వచ్ఛంగా వెళ్ళినవాడివి
హిరణ్యాక్షుడంత "మురికి పట్టావు"
మనిషినీ, చుట్టూ కంచెలాంటి సంఘాన్నీ
కాదంటే మనల్ని మనం
దూషించుకొనేమిటి ప్రయోజనం
అన్నీ స్వయం కృతాలైనప్పుడు?

మనం పరిగెడుతూ
పారిపోయిన వాళ్లని విమర్శించడం
మన ప్రతిబింబాన్ని
అద్దంలో చూసుకోవడం లాంటిదే.
పారిజాతం పువ్వైనా సరే
కంపుని స్ప్రే చేసిన క్షణం
కొట్టేది కంపువాసనే.
వొక మనిషీ, మనసూ, వొక పుష్పమేనా

భూగోళాన్నే కలుషితం చేసినప్పుడు
ముత్యాన్ని దొర్లించినా
స్వచ్ఛదనం కోల్పోతుంది–
చిర్నవ్వుని అవమానపర్చడమెందుకు?
నవరసాలూ రంగరించుకొన్న
వేడి రక్తాన్ని దూషించడమెందుకు?
గాలి నిప్పు, నీరు నింగీ మట్టి
పంచభూతాలూ స్వచ్ఛత కోల్పోయాక
నిన్ను మంచు బిందువులా వూహించుకోవటం
నాలోని దట్టమైన భ్రమకి ఉదాహరణ
అందుకే చెప్తున్నాను
నువ్వు నువ్వుగానే బైల్దేరుతావు
నువ్వుగా మాత్రం తిరిగిరావు!

## తులనాత్మకం

# తెలుగు తమిళ లాలి పాటల్లో ఉయ్యాల



తెలుగు తమిళ లాలి పాటల్లో ప్రస్తావితమైన ఉయ్యాల రకాలను, రెండు సమాజాలలోనూ వాటిని తయారు చేయడానికి ఉపయోగపడిన సాధన సామాగ్రి. ఉయ్యాలను అమర్చిన తీరు. ఉయ్యాలలో బిడ్డను పడుకోబెట్టడానికి ముందు ఉయ్యాలను అలంకరించిన విధానం. ఉయ్యాలలో వేసిన పడక బట్టల ప్రత్యేకత. ఉయ్యాలచుట్టూ అమర్చిన చిత్ర విచిత్రమైన బొమ్మలు. చివరగా ఉయ్యాల ఊపేందుకు బిడ్డను ఆశీర్వ దించేందుకు వచ్చిన దేవతలు, వంశస్థులు, గోత్రీకులు, బంధువులు, పరివారజనం. లాలిపాటల్లో ప్రస్తావితమైన ఉయ్యాలను గమనిస్తే ఆనాడు పసిబిడ్డల విషయంలో వాళ్లు తీసుకొన్న జాగ్రత్తలు, అక్కర, బిడ్డపై వాళ్లకున్న గమనం ఇలా ఎన్నో కన్పిస్తాయి.

**డా॥ దేవారెడ్డి విజయలక్ష్మి**

**జా**నపద సాహిత్యంలో స్త్రీల పాటలకు ఒక ప్రత్యేక స్థానముంది. స్త్రీల పాటల్లో భాగమైన లాలిపాటలు తల్లి బిడ్డల అవ్యాజానురాగంలో వెలసిన ఆణిముత్యాలు. మాతృత్వం ఈ ప్రపంచానికి అందించిన మధురమైన ఆలాపన లాలిపాట. ప్రపంచపు వెలుగు చూసిన ప్రతి బిడ్డా వినే తొలిపాటకు ప్రాశస్త్యముంది. వీటికి జోలపాటలు, తొట్ల పాటలు, ఉయ్యాల పాటలు అనే పర్యాయి పదాలు / మాటలు ఉన్నాయి. లాలిపాట ప్రధానోద్దేశ్యం పిల్లలను సముదాయించి నిద్రపుచ్చడం. 'మాతృ ప్రకృతికి ఆమె ప్రతి రూపానికి గల రక్తానుబంధం జోలపాటల్లో చిగురిస్తుంది' అంటారు వింజమూరి సీతాదేవి.

లాలిపాటల్లో ప్రస్తావితమైన ఉయ్యాల అనేక విషయాలను వెల్లడిస్తుంది. పసిపిల్లల పడక అనగానే గుర్తొచ్చేది ఉయ్యాల. పసిపిల్లల పడకకు ఉపయోగించే ఉయ్యాలను కర్రతో చేస్తారు. 2–3 అనే కొలతతో దళం (చట్రం) క్రింద ఆధారంగా ఉంటుంది. దానికి నాలుగువైపులా ఒక అడుగు ఎత్తుతోచుట్టు కొలారంగా చెక్కతోటే బిగింపులు చేస్తారు. దీనితో ఇది ఒక తొట్టె ఆకారంగా వస్తుంది. గాలీ వెలుతురు రావడానికి వీలుగా కిటికీ సందులుంటాయి. తొట్టెపైన నాలుగు మూలలా అమర్చిన రింగులకు ఒక వైపు కొక్కీలను తగిలిస్తారు. ప్రాచీన పద్ధతులతో కట్టిన ఇండ్లల్లో దూలానికి నాగభాష్య ఆకారపు కొక్కీలు స్థిరంగా అమర్చబడి ఉంటాయి. ఆ కొక్కీలకు గొలుసుల మరో చివరి రింగులను తగిలిస్తారు. ఇనుప గొలుసులను గానీ లేదా లావుపాటి గట్టి తాళ్ళను గాని ఈ తొట్టెను ఊపడానికి వీలుగా నేలపై నుండి మూడు అడుగుల ఎత్తుకి కడతారు. ఇలాంటి ఉయ్యాలేకాకుండా 'జోలె' అని మరో రకం ఉయ్యాల కూడా వాడుకలో ఉంది. పిల్లల్ని నిద్రపుచ్చడానికి చీరగాని లేదా పొడగాటి వస్త్రాన్ని గాని దూలానికో చెట్టుకొమ్మకో వేలాడదీసి రెండు అంచుల్ని కలిపి 'దూముడి' వేస్తారు. ఆముడిని పైకి జరిపి కిందకు వేలాడే గుడ్డని అడ్డంగా నిలువుగా చేసి దానిలో బిడ్డని పడుకోబెట్టి నిద్రపుచ్చుతారు. దీన్నే 'జోలె' అంటారు. ఎక్కువగా ఇంటిలో తొట్టి ఆకారంలో ఉయ్యలలేని వారు, తమ బిడ్డను ఇంటిదగ్గర చూసుకొనేందుకు ఎవరూ లేనిపక్షంలో బిడ్డలను తమతోపాటు తీసుకొని వెళుతుంటారు. పనిచేసే స్థలానికి దగ్గరలో ఉన్న ఒక చెట్టుకొమ్మకు చీరతో జోలెనుకట్టి బిడ్డను పడుకోబెట్టి పనులు చేసుకుంటూ ఉంటారు.

ఉయ్యాలకు తెలుగులో ఊయల, ఉయ్యాల, డోలిక, తొట్టి, జోలె అనుపదాలున్నాయి. ఉయ్యాలకు తమిళంలో ఊంజల్, తొట్టిల్, ఏణై, తూళి అనుపదాలున్నాయి. ఉయ్యాల, ఊంజల్ పదాలకి కావ్య సాహిత్యంలో, జోల, తొట్టిల్, ఏణై, పదాలకి జానపద సాహిత్యంలో ప్రయోగం అధికం.

నేడు ఉయ్యాలలో అనేక రకాలున్నాయి. దూలంతో పనిలేకుండా ఇనుపచువ్వల్ని నేలకాన్చి వాటి ఆధారంగా ఉండే విధంగా ఇనుపచువ్వలతోనూ, ప్లాస్టిక్ తోను, అల్యూమినియంతో చేసిన ఉయ్యాలలు కార్పొరేటు ప్రపంచంలో భాగమైనాయి. తెలుగు తమిళ భాషల్లోని లాలిపాటల ఆధారంగా వాటిలో ప్రస్తావించబడిన ఉయ్యాల అమరికకు సంబంధించి తులనాత్మక అధ్యయనమే ఈ వ్యాసం.

తెలుగు తమిళ లాలి పాటల్లో ప్రస్తావితమైన ఉయ్యాల రకాలను, రెండు సమాజాలలోనూ వాటిని తయారు చేయడానికి ఉపయోగపడిన సాధన సామాగ్రి. ఉయ్యాలను అమర్చిన తీరు. ఉయ్యాలలో బిడ్డను పడుకోబెట్టడానికి ముందు ఉయ్యాలను అలంకరించిన విధానం. ఉయ్యాలలో వేసిన పడక బట్టల ప్రత్యేకత. ఉయ్యాలచుట్టూ అమర్చిన చిత్ర విచిత్రమైన బొమ్మలు. చివరగా ఉయ్యాల ఊపేందుకు బిడ్డను ఆశీర్వ దించేందుకు వచ్చిన దేవతలు, వంశస్థులు, గోత్రీకులు, బంధువులు, పరివారజనం. లాలిపాటల్లో ప్రస్తావితమైన ఉయ్యాలను గమనిస్తే ఆనాడు పసిబిడ్డల విషయంలో వాళ్లు తీసుకొన్న జాగ్రత్తలు, అక్కర, బిడ్డపై వాళ్లకున్న గమనం ఇలా ఎన్నో కన్పిస్తాయి. లాలిపాటల్లోని ఉయ్యాల చిత్రణ నాటి జీవన సౌందర్యాన్ని సౌభాగ్యాన్ని తీరుతీరునా వర్ణించి చూపుతుంది.

### ఉయ్యాల రకాలు :

**తూగుటుయ్యాల :** తూగు అంటే నిద్ర, జోగు పదానికి తూగు పర్యాయ వాచకం. నిద్రపోవడానికుపయోగించే ఈ ఉయ్యాలను సీతాదేవి కొంగు చెంగున చేరెడు ముత్యాలు పోసి కొని సిరిపొన్న చెట్టుకి కట్టి కుశలవులను జోకొట్టినట్లు......

"కొంగు చెంగున చేరెడు ముత్యాలు పోసి
కొన్నాది సీతమ్మ తూగుటుయ్యాల

**రత్నంపు తూగుటుయ్యాల :** రత్నాలు పొదిగించిన తూగుటుయ్యాలలో తనబిడ్డను పడుకోబెట్టి పిఠాపురం ఈశ్వరుడుగా భావిస్తూ ఒక తల్లి లాలిస్తుంది.

"బాగైన సౌధమున
రత్నంపు తూగుటుయ్యాలలోన
రాగములు పాడి నిదురించ
ఊచెదను ఉయ్యాలా"

వేదాంతమనియేటి తూగుటుయ్యాలః పర బ్రహ్మ స్వరూపంలోని మర్మాలను మాటలలో రంగరించి పాటగా విన్పించాలనే ధ్యాసలో వేదాంతాన్నే తూగుటుయ్యాల చేసేసిందో తల్లి...

"వేదాంతమనియేటి తూగుటుయ్యాలలో
సార్వభౌమనియేటి సరివిణలు బరచి"

**బ్రహ్మండమనే తొట్టి :** బహ్మండాన్నే తొట్టిని చేసిన ఒక అమ్మ తన పసివానిని లాలిస్తుంది.

"తొలుత బ్రహ్మాండాన్ని తొట్టి గావించీ
నాలుగువేదముల గొలుసులమరించీ"

**బంగారుతొట్టి :** ఉయ్యాలకు తొట్టి పర్యాయపదం. బంగారుతో మలిచిన తొట్టిలో వేసి గా తన బిడ్డను శ్రీ కృష్ణుడు భావించి పాడుతున్న తీరులో

"శృంగారముగ నిన్ను బంగారు తొట్టిలో
రంగుగా నునిచి నే జోల పాట పాడెదను"

"బంగారు తొట్లలోనూ
బాగుగా పవలించి
యుండవేమిరా"

"కుందనపు తొట్లలో కూర్చోవే తల్లి"

తమిళ లాలిపాటలలో ఊగుతున్న బంగారు ఉయ్యాలలో నిను వేసి ఆడించనాఅంటూ....

"అచైయుమామ్ పొన్నూంజల్"
"పోన్తొట్టిలిలే పొట్టాట్టి"

**వెండి ఉయ్యాల :**

"ఎండిదీ వుయ్యాల, పగిడీవి సేరులు"

**పగడాల రత్నాల డోలిక :**

పగడంపు రత్నాల డోలికను గట్టి....

"పగడంపు రత్నాల పసితొట్ల గట్టి
సొగసైన పైడి గొల్సుల చేత బట్టి"

"రంగైన రత్నాలు చెక్కించే
బంగారు తొట్లెలకునూ

**వైఢూర్యములు పొదిగిన మాణిక్యాల తొట్టి :**

త: "వెళ్ళివళై పూట్టి మేగవణ్ణ తొట్టికటి"
వైరం పదిచ్చమాణిక్కత్తొట్టిల్"

**అద్దాల తొట్టి:**

అద్దాలు తాపడంతో చేసిన ఉయ్యాల

"అద్దాల తోటిలోన నీవు అమరియున్నావు"

"అద్దాల తొట్టి లోపలనూ
అనుమానించి చూచేవు
ముద్దు పాపడున్నాడనుచూ మురిసీ చూచేవూ"

**దంతపుటుయ్యాల :** దంతంతో చేసిన ఉయ్యాల ప్రసక్తి

"దంతపు టుయ్యాలలోన
ధగధగా ఉయ్యాలలోనా"

**బంతుటుయ్యాల :** కిందకి పైకి స్ప్రింగు లాగా ఆడించే ఊయల్ని బంతు టుయ్యాల అంటారని దువ్వూరు సీతారామమ్మ అనే లాలిపాటపాడి వినిపించిన ఆమె చెప్పారు.

"చీర చెంగున చేరెడు ముత్యాలు పోసీ
కొన్నాది సీతమ్మా బంతుటుయ్యాల"

**ఒంటివెదురు బొంగుతోటే ఊయల :** ఒకే ఒక్క వెదురు బొంగుతో చేసిన ఉయ్యాలలో గొప్పగా ఆడుకోవడానికి వచ్చిన దాన గుణం కలిగిన బిడ్డవా...

"ఒత్త మూంగిల్ తొట్టిలిలే ఎన్‌కణ్ణే
ఒచందాడ వంద వల్లవనో"

**వణ్ణచ్చిఱు తొట్టిల్:** మాణిక్యాలు నింపి, వజ్రాలు పొదిగి, సువర్ణంతో చేసిన రంగు రంగుల చిత్రాలు చెక్కిన చిన్న ఊయలని తన బిడ్డనైన శ్రీ కృష్ణునికి బ్రహ్మ చేసిచ్చాడని పాడుతుంది.

"మాణిక్యం గట్టి వయిరం ఇడైకట్టి
ఆణిప్పొనాల్ చెయ్ద వణ్ణచ్చిఱు తొట్టిల్"

**చిత్తిరంబూ తొట్టిల్:** బొమ్మలు చెక్కిన ఉయ్యాలలో నిద్రపోరా అంటూ

"చిత్తిరంబూతొట్టిలిలే శిగామణియే నిత్తిరైచెయ్"

**చెక్క ఊయల :** చెక్కతో చేసే ఊయలల్లో టేకు, ఇప్ప రకాల కొయ్యను ఉపయోగించి చేసినట్లయింది.

"తేక్కు మరమ్ కడైందు చెయ్దదొరు తొట్టిలిలే"
"కాంచ ఇలుప్పై వెట్టి కఱుకఱువా తొట్టిలిట్టు"

పిల్లలను జోకొట్టి నిద్రపుచ్చడానికి రత్నాలనూ, పగడాలనూ, అద్దాలనూ పొదిగిన తూగుటుయ్యాలలే గాకుండా పారమార్థిక అంశాలను కూడా ఉయ్యాలలుగా చేసి దైవ సమానులైన బిడ్డల్ని వాటిలో పడుకోబెట్టి తల్లులు జోలలు పాడినట్లు ఆధారాలున్నాయి.

**బ్రహ్మండం:** దైవాంశ సంభూతుడుగా దైవ సమానుడుగా తన బిడ్డను భావించి తల్లి బ్రహ్మాండాన్ని తొట్టిగా చేసి నాలుగు వేదాలను గొలుసులుగా అమర్చి పాడుతుంది లాలి.

"తొలుత బ్రహ్మాండంబు తొట్టె గావించి
నాలుగు వేదముల గొలుసులమరించీ"

**ఓంకారం:** ప్రణవనాదమైన ఓంకారాన్నే తొట్టిగా చేసి పసి బిడ్డను పడుకోబెట్టి జోకొడుతుంది.

"ఓంకారమనియేటి ఒకతొట్టిలోన
తత్వమసి అనియేటి వలువలబరచి....

పంచాక్షరీమంత్రమనే అక్షరముల తొట్టే : నమః శివాయ అనే పంచాక్షరీ మంత్రానికి 'ఓం' కారాన్ని చేర్చి 'ఓం నమఃశ్శివాయ' అనే ఆరక్షరముల తొట్టిని బాలునికి ఏర్పాటు చేసి కృష్ణుడిని దానిలో పడుకుబెట్టి ఉయ్యాల లూపుతున్నారు.

"అ తొట్టియా తొట్టి ఆరక్షరంబుల తొట్టి
ప్రారంభమాయనే ఉయ్యాలో"

**వేదాంతం:** తమ ఇంట వెలసిన బాలుని విశ్వకర్తగా భావించి వేదాంతమనే తూగుటుయ్యాలలో వేసి ఓ తల్లి పాడే జోల ఇలా ఉంది.

"విశ్వనాథులగూడి విశ్వాసముగను
విశ్వకర్తకు నేడు విందుమనయింట....
వేదాంతమనియేటి తూగుటుయ్యాలలో
సార్వభౌమునియేటి సరివిణలుపరచి"

**భూస్థలం:** భూస్థలాన్నే ఉయ్యాలకు గురుపీఠంగా అమర్చిలాలిస్తున్న పాటకు మంచి ఉదాహరణ

"బరువైన భూస్థలము గురుపీఠకంబు
బంగారు అనియేటి చలువలటుపరచి"

బిడ్డలను నిద్ర పుచ్చడానికి వస్త్రాలతో కట్టే జోలెలాంటి ఊయలకు పట్టుబట్టలను, నార చీరలను వాడినట్లు తెల్పుతున్నాయి కింది లాలిపాటలు.

"పట్టు ఉయ్యాల్లో పరుండబెట్టీ"
"నార చీరలతోను ఉయ్యాల లేసి"
"పట్టుప్పోల్ తొట్టిలిలే పాలగన్ కణ్‌తూంగు"
"ఎట్టుగెజం పట్టెదుత్తు ఏళంగైయాల్ ఏణైకట్టి"

**అమృతం:**

అమృతాన్ని డొళికగా చేసి లాలిస్తున్న తీరు

"కాలికి కాలును కేలికి కేలును
తగులంగనీయక కేవలమా
అమృతాండోళికపై బవలించిన
మాలాలిని బోలిన చందమామ..."

తమిళ తెలుగు సమాజాలల్లో బిడ్డకు ఊయల అమర్చడం సర్వ సాధారణ విషయం. ఊయల తొట్టి రూపంలోనూ, జోలె రూపంలోనూ, రెండు సమాజాలల్లోనూ కడుగు తున్నారు రెండు సమాజాల్లోనూ బంగారు, వజ్రాలు, పగడాలు, మాణిక్యాల తోనూ, నార చీరలతోను, పట్టు వస్త్రాలతోనూ ఊయ్యాలలు అమర్చినట్లుంది. తమిళ పాటల్లో పారమార్థిక అంశాలతో ఊయల కట్టిన పాటలు లేవు. తెలుగు తల్లులు పరబ్రహ్మ స్వరూపాన్ని,

ప్రణవాన్ని, వేదాంతాన్ని, భూస్థలాన్ని, పంచాక్షరి మంత్రాన్ని, అమృతాన్ని ఊయ్యాలలుగా చేసారు.

**ఉయ్యాల కట్టేందుకు ఉపయోగపడిన దూలాలు:**

ఉయ్యాలకు ఆలంబన దూలం, దూలం గట్టిగా ఉంటేనే ఊయల ఊగుతుంది. లేకుంటే ఉయ్యాల బరువుకి కూర్చున్నా పడుకొన్నా వారి బరువుకి పడిపోయే ప్రమాదం ఉంది. లాలిపాటల్లో దూలాల ప్రస్తావన ఇలా ఉంది.

"వేసింది సీతమ్మ సిరిపొన్న చెట్టునకు"
"ఊడిద చెట్లాకు ఉయాలగట్టి
ఊపమని మీయమ్మ ఊరుతిరగొచ్చు"
"మామిడి చెట్టుకీ వేయరుయ్యాలా"
"కొబ్బరా చెట్లకూ వేయరుయ్యాలా"
"ఒక్కొక్క దూలాన వెండి పొడిగించా రెండొక్క దూలాన పైడిపొడిగించా"
"చిత్తము అనియేటి దూలములు వేసి"
"నిండు ఆకసమే అడ్డుదూలముకాగా"

అని ఉయ్యాలకు ఆధారంగా ఉండవలసిన దూలాలు పేర్కొనబడినాయి. కొబ్బరి చెట్టు కేసిన ఊయల జారకుండా ఉంటుందా? సందేహమే. తెలుగు పాటల్లోకన్నా తమిళంలో కల్పనా చాతుర్యం అధికం. ఒక తల్లి బంగారు దూలాలు వేసినట్లు పాటలో ఉంది.

"తంగమ్ కడైందు తముఖులిట్టు త్తూన్‌నిఖుత్తి"
మరోచోట తులసి చెట్టు
దూలంగా అమరినట్లు ఉంది.
"తుంబి తులసిమరం ఉనక్కు
తూణాగుమో ఊంజలుక్కు"

**ఉయ్యాల గొలుసులు / తాళ్ళు:**

ఉయ్యాలకు నాలుగు వైపులా అమర్చే గొలుసులు బంగారంతో చేసి వజ్రాలు పగడాలు పొదిగినట్లు వర్ణన.

"సొగసైన ముత్యాల జాలారు వేసీ
రంగైన బంగారు గొలుసులమరించి"
"సొగసైన పైడి గొలసుచేతబట్టి..............
"పసిమి మించిన మంచి పసిడి గొలుసులను
పొసగ వజ్రాలతో పొందుపరచగను"

తమిళంలో కూడా బంగారు తాళ్లతో ఉయ్యాల అమర్చినట్లు పాడడం జరిగింది. "ఆడుమామ్ తొట్టిల్ ఉరుళుమామ్ పొన్ కయిఋ"

ముత్యాలతోనూ పగడాలతోనూ గొలుసులమరించినట్లు
"ఆణిముత్యపు చేరులూ"
"పగిడీసేర్లా పట్టిపాట పాడినగాని"
తః "పవళక్ కొడికయిఋ"
శశిబాను గొలుసు ప్రసక్తి కింది చరణంతో
"శశిబాను గొలుసుతో సత్వజాలరుతో"
నాలుగు వేదాల్ని గొలుసులుగా అమర్చిన తీరు
"నాలుగు వేదముల గొలుసులమరించీ"

**ఉయ్యాలకు దిద్దిన మెరుగులు:**

ఉయ్యాలకు శక్త్యానుసారం అలంకరణ చేయడం ప్రత్యేకత. వేడుక సందర్భంగా గొలుసులకు, ఉయ్యాల తొట్టెకు పూలు అమర్చుతారు. గిలకలు, చిలకలు, బొమ్మలు అమర్చుతారు. ఉయ్యాల పలకలకు పసిడి ప్రతిమలను చెక్కించి హంసల బొమ్మలూ, చిలకల బొమ్మలూ అమరించినట్లు తెలుపుతుందీ లాలిపాట.

"పలకలకు ఆ పసిడి ప్రతిమలను రాసీ
హంసలా చిలుకలా అమరించెబ్రహ్మా"

బంగారు కోళ్లు తెచ్చి బిగించి పలకలకు పలికే చిలకల్ని రాయించి, మరో వైపు నెమళ్ళు చెక్కించి కీలు కీలున కోయిలలు పలికేలాగున అమర్చిన తీరు.

"బంగారు కోళ్ళు తెచ్చి యొకవైపు
పలుకు చిలకల రాసెనూ
నారాయణుని తొట్టెకు నొకవైపు
నెమళ్లు చెక్కించెనూ"
గోవిందుని తొట్టెకు కీలుకీలున
కోయిలలు పలికించెనూ"

తమిళ పాటలో తెలుగు పాటల్లో లాగా ప్రతిమలు చిత్రించడమే కాకుండా మేనమామల పేర్లు చిన్నాన్న పెద్దనాన్నల పేర్లు చెక్కించినట్లుంది. వరసైన మేనమామ పేరును ఉయ్యాలకు కుడిపక్కన చిన్నమేనమామ పేరుని ఎడమ పక్కన చెక్కించడం.

"వలదుపుఅమ్ తొట్టిలిలే
వరిచైయమ్మాన్ పేరెళుది"
ఇడదుపుఅమ్ తొట్టిలేలే
ఇళయ అమ్మాన్ పేరెళుది"

మరో పాటలో మాట్లాడే చిలుకల్ని రెండింటిని రాయించి పెదనాన్న పేరు రాయించి, ఎడమపక్కన నవ్వే చిలుకలు రాయించి, చిన్నాయన పేరు రాయించి ముద్దులాడుకొనే రెండు చిలుకల్ని రాయించి చిన్న మేనమామ పేరు రాయించినట్లుంది.

"పేచుంకిళి రెండెళుది పెరియప్పా పేరెళుది
ఇడదుపురం తొట్టిలిలే ఇళయప్పా పెరెళుది
చిరిక్కుమ్ కిళిఎళుది చిన్నప్పా పేరెళుది
కొంజుమ్ కిళి రెండెళుది
కుట్టి యమ్మాన్ పేరెళుది"

**ఉయ్యాలకు కట్టే గిలకలు:**

"తొట్టెపై అసమానగిరికీకట్టి
పొలుపై పూల సరులూ తొట్టిపై
సింగారించిరీ.........................."

బంగారు రింగులతో చతురస్రంగా ఉయ్యాల కట్టి పచ్చటి గిలకలను ఉయ్యాల కమర్చినట్లు తమిళ లాలిపాట.

"తంగ వళైపూట్టిచ్ చదురంగాయ్ తొట్టి కట్టిప్
పచ్చకిలు గిలుప్పై కట్టి తొట్టిల్ ఆట్టుమ్"

మాణిక్యాలను పొదిగించి వజ్రాలను మధ్యలో నింపి బంగారుతో రంగురంగులుగా చిన్న ఉయ్యాలతొట్టె అమర్చిన తీరును తెల్పేలాలిపాట.

"మాణిక్కం కట్టి వయిరం ఇడైకట్టి
ఆణిప్పొన్నాల్ చెయ్దువణ్ణన్ చిఋతొట్టిల్."

**ఉయ్యాలలో అమర్చిన పడక:**

పసిబిడ్డను నిద్రపుచ్చడానికి ఉయ్యాల కట్టడమే కాకుండా శరీరం ఏ మాత్రం ఒత్తు కోకుండా ఉండడానికి అమర్చిన పడక తెలుగు తమిళ లాలిపాటల్లో వర్ణించబడింది.

నిద్ర పట్టడానికి అనువైన పడక కుదరాలి. అందులోనూ పసిబిడ్డలకు పడక కుదరకపోతే ఏడుపునాపరు. 'చిడి' పెడుతుంటారు. అందుకే అమ్మలు బిడ్డలకు వేసే పడకలో కొంత జాగ్రత్త ప్రత్యేకత కనపరుస్తారు. ఉన్నవాళ్ళు లేనివాళ్ళు అనే తారతమ్యాలు పడకకు పరచే వస్తువులో ఉన్నా అందరు తల్లులూ ఆశించేది బిడ్డకు ఒత్తుకోకుండా మెత్తగా ఉండేపడకనే. పడకకై వేసే వస్తువులు తెలుగు తమిళ లాలిపాటల్లో చోటు చేసుకున్న తీరు గమనించినపుడు ధగధగ మెరిసేపరుపులూ, పట్టు వస్త్రాలు, చలువలు, పూలు, పాన్పులుగా అమరినట్లు లాలిపాటలు తెలుపుతున్నాయి.

"దగ దగ మెరిసే పరుపుల పైన"
"కుసుమ బుటేదారు బాలీసుతోను"
తః "ఎన్ ఐయాకవిళ్ందు ఉఅంగే మెత్తయిలే"
పంచనై మెత్తయి లేని పదుక్కుమ్ పచుంగిళియే
"పట్టు మెత్తలలోనపండుకోవమ్మ
త: "పంజుమెత్తై పట్టుమెత్తై కణ్ణే"
"చలవ పాన్పు మీద పవ్వళించావురా
"కుసుమ పొత్తుల మీద పండుకున్నాడమ్మా"

మంచి వాడబ్బాయి మల్లెలపాన్పు
"తః మల్లి గైప్పూంచ్చెందుమెత్తై"
"మల్లిగైప్పూ మెత్తయిలే ఏంది
ఎడుత్తారామ్ - చొక్కర్"
"చిన్నవాడబ్బాయి చిలుకల్ల పాన్పు"
'బంగారు అనియేటి చలువలటు పఱచి'

పనిమీద తల్లి పల్లెలోకి పోయింది. బిడ్డపోరు పెట్టి ఏడుస్తుంటే బిడ్డతల్లి బిడ్డకు పొసగని పడకవేసిందని అది పల్లేరు గాయల పరుపైందని వర్ణిస్తూ ఇతరులు పాడే జోలపాట.

"పల్లేరు గాయల్ల పరుపుల్లు పరచి
పండమని మీ అమ్మ పల్లె తిరగొచ్చు"

ఈగలు దూరకుండా ఉండే తెరను మధ్యలో అమర్చినట్లు తమిళ లాలిపాటలో ప్రస్తావితమై ఉంది.

"తేక్కు మరం కద్దైందు చెయ్దదొరు తొట్టిలిలే
ఈక్కల్ నుళయామల్ ఇట్ట తిరై నడువిల్"

తెలుగు లాలిపాటల్లో పారమార్థిక చింతనలో దైవత్వం నింపుకొన్న అంశాలతో బిడ్డకు పడక అమర్చినట్లు తెలిపే చరణాలు కన్పిస్తున్నాయి.

"ప్రణవపంచాక్షరీ పాన్పుతాగాంగా
చరిత్ర చిత్రపణవమే బాలీసుగాంగా"

మహా విష్ణువుగా బిడ్డను భావించే తల్లి ఆదిశేషుడిని తన బిడ్డకు పక్కగా అమర్చి పాడుతుంది.

బరువైన ఫణిరాజు పాన్పున మరించీ
"సహస్రమనియేటి పక్క గావించీ"

బిడ్డను శ్రీ కృష్ణుడుగా భావించిన తల్లి పాలమీగడ పడక వేసి పడుకోమని జోకొడుతుంది.

"పాల మీగడ మీద పవళించు కృష్ణయ్య"

**ఉయ్యాలను ఊపేవారు:**

పుట్టిన బిడ్డను ఉయ్యాల ఊపేందుకు ఏడు జగములు వారు ఏకమై వస్తారనీ ముక్కోటి దేవతలూ బిడ్డ ఊయల లూపుతారనీ, తమ వంశస్థులూ గోత్రీకులు ఊయల లూపుతారనీ దాదులూపుతారనీ లాలిపాటలు చెప్తున్నాయి.

తన బిడ్డను దేవాధిదేవుడుగా భావించి లాలించి ఊయలనూపను ఏడు జగముల వాళ్ళు ఏకమైవచ్చినట్లు భావిస్తుందో తల్లి.

"యెరుకగల పాపణ్ణి యేర్పాటు చేసి
యేడు జగములవారు యేకమైవూచా...."

దేవతలందరూ వచ్చిన తన బిడ్డ ఊయల ఊపినట్లు మరో భావనతో

"సురులెల్ల సరపణలు పట్టి ఊచగనూ"
"చెలువుగా లాలి యూచెదరు చెలు లెల్ల
రాజముఖులూ చెదురు రమణీ నీజోల
యిందు ముఖులూ
చెదరు యింపు సొంపరయా...."
"పంచె కన్నెలు గూడి పంచ వేదము పాడి
ఆ తొట్టి ఊపిరే ఉయ్యాలో"

కోమట్ల కులంలో పుట్టే ఆడబిడ్డని వాళ్ళ కుల దైవమైన వాసవీ దేవిగా భావించడం ఆనవాయితీ. వాసవీదేవియే తమయింట వెలసినట్లు భావించి కోమటి వంశస్తులూ గోత్రస్తులూ దేవికి ఊయలలూపినట్లు లాలిపాడడం కులసంప్రదాయం ఈ పాటలో శెట్లకుల గోత్రనామాలూ, వంశనామాలూ వరుసబెట్టి వస్తాయి.

"ప్రభాకర రుషివంశ పాలకూలైన పెండ్లికుల
రవిశెట్ల గోత్రములవారు
మైత్రేయి రుషివంశ పాలకూలైన మిధునకుల
మద్దికుల గోత్రములవారు"

మధురలో వెలసిన చొక్కనాథుడు తమ బిడ్డను ఊయలలూపినట్లు తమిళ లాలిపాట

"అట్టినార్ చొక్క లింగమ్ అయర్వువరుమ్ వరైయిల్"

ఏభైమంది దాదిస్త్రీ లొకపక్క తొమ్మిదిమంది దాదులు మరోపక్క ఉండి జోలనూపుతున్నట్లు పేర్కొంటూ

"అరాట్టి ఏజైతళ్ళుమ్
అంబదుపేర్ దాదిపెణ్గళ్
ఒరాట్టి ఏజై తళ్ళుమ్
ఒంబదుపేర్ దాదిపెణ్గళ్"

మనుష్యులు దేవతలే కాకుండా నెమలి ఊయలలూపినట్లు తెల్పేలాలిపాట.

"మెత్తై అచైగిఅదో మైలియలార్
తాలాట్ట / గంజాఇలై అడ ఉందన్ కవరిమాన్
కొంబాడ"

**ఊయల ఊపేవారి వర్ణన:**

బిడ్డ నిద్ర పోయేంతవరకు ఉయ్యాల ఊపు సాగుతూనే ఉంటుంది. ఎక్కువగా బిడ్డలు అతి తక్కువ సమయంలోనే నిద్ర పోతారు. ఒక్కొక్కసారి పడక కుదరకనో అనారోగ్యంతోనో పాలు చాలక, ఆకలివల్లనో, గాలి చాలకనో, అజీర్ణం వల్లనో, నిద్రరాకనో చిడి పెడుతూనే ఉంటారు అలాంటి సమయంలో ఊయలను ఆపకుండా ఊపుతూనే ఉండాలి. తెలుగు తమిళ లాలిపాటల్లో ఊయల ఊచే వారి వర్ణన కట్టినట్లుంది. గాజులు కంకణాలు ఒక దానికొకటి ఒరసుకొని శబ్దాలు చేస్తూ, జాజి పూలు కొప్పులనుండి రాలిపడుతుంటే అందెల చప్పుళ్లతో ఊయలలూపినట్లున్న వర్ణన.

"గాజులొరయగను కంకణములు జాఱ
జాజికొప్పుల నుండి జలజలరాలు
తేజమల రగ అందియలు రంజిల్లా......"

మొలనూలు గంటలు ఘల్లుమని మ్రోగుతూ ఉండేట్లు దండైన వంకీలు ఎక్కువగా మెరిసేంతవరకూ మెడలో వేసుకొన్న హారాలన్నీ అటు ఇటు కదలిపోయి మెలికలు తిరిగిపోయేంతవరకు తన బిడ్డను ఉయ్యాల ఊపినట్లు వర్ణన

"ఘల్లుమని మొలనూలు గంటలు మ్రోయ
దండైన వంకీలు మెండుగా మెరయా
మెడనున్న హారాలు మెలికలుగ జార
పంక జాక్షులు తొట్టి పాడియూచెదరు"

ఊపేవారికి అలసటరావటం సహజం. మధుర చొక్కనాథునికి చెమటలుపటి శోషవచ్చేంత వరకూ బిడ్డకు ఊయలూపినట్లుగా తెల్పుతుందీ తమిళ లాలిపాట.

"అట్టినార్ చొక్కలింగమ్
అయర్వువరుమ్ వరైయిల్"

ఈ విధంగా జానపద సాహిత్యంలో ఉన్న ప్రతి సూక్ష్మాంశాన్నీ తులనాత్మకంగా చూడడం వల్ల భిన్న సంస్కృతుల మధ్య భేద సాదృస్యాలను క్షుణ్ణంగా పరిశీలించవచ్చు. తెలుగు భాషా సమాజ సంస్కృతుల వారసత్వ వైశిష్ట్యం ప్రస్తుత తరానికి భిన్న కోణాలలో చూపించడానికి ఇటువంటి అధ్యయనం ఉపకరిస్తుంది.

★

## కవితలు



# మాయలోడు

ఎం.ఆర్.వి. సత్యనారాయణ మూర్తి

నాలుగు రోడ్ల కూడలిలో
బీటు కానిస్టేబుల్‌లా
ఎడంచేతిలో ఎర్రటి సిగరెట్టు
ముక్కుమీద జారుతున్న కళ్ళజోడుతో
కొత్త అక్షర పక్షుల కోసం
వలతో వాడు సిద్ధంగా వుంటాడు

జాయింట్ కలెక్టరు మా తాతగారిదొడ్లో
జామకాయలు కోసుకునే వాడని
డి.ఆర్.వో. మా అమ్మమ్మ గారి
పెరట్లో గోటింబిళ్ళ ఆడేవాడని
పంచతంత్ర కథల్ని పసందుగా చెప్తాడు.

అధికారభాషా సంఘం సభ్యుడివి నీవే
ఉగాది పురస్కారం నీదేనని
ఆశల వల విసిరి
ఊహల ఊయలలో నిను విహరింపచేస్తాడు

కవిత్వమంటే మోహిని కంటించుకున్న
రంగుకాదని
కవిత్వం నయాగజరాజపాతమని
సిగరెట్ట పొగ వలయాలతో నిన్ను
ఉక్కిరి బిక్కిరి చేసి
అరగంట సేపు నీ మెదడ్ని చిదిమేస్తాడు
నిన్ను కవిపుత్రుడుగా
దత్తత తీసుకుంటానంటాడు.

నీ జేబులోని పసుపుపచ్చ గాంధీ నోటు
వాడి లాల్చీ జేబులోకి వెళ్ళిపోయిందన్న
ఎరిక నీ కవగతమవగానే

కలల ఇంద్ర ధనుస్సు నుండి జారి
నడిరోడ్డుపై పడతావు.

ఈ సారైనా గట్టిగా వుండాలని
నూట రెండోసారి ఒట్టేసుకుంటావు
కృషిలేకుండా పైకెగరాలనుకున్న
నీ బలహీనతే
వాడు దోపిడీకి మూలమని తెలుసుకో
మానవత్వం లేని వాడి చెలిమి
భోగిమంటలా
నిను కాల్చేస్తుందని గుర్తుంచుకో.?

(విద్యార్థినులపై
పైశాచిక అత్యాచారాలకు స్పందనగా...)



# అందమైన నెమ్లీకలు

కటుకోఝ్వల రమేష్

ఉన్నట్టుండీ
మనసంతా బాల్యంలోకి జారిపోతుంది
అక్కడ దాగున్న స్మృతులన్నీ
వెన్నెల ముద్దలై నన్నలుముకుంటాయి
మహదానందంతోకాసింతసేపు
తేలియాడుతాను

స్వాతి ముత్యపు చిప్పల్లో
చిగురించిన అమాయకపు ఆశల్ని
నిండుగా నవ్వుకునే ఆనందపు ఊసుల్ని
ఏదో కలుషితం మ్రింగుతున్నట్లు
ఓ స్వప్నం నన్నెప్పుడూ వెంటాడుతుంది
నిజలా మూలాల్లోకి వెళితే...

గుర్తుకొచ్చే
మధుర ఘట్టాలన్నీ వికటిస్తాయేమోననీ..
ముందుగానే ఓ పథకాన్ని
నా చుట్టూ అల్లుకుంటాను.. ఇక
నిర్భయంగా మస్తిష్కంలో దాగిన
జ్ఞాపకాల పుస్తకాన్ని తెరుస్తాను
తేనెపట్టును చుంబించినట్టు
వొక్కొక్క పుటనూ
తనవితీరా అనుభవిస్తాను
స్వార్థం లేని

స్నేహ సంపెంగల పూదోటలో
నేనూ ఓ పువ్వై
సౌరభాలు వెదజల్లటం చూస్తాను
మనసంతా పులకరింపులతో ఘూర్ణిల్లుతుంది

ఈ పాఠ్య పుస్తకాల్లో
భద్రంగా దాచుకున్న నెమ్లీకలు
పిల్లల్ని పెడతాయనే భ్రమ
తియ్యగా వొలికిపోవటం చూస్తాను
పసుపు నీలిరంగుల స్వర్ణ శోభితాన్ని
తెరలు తెరలుగా ఆవిష్కరించిన నెమ్లీకల్నీ
ఇప్పటికీ....
సూతారంగా చెక్కిలిపై స్పృశించుకున్నప్పుడు
బాల్యమంతా ఊయలై జోలపాడుతుంది.

# ప్రేమ పన్నాగం

బి. డేవిడ్ లివింగ్‌స్టన్

కాలేజీ చదువు ఖరీదు పెరుగుతుంటే
వరల్డ్ బ్యాంకు వారికి
చిన్న బడిపైనే ప్రేమెందుకో?
నిరుద్యోగ రక్కసి స్వైర విహారం చేస్తుంటే
అక్షరాస్యతపై విశ్వవిపణికి మోజెందుకో?
ఆకలి అంతర్జాతీయ సమస్యగా
పరిణమిస్తుంటే
వస్తు వ్యామోహాలు పెంచే
బహుళజాతి ఆకర్షణ లెందుకో
రహదారులెన్నో గోతుల్ని తలపిస్తుంటే
సైబర్ సిటీలకు మెరిసే రోడ్లెందుకో?

త్రాగునీటికై జనం తంటాలు పడుతుంటే
వీధి వీధికో బెల్టు షాపెందుకో?
భూమి కోసం
బడుగుజీవులు సంఘర్షిస్తుంటే
కార్యరూపం దాల్చని
శుష్క వాగ్దానాలెందుకో?
గూడులేని పక్షులై అఘోరిస్తుంటే

కారుచౌక సెల్‌ఫోన్ లెందుకో?
స్వకీయుల్ని ఆంగ్లమాధ్యమాల్లో చేర్చి
మాతృభాషా ప్రచారలెందుకో?
వ్యభిచారాల్ని నిరోధించలేక
కండోమ్ ప్రకటన లెందుకో?
గుంట నక్కల్ని గుట్టుగా చేసి
ఉద్యోగుల అవినీతికి అరదండాలెందుకో?
ఆలయాన్ని అట్లా గాలి కొదిలేసి
ఇప్పుడు సేతువపుపై రాద్ధాంతాలెందుకో?
ఇది ప్రేమ కాదు - పన్నాగం
మమకారం కాదు - రహస్య వ్యవహారం.

## నివేదిక

# అంతరాలపై అక్షర మథనం 'జనకవనం'

**వొరప్రసాద్**



**జనకవనంలో బోయ జంగయ్య, అంపశయ్య నవీన్, తెలకపల్లి రవి, మేడిపల్లి రవికుమార్, నోముల సత్యనారాయణ**

**చా**రిత్రాత్మక తెలంగాణా సాయుధ పోరాటానికి నాంది పలికిన నేల నల్లగొండ, నైజం సర్కారుకు వ్యతిరేకంగా తెలంగాణా రైతాంగాన్ని సాయుధులను చేయడమే కాకుండా సాహిత్య, సాంస్కృతిక కేంద్రంగా కూడా వెలుగొందిన పట్టణం. అలాంటి చోట సిఐటియు రాష్ట్ర మహాసభలు జరుగుతున్న సందర్భాన మే 11న సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో 'జనకవనం' జరిగింది.

ఇటీవల అమరుడైన తెలంగాణా పోరాటయోధుడు బి.ఎన్.రెడ్డి స్మృతికి జోహార్లర్పించడంతో సభ ప్రారంభమైంది. సభాధ్యక్షత వహించిన సాహితీ స్రవంతి రాష్ట్ర కన్వీనర్ తెలకపల్లి రవి మాట్లాడుతూ– "ప్రజా సంఘాలకు మద్దతుగా సాహితీ స్రవంతి రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఇప్పటికే పలు 'జనకవనాలు' నిర్వహించింది. ప్రగతిశీల, లౌకిక, ప్రజాస్వామిక భావాల ప్రాతిపదికగా, విశాల వేదికగా సాహితీ స్రవంతి కృషి చేస్తుంది. సామాజిక ఉద్యమాల నుంచి సాహిత్య రంగం స్ఫూర్తి పొందుతుంది. ఈ నల్గొండ దానికి పెద్ద ఉదాహరణ' అని పేర్కొన్నారు. జనకవనాన్ని ప్రముఖ రచయిత, కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్ ప్రారంభించారు. 'ఇటీవల వచన కవిత్వం బాగా వస్తుంది. అందులోనూ ఆత్మాశ్రయ కవిత్వం కన్నా సామాజిక అంశాలే కేంద్రంగా ఎక్కువ కవిత్వం రావటం మంచి పరిణామం' అని అన్నారు. మరో అతిథి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ మేడిపల్లి రవికుమార్ కవిత్వం గురించి వివరిస్తూ– సమకాలీన కవుల కవితలను ఉదహరిస్తూ చేసిన సుదీర్ఘ ప్రసంగం సభికులను అలరించింది. ఇంకా నోముల సత్యనారాయణ, సారస్వత పరిషత్ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ మోతుకూరి నరహరి గోలకొండ, కథకులు బోయ జంగయ్య మాట్లాడారు.

జిల్లా పరిషత్ హాల్లో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ 'జనకవనం' జరిగింది. కవులు సామాజికపరమైన అనేక అంశాలపై స్పందించారు. నల్గొండ కవి పుప్పాల కృష్ణమూర్తి తెలంగాణా యోధుడు బి.ఎన్.ను స్మరిస్తూ చదివిన కవిత సభికుల్లో ఉద్విగ్నత నింపింది. జనకవనంలో కవులు భిన్నమైన, విస్తృతమైన కవితా వస్తువులతో తమ కవితలను రాసినప్పటికీ ప్రధానంగా నల్గొండ జిల్లా చరిత్ర, తెలంగాణా సాయుధ పోరాటం, ఫ్లోరిన్ సమస్య, కార్మిక పోరాటాలు, ప్రపంచీకరణ, అధిక ధరలు, మహిళలపై హింస, చేతి వృత్తులపై నిర్లక్ష్యం, మైనార్టీల అణిచివేత వంటి అంశాలను ప్రస్తావించారు. నల్గొండ ప్రజల పోరాటతత్వాన్ని చాటిచెప్తూ కవి కె. ఆనందాచారి 'ఒక్కసారి ఈ మట్టిని చేతబట్టి/ గుండెకు హత్తుకొని చూడు/ సామాన్యుల అసామాన్య సంగతులెన్నో/ చరిత్ర పుటలై విప్పుకుంటాయి/మట్టికి శక్తిలేదనుకోకు/ మట్టి మనుషుల నిత్య సామూహిక/ చలనాల చర్యల్లో నేల ప్రాణ శక్తుయి/ నిలిచింది కాదా/– (మట్టి మహత్తు) అని ప్రశ్నిస్తాడు. పోరాటాల జెండాను కీర్తిస్తూ జి. లెనిన్ శ్రీనివాస్ 'పదవే పదపదవే మా పతాక/ ఆశలు నింపిన అరుణ పతాక/ నిశీధి తొలగి నిశ్చలమై/ కన్నీరొలకని జగతికై' అంటూ ఆశావహ ధోరణి వ్యక్తపరిచారు. కార్మిక హక్కులపై జరుగుతున్న దాడిని నిరసిస్తూ 'మళ్ళీ పదునారు గంటల పనికై/ పెట్టుబడిదార్లు, పాలక వర్గాల కుట్రలొకవైపు/ ప్రపంచీకరణ పథ(క) రచన వేగిరం చేసే / ప్రపంచ బ్యాంక్ పహారా మరోవైపు (పోరాటం)' అంటూ తంగిరాల చక్రవర్తి వివరించారు. హైదరాబాద్ నుంచి వచ్చిన కవి జి. నరసింహామూర్తి 'కదలండీ–కదలండీ– వరదై పొంగండి/ ఉప్పెనై సాగే ఊరేగింపులో కలవండి/ నిప్పు గాలై మెరుపూ ఉరుమై/ ఓ విప్లవ కెరటమై ఉరకండి' అంటూ ఉధృత పోరాటాలను ఆశిస్తూ కవిత్వీకరించారు.

ప్రపంచీకరణను వ్యతిరేకిస్తూ, అమెరికా ధోరణిని నిరసిస్తూ కవులు బలమైన కవితలను వినిపించారు. 'కాంట్రాక్టీకరణ, ఔట్ సోర్సింగు ఏదైతేనేం/ ప్రభుత్వ రంగం జలసమాధి చేయడం/ ఉద్యోగ, కార్మిక చేపల్ని గట్టుకేసి తలలు బాదడమే' అంటూ నాశబోయిన నరసింహ పేర్కొన్నారు. అధిక ధరలపై బుష్ వక్ర భాష్యాన్ని నిరసిస్తూ కపిల రాంకుమార్ ఆగ్రహంతో బుష్ గాడు/ అప్రాచ్యపు కూత కూసె/ దిష్టితగిలె కామోసు/ మిర్చిపంట కాలిపోయె' అని కవితా చమత్కారాన్ని వినిపించారు. నల్గొండ కవి అలీ 'తెల్వదు తెల్వదనే కొంగ ఒంటికాలు జపం/ మస్కాగొట్టి గారడీతో బుట్టలోకి గుంజటం/ గుటుక్కున జీవిని మింగటం హుషారి/ చుట్ట చుట్టుకొని కామోష గావటం హుషారి'

అని తన 'హుషారి' అనే కవితలో అమెరికా ధోరణిని కవిత్వీకరించారు. ప్రపంచీకరణను 'మాయాబజారు' అంటూ ఏబూషి నర్సింహ్మా రాసిన 'ఇక్కడ పండగల్లాంటి పండగలె కాదు/ మనుషుల్లాంటి మనుషులు/ బతుకుల్లాంటి బతుకులు/ నవ్వుల్లాంటి నవ్వులుంటాయి/ నకిలీకి నాణ్యతకు మధ్య రేఖలు / ఇలా కనిపించి అలా మాయమవుతుంటాయి/ అంటూ ప్రపంచీకరణ ప్రభావంతో సజీవత కోల్పోయిన మనుషులు గురించి వివరించారు. సీనియర్ కవి వల్లభాపురం జనార్ధన బుష్ వ్యాఖ్యలపై స్పందిస్తూ- 'కోటి డాలర్లు చేసే మాటకు/ ఆబగా ఎగబడుతున్న తిండిపోతులమే/ గురివింద నీతిని వినిపిస్తున్న/ దాని జాలిగుండెలో మునిగి తేలండి/ ధరల పెరుగుదలను అరికట్టండి' తన నిరసనను వ్యక్తం చేస్తారు. ఉగ్రవాదం పేరుతో ఒక వర్గం ప్రజలపై జరుగుతున్న హింసను వ్యక్తీకరిస్తూ కవి గౌస్ మొహియుద్దీన్ రాసిన 'నిఘా' కవితలో అమెరికాలో అలికిడైనా/ ముంబాయిలో ముచ్చెమటలు పోసినా/ అనుమానపు రాబందులు/ నా పువ్వులే నలిపేస్తున్నాయి' వంటి చరణాలు ఒక విషాదాన్ని మన ముందుంచుతాయి.

పాలక పార్టీలు ఎన్నికలను తమ స్వార్థం కోసం ఎలా మార్చివేశారో వ్యంగ్యంగా చెప్తూ కవి రజనీ గంగాధర్ రాసిన 'ఎన్నికల పండగ' కవితలో 'ఇంటికో చెట్టు ఇల్లాలికో తాళిబొట్టు/ బతికితే ఉపాధి/ చస్తే సమాధి/ అతడి మ్యానిఫెస్టోలో ప్రధానాంశాలట/ అవి నలుపో తెలుపో/ దొంగవో దొరవో ఏమైతేనేం/ అవి కచ్చితంగా పచ్చనోట్లే/ పకోడీల్లా పంచుతున్నారు' అంటారు. మద్యనిషేధంపై పాలకుల ద్వంద్వ వైఖరిని అపహాస్యం చేస్తూ కవి మహ్మద్ బషీరుద్దీన్ 'సారా నిషేధం పోస్టర్లు చెప్పుతున్నవి ఇక్కడ/ బారులు తీరి బీరు షాపులు తెరిచి వున్నవి అక్కడ' అని ఆశ్చర్యం వ్యక్తం చేస్తాడు.

అమెరికన్ ప్రపంచీకరణ, మార్కెట్ లాభాల వేట దుష్ఫలితాలను కవిత్వీకరిస్తూ పౌరప్రసాద్- ఇప్పుడు ప్రతీదీ దృశ్యమే/ కంటి పాపల్లో నిండుకున్న/ ప్రతిబింబాలన్నీ మార్కెట్ దృశ్యాలే/ బిగ్ బజార్లూ/ సెంట్రల్ మాల్స్/ ఐమాక్స్లు/ ఆరబోసిన అశ్లీలాలు/ పసిపాపల అత్యాచారాలు/ చదువుల తల్లి ఒడిలో వేలాడే ఉరితాళ్ళు/ ఈనాటి జీవన యవనిక్రై/ నిరంతర దృశ్యప్రసారాలు/ ఈ దృశ్యాలకు చరమగీతం పాడే/ చైతన్య నేత్రాలు కావాలి/ కలల నేత్రాలు కావాలి' అంటాడు. కుల, మతాల పేరుతో శ్రామికుల ఐక్యతను విచ్ఛిన్నం చేసే ధోరణులను నిరసిస్తూ కవి వజ్రాల పరబ్రహ్మం - 'కులము పేర మతము పేర/ శ్రమజీవుల సమైక్యతకు/ చిచ్చుబెట్ట గండికొట్ట/ స్వార్థపరుల జిత్తులనే ఎరుగుదాము' అని మేల్కొలుపు వినిపించారు. చేతివృత్తులను నాశనం చేస్తున్న తీరును నిరసిస్తూ కవి సమతశ్రీ పరంధామ్ యాదవ్- 'ప్రపంచ బ్యాంకు వచ్చి మా వృత్తులా/ వారి చేతిలోకి తీసుకునే నక్క జిత్తులా/ మన ప్రభుత్వమే లొంగిపోయె వాని ఎత్తులా/ మేము పోరి నిలుపుకుంటాము మా వృత్తులా' అంటూ 'గొల్లోల్ల బాధ' కవితలో పోరాట కర్తవ్యాన్ని చాటారు. ఫ్లోరిన్ అంశాన్ని కవి ఎన్. భీమార్జున్ రెడ్డి కవిత్వీకరిస్తూ- 'మా దేహాలు వంకర్లు తిరిగిన దుస్సేరు తీగలు/ మేము ఎప్పుడూ నవ్వం, నవ్వితే మా గారపట్టిన పళ్ళు బయటపడ్తాయని మా బాధ' అని ఆవేదనగా వ్యక్తీకరించారు.

ఇంకా వై.వి. రమణారావు (కార్మికుడా! ఓ కార్మికుడా!), పెరుమాళ్ళ ఆనంద్ (ఆర్తనాదాలు), పెబ్బేరి ఖాజామైనద్దీన్ (వక్రీభవనం), జనజ్వాల (అక్షరం ఒక తరం కెరటం విరిగిపోయింది), బాసరాజు యాదగిరి (మనుగడ కోసం పోరాటం), సత్యశ్రీ కర్నాటి (పోరాట-ఆరాటం), గురజాడ అప్పారావు (నాడు-నేడు), కెయల్లెన్ (భూతల స్వర్గం), వేముల ఎల్లయ్య (కీనీడ), వై. దేవదాసం (అమ్మకోసం), మెరుగు మల్లేశం (చైతన్యం కావాలి), జి. నర్సిరెడ్డి (ప్రేలాపనలు), పందిరి శ్యాంసుందర్ (ఏది నిజం? ఏది అబద్ధం?), బొడిగె లస్మయ్య వంటి పలువురు తమ కవితలను చదివి వినిపించారు. ఇంకా హైదరాబాద్కు చెందిన కవి విప్లవదత్ శుక్లా తను రాసిన 'స్వాయంభవుడు' కవితను పంపించారు. భూపతి వెంకటేశ్వర్లు, కె. ఆనందాచారి, వల్లభాపురం జనార్ధన, పౌరప్రసాద్ జన కవనాన్ని నిర్వహించారు. నల్గొండ సిఐటియు మిత్రులు, కార్యకర్తలు సభ, భోజన ఏర్పాట్లు నిర్వర్తించారు. జనకవనం విజయవంతమైంది.

•



## రచయిత్రి భార్గవీరావు మృతి

రచయిత్రి డాక్టర్ భార్గవీరావు మే 23 న మృతి చెందారు. కొన్ని రోజులుగా హృద్రోగ సమస్యతో బాధపడుతున్న ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. ఆమె వయసు 60 సంవత్సరాలు. ఉస్మానియా విశ్వవిద్యాలయం రిటైర్డ్ ప్రొఫెసర్ అయిన భార్గవీరావుకు భర్త, ముగ్గురు కుమార్తెలున్నారు. పుట్టింది కన్నడ రాష్ట్రం అయినా ఆంధ్రప్రదేశ్లోనే ఆమె స్థిరపడ్డారు. 20వ శతాబ్దపు మహిళా రచయిత్రులు రాసిన వంద కథల సంపుటి 'నూరేళ్ళపంట' గా తెచ్చిన కథా సంకలనం భార్గవీరావుకు సాహిత్యరంగంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చి పెట్టింది. ప్రసిద్ధ కన్నడ రచయిత గిరీష్ కర్నాడ్ రాసిన 'నాగ మండల', 'హయవదన', 'తాళదండన', 'తుగ్లక్', 'అగ్నివర్షం' వంటి ప్రాచుర్యం పొందిన నవలల్ని భార్గవీరావు తెలుగులో అనువదించి జాతీయ స్థాయిలో పేరు సంపాదించారు. గిరిష్ కర్నాడ్ నవల అనువాదానికిగాను 1905 కేంద్ర సాహిత్య అకాడమీ 'సాహిత్య అవార్డు'తో సత్కరించింది. భార్గవీరావుకు సాహిత్యప్రస్థానం నివాళులర్పిస్తోంది.

## కవితలు

# పచ్చి నిజాలు



**చల్లగాలి బాబూరావు**

నువ్వెప్పుడూ
ఎవర్నొ ఒకర్ని ప్రశ్నల బాణంలో
గుండె గూటిలో గ్రుచ్చుతునే వుంటావు
నీ జ్ఞానం అబ్బురమన్నట్లు
వాళ్ళ తికమకల్ని చూసి గర్విస్తావు
లోలోన ముసి ముసి నవ్వులతో మురిసిపోతున్నావు గదూ
నీకింకా ప్రశ్నించడమంటే
వేళాకోళ మాడడమే తెలుసుగదూ
నేస్తం-ప్రశ్నెప్పుడు జీవిత వృక్షంల్లోంచి చిగురై పుట్టేది గదా!
ఈ లోకం అనంతమైనది
ప్రతి జీవితం ప్రశ్నలతోనే ఆరంభం
ప్రశ్నలెందే పరిస్థితులు అర్థం కావు
ప్రశ్నలెందే జీవితము అర్థం కాదు
మానవుడి జీవితమే వేల ప్రశ్నల పరంపర.
ప్రశ్నంటే నిప్పుకొలిమిలో కాల్చే ఆయుధం కాదు
ప్రశ్నంటే జీవితంలో ఎదుర్కొనే సమస్యల వలయం
ఇరు హృదయాలు కళంకమై
మనస్సులో అపశృతులు దొర్లుతుంటే
మనస్సు వీణపై శృతిని సరిచేసి మానస రాగం పాడేది ప్రశ్నే.
మనిషి ఎదుగుదలకు చేయూత నిచ్చేది ప్రశ్నే
మనిషిని అధం పాతాళానికి దిగజార్చేది ప్రశ్నే
జీవితపు వికవికలు పక పకలు మధ్య
నిగూఢార్థమైన సమస్యల్ని ఛేదించేది ప్రశ్నే
ప్రశ్నంటే ఒక మాయ
ప్రశ్నంటే ఒక దగా
ప్రశ్నంటే ఒక నిజం
ప్రశ్నంటే ఒక మోసం
ఎప్పుడూ ప్రశ్నించె వాడిని నిగర్వి అనుకోకు
వాడికింకా జీవితం నేర్పిన అనుభవ పాఠాలు తెలియవు
జగత్పునాదుల మీద యింకా ప్రశ్నే
కాలాతీత శక్తుల మీద యింకా ప్రశ్నే
వానరుడు వారధి కట్టాడన్నదీ ప్రశ్నే
ప్రశ్నొక శుభోదక మంత్రం
ప్రశ్నొక జీవన నైతిక విలువల సారం
ప్రశ్న కొందరి నోళ్ళలో నానే కుశల గీతం
ప్రశ్న కొందరి జీవితాలకు నిరంతర భాష్యం
అందరికి అన్ని తెలుసన్నది అసత్యం
కొందరికి ఏమీ తెలియదన్నది పచ్చి నిజం!

# నాన్న



**రవి ఠాకుర్**

ఈ విశాల విశ్వంలో
కాలిడడానికి
కారకుడివి నీవు
బుడి బుడి అడుగులకు
నడకలు నేర్పింది
చేయి పట్టి నడిపించింది
దారి చూపించిందీ-నీవే!
బలపం పట్టించి
అక్షరాల్ని డిగ్రీల దాకా
తీర్చి దిద్దిందీ -నీవే!
ఎనభై ఒడిలో పడి కూడా
నలభై వడిలోవలె
బ్రతుకు బండిని
ఈడ్చుతున్నది-నీవు కాదా?
రెక్కలొచ్చి పక్షులన్నీ
గూడు వదిలి ఎగిరి పోగా
గుండె దిటవు చేసుకొని
బండరాయిగా
మిగిలి పోయింది
నీవే! నీవే!
జీవిత గ్రీష్మంలో కూడా
వంగక కృంగక
నిటారుగా నిలుచున్న
నిన్ను చూసి
లోకమంతా వంగి వంగి
దండం పెట్టింది
కల్ప వృక్షమంటే తెలీదు
కామధేనువును చూడలేదు
కాని, నాన్నంటే నాకు తెలుసు
'నాన్న' అన్న పదం
జీవితానికి నాంది
నాదిఅనేది
మిగిల్చు కోకుండా
సర్వం పిల్లలకు ధారపోసే
నయగారా జలపాతం - నాన్న

# హ్యాట్సాఫ్!



**(మనుషులక్కాదు)**

**బి.ఇందిర**

నిబంధనలు తెలియని నీలాకాశం
మేఘాల నిఘాతో 144 విధిస్తుంది!
ఉరుముల వార్నింగిస్తుంది మొదట!
ఆపై శీతవాయువు ప్రయోగిస్తుంది!
కాసేపాగి కుండపోతతో
నీళ్లు చిమ్ముతుంది!
ఇకలాభం లేదనుకున్నాకే-
పిడుగుల ఫైరింగ్ ఓపెన్ చేస్తుంది!
అదికూడా చెట్లపైనో-పుట్టలపైనోతప్ప
గుండెలకు గురిచూడదు గుడ్డిగా!
ఒకటీ-అరా నష్టానికే
మధనపడి మౌనం వహిస్తుంది!
ఎక్కడ నేర్చిన విద్యో మరి-
హ్యాట్సాఫ్!!

# గుంటూరులో శతాధిక మహిళా కవితా స్వరాలు



ఏప్రిల్ 27వ తేదీన గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి శతాధిక మహిళా కవి సమ్మేళనంలో కవి కె.జె. రమేష్ రచించిన "గుంటూరు నానీలు" ఆవిష్కరించిన ప్రముఖ కవయిత్రి డా॥ చిల్లర భవానీదేవి. చిత్రంలో గుంటూరు జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు సోమేపల్లి వెంకట సుబ్బయ్య, ప్రముఖ కవి డా॥ ఎన్. గోపి, కవి కోసూరి రవికుమార్

గుంటూరు జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఏప్రిల్ 27న నిర్వహించిన మహిళా శతాధిక కవి సమ్మేళనంలో రాష్ట్రం నలుమూలల నుండి శతాధిక మహిళలు వచన గేయ, పద్య శైలుల్లో తమదైన సొంత గొంతులను వినిపించి గుంటూరు కారపు ఘాటునూ, వేసవి నడి ఎండనూ తలపించారు. వివిధ సామాజికాంశాలను స్పృశిస్తూ సాగిన మహిళా కవి సమ్మేళనములో 108 మంది మహిళలు పాల్గొని కార్యక్రమాన్ని సుసంపన్నం చేశారు.

రచయితల సంఘం అధ్యక్షులు సోమేపల్లి వెంకట సుబ్బయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమములో ముఖ్య అతిథిగా డా.ఎన్.గోపి, విశిష్ట అతిథిగా బైసా దేవదాస్, ఆత్మీయ అతిథులుగా ప్రముఖ కవయిత్రులు శ్రీమతి ఎన్. అరుణ, డా. సి. భవాని దేవి, ఆలిండియా రేడియో స్టేషన్ విజయవాడ సంచాలకులు మంగళగిరి ఆదిత్య ప్రసాద్, నె.ర.సం. ప్రధాన కార్యదర్శి పెరుగు రామకృష్ణ, ప్ర.ర.సం. కార్యదర్శి పొన్నూరు వెంకట శ్రీనివాసులు, కృ.ర.సం. కార్యదర్శి జి.వి.పూర్ణచంద్‌లు పాల్గొన్నారు.

సభలో ఐదు పుస్తకావిష్కరణలు జరిగాయి. కె.జె. రమేష్ రచనలు "గుంటూరు నానీలు, భ్రమలను మోసుకుంటూ" ఎస్వీ కృష్ణ జయంతి "దృష్టి" కథా సంపుటి, ఎస్వీ కృష్ణ "హలో మిసెస్ చక్రపాణి స్పీకింగ్" శ్రీమతి కోవిలగారి "ఆణిముత్యం" ఆవిష్కరించ బడ్డాయి.

సభలో సోమేపల్లి మాట్లాడుతూ సాహిత్యాన్ని గుంటూరు జిల్లాలో సుసంపన్నం చేస్తూనే రాష్ట్రంలోని ఇతర జిల్లాల సంఘాలకూ, కవులకు స్ఫూర్తిదాయకంగా వుండాలని ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అన్నారు.

డా. ఎన్. గోపి మాట్లాడుతూ పూర్వం ప్రపంచ చరిత్రలో కవయిత్రుల సంఖ్య తక్కువగా ఉండిందనీ, కానీ ఇటీవల బాగా పెరిగిందనీ, కవికి కావలసిన ఆత్మస్వేచ్ఛ ఇప్పుడు లభిస్తున్నందునే బాగా రాయగలుగు తున్నారని కవిత్వం చేయవలసింది మనిషితో మనిషికి స్నేహమని ఇలాంటి సమ్మేళనాలు ఖచ్చితంగా కొన్ని కొత్త ఆలోచనలను సృజస్తాయనటంలో సందేహం లేదని అన్నారు.

'నేటి నిజం' సంపాదకులు బైసాదేవ దాస్ మాట్లాడుతూ మానవ చరిత్రలో సమూహాలుగా ఏర్పాడ్డాకే సంస్కృతి అభివృద్ధి చెందింది. ఒక చోట చేరినప్పుడే చర్య మొదలవుతుంది. కొన్ని ఆలోచనలు, కొన్ని ఆవేశాలు, కొన్ని మార్గదర్శకాలు ఒకచోట చేరినప్పుడు సామాజిక దృక్పథం స్పష్టంగా వుంటుందని అన్నారు.

శ్రీమతి ఎన్. అరుణ మాట్లాడుతూ పురుషాధిక్య ప్రపంచంలో వేదికలు పంచు కోవటమే కాదు వేదికను సృష్టించుకోవటంలో కూడా స్త్రీ విజయం సాధిస్తోందనీ ఉదాహరణకు ఈ సభే నిదర్శనం అనీ అన్నారు. కేవలం స్త్రీలను ఒక చోట చేర్చడం గొప్ప విషయం, అందుకు గుంటూరు జిల్లా రచయితల సంఘం నడుం కట్టడం ముదావహం అన్నారు.

డా॥ శ్రీమతి సి.భవానిదేవి మాట్లాడుతూ ఇది అక్షరాన్ని ఆయుధంగా మార్చి కవిత్వం, రాయవలసిన సందర్భం. అటు పితృస్వామ్యానికీ ఇటు మాతృస్వామ్యానికీ మధ్యన పరుగు పెడుతున్న లోకమిది. ఇటువంటి సమయంలో కవిత్వం కోసం ఇంత మంది కలవటం, కలపగలగటం గొప్ప సంఘటనగా అభివర్ణించారు.

నె.ర.సం. ప్రధాన కార్యదర్శి పెరుగు రామకృష్ణ కవులకు సూచన చేస్తూ అంతర్జాతీయ సమస్యలను కూడా కవిత్వ కరించవలసిన అవసరాన్ని వివరించారు. పర్యావరణంపై, మనుషులను మర మనుషులుగా మనసులేని యంత్రాలుగా చేస్తున్న టి.వి. మీడియాలపై అతివలు విరుచుకుపడవలసిన అవసరాన్ని చెప్పారు. అంతర్జాతీయ జాతీయ వేదికలపై ఆంధ్ర మహిళ కవిత్వాన్ని వినిపించగల అవకాశాలను ఇలాంటి కార్యక్రమాలు కల్పిస్తాయని అన్నారు.

ప్ర.ర.సం. కార్యదర్శి పొన్నూరు వెంకట శ్రీనివాసులు మాట్లాడుతూ శతాధిక కవి సమ్మేళనాలు అనేకం జరిగినా మహిళల కోసమే జరగటం గొప్పగా వుంది. ఇన్ని ఆలోచనలు ఒక చోట చేర్చగలగటమే విజయం అన్నారు.

డా. పాపినేని శివశంకర్ మాట్లాడుతూ "కవిత్వం గొప్ప ఉత్ప్రేరకం కవిత్వం మనిషిలోని ఆలోచనలను వేగవంతం చేస్తుందనీ కవిత్వం మనిషిలోని ఆవేశాలను వడకట్టి పరిశుభ్రమైన దారి నిర్మించి దృక్పథాన్ని సరిచేస్తుందనీ అన్నారు. నేటి కవులు రాయటమే కాదనీ అధ్యయనం చేయవలసిన అవసరాన్ని నొక్కి చెప్పారు.

పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పుస్తక ప్రచురణే భారమవుతున్న ఈ సందర్భంలో పుస్తకావిష్కరణమరీ భారమవుతున్నది.

మహిళల సమస్యలనే కాకుండా అన్ని అంశాలపై కవిత్వం రాయటం మంచి విషయమని అన్నారు.

రాంకీఫౌండేషన్ ప్రతినిధులు ఎం.వి. రామిరెడ్డి, వినయ్ కుమార్‌లు మాట్లాడుతూ రాంకీ సామాజిక సేవకే పరిమితం కాదనీ, సాహిత్యం ద్వారా సామాజిక చైతన్యానికీ కృషి చేస్తుందని స్త్రీలు నైరాశ్య భావానికి లోను కాకుండా అధ్యయనం చేసే కొద్దీ అక్షరాలను పదును పెరుగుతుందనీ అన్నారు.

చివరగా కార్యదర్శి బొమ్ము ఉమామహేశ్వరరెడ్డి మాట్లాడుతూ రచయితల సంఘం నిర్వహిస్తున్న కార్యక్రమాలు సాహిత్య చరిత్రలో సంచలనాలుగా మిగిలిపోయేలా కృషి చేస్తున్నామని తెలిపారు.

కవి సమ్మేళనం తొమ్మిది ఆవృతాలుగా జరిగింది. సభల్లో పాల్గొంటూ "వలస కులాసా కాదు గానీ, కొన్నాళ్ళకు అలవాటైపోతుంది" అని ఎన్. అరుణ అన్నట్లు స్త్రీ జీవితపు వివిధ పార్శ్వాలనూ, సామాజిక అంశాలనూ స్పృశిస్తూ శతాధిక మహిళా కవి సమ్మేళనం దిగ్విజయంగా జరిగింది.

కవిత్వంలోకి అప్పుడే అడుగు పెడుతున్న వారూ, బాగా రాస్తూ పత్రికా ప్రపంచానికి చిర పరిచయమైన వారు పద్య కవిత్వం నుండి ఇంకా చదువుతూరాస్తు వున్న 70.80 సం.లు వారూ ఈ సమ్మేళనంలో పాల్గొని మంచి కవిత్వం చదివారు.

విన్నన్నపేట నుండి జాలాది విజయ "అమ్మ ఒక శల్య స్వప్నం" అంటూ వినిపించిన కవిత శ్రోతలను మునివేళ్ళపై నిలబెట్టింది. ప్రపంచీకరణ దాటికి అమ్మతనమూ ఆవిరవుతున్న వైనాన్ని గట్టిగా అక్షరీకరించారు.

కర్నూలు నుండి "విజయ దుర్గ" ప్రసార, మీడియా మానవ జీవితానికి చేస్తున్న చేటును వివరిస్తూ దేవుడు వరమిస్తే 'బిడ్డ'ను మళ్ళీ కడుపులో దాచుకోవాలని వుందని చెబుతూ భూమి పైన పేరుకుంటున్న అభద్రతా భావాన్ని బద్దలు చెయ్యాలని కోరారు.

"జ్వలిత" సర్కస్ మళ్ళీ మొదలైంది. అనే కవితలో" ఆకురాల్చటం ఒక తప్పని సరి ప్రక్రియ అంటూ 'భక్షణ కూడా ఒక కళే ఎవరైనా గుర్తించి సన్మానమో చేయకూడదా?' అనంటూ వ్యంగ కవిత్వం చదివారు.

చీరకట్టినట్టి చిన్నదానను జూచి
బామ్మవచ్చెన నుచు బాధపెట్టి
హాస్య మాడు చుండె అతివలిప్పుడు
చూడకప్పుకొనుట వళ్ళు తప్పుకాదు

అంటూ సింహాద్రి వాణి కురచ దుస్తులను వ్యతిరేకించారు.

చింతా లక్ష్మీసుజాత "నారీభేరి" కవితలో ఆడపిల్లల జీవితాల నుంచి, ఎర్రబడ్డ నెత్తుటి నేల మౌనంగా చూస్తోందని 'ప్రేమోన్మాదుల ఆట కట్టించేందుకు వేట కత్తివై ముందుకు సాగాలని కవిత చదివారు.

రామ్‌కీ ఫౌండేషన్ వారు అందించిన జ్ఞాపికలు, రచయితల సంఘం వారి సత్కారము, ప్రశంశా పత్రాలతో సంరంభం ముగిసింది.

సభను రచయితల సంఘం కార్యవర్గ సభ్యులు డా. సి.వి. సుబ్బారావు, లయన్ కాకరపర్తి సుబ్రహ్మణ్యం, వై. హెచ్. కె. మోహనరావు, పి.వి.రమణ కుమార్, ఆళ్ళ నాగేశ్వరరావు, వి.బి.ప్రసాద్, ఎస్. ఎం. సుభాని, నాగిశెట్టి తాతయ్యా నాయుడు, సి.సి. శ్రీనివాస్ నిర్వహించి ఆద్యంతం విజయవంతం చేశారు. •

---

# నీవు లేని నేను!



## గుర్రాల రమణయ్య

నీవు లేని నేను
తెగిన గాలి పటాన్ని!
నిశిరాత్రిలో
గమ్యం కానరాని
బాటసారిని!
దారితప్పి
ఎడారి బారిన పడిన
మూగ జీవిని!
జీవచ్ఛవాన్ని!
అనురాగాల కొలనులో
ఆనందాల పన్నీటిలో
స్నానం చేసిన నాటి రోజులు
గుర్తొచ్చినపుడు....
నేను పోగొట్టుకున్న
పెన్నిధి కోసం-
ఎంతగా తపిస్తున్నానో తెలుసా!
మనసు మూగగా రోదిస్తుంది!
ఎవరికి చెప్పుకోను-?

రోజూ నీవు
పెంచి పోషించిన నీ నేస్తాలు
పూల మొక్కలతో చెప్పనా-
ఉదయం సాయంత్రాలలో
మనం కలిసి వెళ్ళేటప్పుడు....
మనకు స్వాగత గీతాలాలపించే-
ఉషోదయం-
చంద్రోదయంతో చెప్పుకోనా
రోజూ మనం కబుర్లు చెప్పుకొనే
పూల వనంలోని
బుద్ధుని విగ్రహ పాదాల ముందు
మోకరిల్లనా-!
నీవు పూజించే-
జీవన విధాన కర్తకి
నా ఆవేదన నివేదించనా!

మనసు కల్లోల తరంగమై
ఒకోసారి అలజడి రేపుతోంది!
మరోసారి-
అందాల లోగిలిలో
ఆనందాన్ని ఆస్వాదిస్తూ
అనురాగాల విడిది
నీ ప్రేమ ఒడిలో సేదదీరినట్లు....
చెప్పటం మరచాను
మన వయసులోని
జంటను చూసినపుడు
ఎంత మురిసి పోతానో తెలుసా!
అది-
మాటలలో చెప్పలేని
అనిర్వచనీయ ఆనందం!

వాళ్ళు కనుమరుగయ్యాక
మనసంతా నిర్వేదమై
మానసికంగా నిరసించి
ప్రేమలు ఆప్యాయతలు
భ్రమలా-
సర్వం శూన్యంగా-
విరాగిలా నేను.....!
నాడు నాగురించే నీ తపన!
నేడు నీవులేవనే ఆవేదన!
ఏం చేయను! ఏం మాటాడను!
కన్ను మూస్తే నీవు
ప్రతి కదలికలోను నీవే!
అనవరతం నివే!
నీస్మృతులే!
బాహ్యంగా దూరమైనా
నీడలా నీవు నా వెంటే!
నీవు లేని నేను మమతల లోగిలి
కోసం
వెతుకులాటలో యిలా.....!

# కవితలు

## సొమ్మలోడు



### సిరికి స్వామినాయుడు

ఏ వీధి అరుగుమీదో చీకటి దుప్పటి కప్పుకొని
రాతిరి కొమ్మ వంచి పిడికెడు పలవరింతల్ని దూసి
నిదుర నేలపై చల్లుతూ ... వాడు
వేకువ తడి తగలగానే ఉలిక్కిపడి
దినం ముళ్ళ కంపలపై జారిపడతాడు.
మునివేళ్ల కంపతో పశువుల కసవంతా నెత్తిన పోసుకొని
పోగేసిన పెంట కుప్పల మించి పొద్దును జూస్తాడు.
జిల్లేడాకులో నాయురాలు సల్లంది పోసినప్పుడు
వాడు, కుడితిగోళంలో కన్నీరు తాగే మూగజీవే!
పొదుగును గుద్దిన దూడను జూసి
పాడిగోవు వాడ్ని సాకినప్పుడు,
కళ్ల ముందు... పోయిన కన్నతల్లి ప్రేమతో ముద్దాడే జ్ఞాపకం.

అక్షరాల తోటలో... సీతాకోక చిలుకలా
స్వేచ్ఛగా ఎగరాల్సిన వయస్సులో
సిగ్గుమీద చిరుగుల ఆకాశాన్ని తొడుక్కొని
జీవనదుల్ని ముక్కున ఎగజీదుకుంటూ
అంటుకట్టుకు పుట్టిన గొని ముక్కను
అరచేత పట్టుకొని, బక్కవెకకాల
వాడి బాల్యం పరుగులెడుతుంటే...
గోడమీద నినాదాలు గోరపిట్టలై ఎగిరిపోతాయి.

సూరీడు, సొమ్మలోడై
ఆకాశం ముందపట్టు మీద మబ్బుల్ని కాసినట్టు
పచ్చికబయళ్ల మీద పశువులు కాస్తున్నపుడు
వాడు సరిహద్దుకాపలాకాసే సైనికుడే!
గేదేమీదెక్కి, గొనిముక్కను పిల్లనగ్రోవి జేసి
జెండాపై కపిరాజెత్తుకుంటే...
రథం మీద కిట్టయ్య రాయబారానికి పోయినట్టే!

అప్పటివరకు నెత్తిమీద నిప్పులు చెరిగిన సూరీడు
అంబల్లేలకు ఆకలిమంటై రగిలినపుడు
వాడి కడుపు కాలేసిననట్టే వెన్నుగోడ కతుక్కుపోతుంది.
త్రినాథ వ్రత కథలోని గోదాలాంటి గొడ్డైనకాల
వాడో విడిచిన బాణమై పరుగెత్తినపుడు
కాలికి ముళ్లు గుచ్చి కంటెంట నెత్తుటి వాన కరుస్తుంది.

చేను మేసిందని గొడ్డును బాదినట్టు
కామందు కొట్టిన కొరడా దెబ్బలకి
వాడు, కివ్వుమన్నపుడు
గోడకు వేలాడేవాడి తల్లిపటం భళ్లున పగిలిపోతుంది.
గాయాల మీద మట్టి గంధం పూసుకొని
గండిపడిన గుండె చెరువులో గేదెల్ని కడుగుతాడు.
ఎండమొక్కై వదలిపోతున్న వాడ్ని జూసి
పడమట మేఘం భోరున ఏడుస్తూ
నీటి కొంగుతో మొహం తుడుస్తుంది.

గోధూళివేళ మందని మళ్లించినపుడు
కమ్మే ధూళి మేఘాల్లో వాడి పొలికేక
ఉత్తర గోగ్రహణంలో వీరుడి విజయనాదమే!
మునిమాపు వేళ.
మూగనేస్తాల్ని రాత్రి కొయ్యకట్టి
నల్లతుమ్మ చెట్ల వెనుక వాలిపోతున్న నెలవంకలా
చీకటి చెట్టుకు వేలాడి ఒంటరి గబ్బిలమై..!!

## విషధూమం




### వడలి రాధాకృష్ణ

ప్రతి స్పందనలేని నిగూఢ వేదనతో ఓ ప్రశ్నగా
సంస్థలు... చట్టాలు... కట్టుబాట్లు.... వ్యవస్థ ముసుగులో
ఉనికిని సైతం ప్రశ్నార్థకం చేస్తూన్నట్లుగా
అక్కరకు రాక ఆదుకోని పథంలో
గల్లంతవుతూన్న మనిషితనం!
మనిషీ మానవత్వమూ
మనకు మాత్రమే మనుగడ అనుకున్న పిచ్చి భ్రమలో...
ఈగనో దోమనో చంపినంత అవలీలగా
పైశాచిక ప్రవృత్తి ప్రకోపిస్తూ,
సమాజం సభ్యత విలువలకు మరణ శాసనం లిఖిస్తూంటే
వావి వరసలు ఉచితానుచితాలు
అనాది విశ్వాసాన్ని అంతమొందిస్తున్నాయి!
చెడ్డ సంతానమే తప్ప చెడ్డ తల్లి ఉండదన్న రేవడిలో
కాలకూటములు కదదేరుస్తూ...
వ్యవస్థ వికృత రుగ్మతతో పుచ్చినపుడు,
జడలు విచ్చుకున్న అమానుష ఉన్మాదం
విషపు వేళ్ళలా ప్రబలమవుతూ
కరాళ కర్కశ హస్తాలు ప్రేమకీ కామానికీ
మధ్య అడ్డుగీత చెరిపేస్తూంటే
పాషండ సంస్కృతి
సామాజిక అసామాన్య వాస్తవికత
ప్రేరణకు పెదధోరణిగా...
అసలు ప్రాణమివ్వాల్సిన ప్రేమ ఉన్మాదంగా మారుతుంటే
విష ధూమపు కొలిమిలోని నిగూఢ ప్రశ్న
మానవత్వం మాటు ఉక్కిరిబిక్కిరవుతూనే ఉంటుంది

# 'గులాంగిరీ' ఒక పరిశీలన

సిద్దెంకి




**భా**రతదేశ పునరుజ్జీవనానికి కృషి చేసిన రాజారాంమోహన్‌రాయ్ ఇంకొంత మంది మహనీయుల కోవకు చెందినవారు జ్యోతిరావు గోవిందరావు పూలే. భారతీయ సమాజంలో కూరుకుపోయిన నిచ్చెనమెట్ల వ్యవస్థను రూపుమాపడానికి కృషి చేశారు. కులం గురించి స్పష్టమైన సిద్ధాంతాన్ని శాస్త్రీయంగా రూపొందించిన తొలిదర్శనికుడు పూలే. కులం అనే ముసుగులో మనిషిని మనిషిగా చూడని దుర్మార్గపు కుల వ్యవస్థ కుళ్లును కూకటి వేళ్లతో సహ పెకిలించి, సమూలంగా నిర్మూలించాలని కోరుకున్నారు పూలే. పూలే 1827 సం॥లో పూనాలోని ఖంబుర్థాలో జన్మించారు. పూలే శూద్రుల, అతి శూద్రుల ప్రవక్త, మహర్షి, మహాత్యాగి, మానవతావాది, అనాసక్త కర్మయోగి, క్రాంతి దర్శకుడు, దిశానిర్దేశకుడుగా మార్గదర్శకుడుగా దారిచూపి నిద్రాణమైన సమాజాన్ని చైతన్య పరిచి మేలుకొలిపిన వైతాళికులు.

**పూలే మహోన్నత వ్యక్తిత్వం**

జాతిపిత మహాత్మగాంధి పూలేగారిని 'మహాత్మ' అని కొనియాడారంటే ఎంతటి ఉన్నత వ్యక్తిత్వమై, ఎంతటి సమున్నత ఆలోచనా విధానమై ఉండాలి? దళిత అట్టడుగు బడుగు బలహీన వర్గాల నాయకుడుగా, ప్రపంచ మేధావిగా ప్రసిద్ధినొంది, సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాటం సలిపిన మహాయోధుడు. భారత రాజ్యాంగ నిర్మాత డా॥ బి.ఆర్. అంబేద్కర్ తన ముగ్గురు గురువులలో మహాత్మపూలే ఒకరిని ప్రశంసించు కున్నారు. (మిగతా ఇద్దరు గౌతమబుద్దుడు, కబీర్)

**పూలే రచనలు**

సమాజహితంకై కలం ఝులిపించి, మోసాల్ని ఎండగట్టడానికి కులం, మతం మునుగులో మనుషుల్ని గౌరవించని సంప్రదాయాలని తెగనరకాలని ఆరాటపడిన తపస్వి. పూలే రచనల్లో 'గులాంగిరీ' పేరెన్నక గన్నది. మహారాష్ట్రలోని సామాన్య జనం మాట్లాడుకునే నానుమరాఠీ భాషలో రచించారు. ఇది ఆనాటి మత, సాంఘిక, ఆర్థిక రాజకీయ పరిస్థితులను ప్రతిబింబించే విధంగా ఉన్నది.

**తెలుగు అనువాదం**

'గులాంగిరీ' మరాఠి మూలాన్ని ఆంగ్ల మాతృకల్ని రెండింటిని కలిపి తెలుగు అనువాదం జరిగినది. తెలుగించిన ఏలూరి రామయ్య రిటైర్డ్ డిప్యూటి కలెక్టర్ గారికి తెలుగు సాహిత్యం ఋణపడి ఉందని చెప్పడంలో ఎంతమాత్రం సందేహం లేదు.

పూలే తన పీఠిక ప్రసిద్ధ గ్రీకు రచయిత హోమర్ మాటలతో ప్రారంభించాడు. "ఏరోజునైతే మనిషి బానిసగా మారిపోతాడో, ఆ రోజునే అతడి సద్గుణాల్లో సగభాగం నశిస్తుంది" అని అంటాడు. ఒక మనిషి బానిసగా మార్చబడుతున్నాడంటే అతను పశువుతో సమానంగా చెప్పుకోవచ్చు.

**తెలుగు అనువాదం**

గులాంగిరీ' మరాఠి మూలాన్ని ఆంగ్ల మాతృకల్ని రెండింటిని కలిపి తెలుగు అనువాదం జరిగినది.

బ్రిటిషువారు పరిపాలించే పద్ధతి శీలసంపదను పెంపుచేయడానికి గాదు. ప్రస్తుత విద్యారంగం పూర్తిగా బ్రాహ్మణుల్తో నింపివేసే విధానానికి విస్తరణే. భారతదేశ ప్రగతినీ, అభివృద్ధినీ ఇతర కారణాలకంటే ఈ విధానమే చాలామందగింపజేసింది అని కర్నల్ జి.జె.హేలి "భారతదేశంలో మత్స్యపరిశ్రమ"లో అన్నారు. బ్రిటిషువాళ్ళు కూడా భారతీయ సమాజాన్ని ఇంకా అతలాకుతలం చేశారు. "బ్రాహ్మణులు ప్రపంచానికి ఉపకారులని అంగీకరించడానికి ఎంతటి ఉదారబుద్ధిగల వాడైనా జంకుతాడు. ప్రాచీన విజ్ఞానం అంతా మా సొత్తు అని మహా సంపదలని దోచుకున్నారు. ప్రపంచానికి తెలిసి అతి అసహ్యమైన ఒక కుల వ్యవస్థనీ, శాశ్వతంగా నిలబెట్టి కొనసాగిస్తున్నారు. వాళ్ళ దుర్వినియోగం చేస్తూన్న ఈ అధికారాన్ని తగ్గిస్తే తప్ప, జాతీయ పునరుజ్జీవన కార్యక్రమం అనే మహాకార్యక్రమం మనం సాధించలేం" అని మీడో గారి సిపాయి తిరుగుబాటులో అన్నారు. పై మాటల్ని మనం పరిగణలోకి తీసుకుంటే నేతిబీరకాయలో నేతి శాతమెంతనో బ్రాహ్మణీయ వ్యవస్థలో రూపొందించిన ఆచార వ్యవహారాలు సాటి మనిషిని మనిషిగా చూడడమూ అంతే.

**చాతుర్వర్ణ వ్యవస్థ**

రుగ్వేదంలోనిపదవ మండలం లోని పురుషసూక్తంలో చాతుర్వర్ణ వ్యవస్థ గురించి పేర్కొనబడింది. వేదవాక్కు (దేవుని వాక్కు) ప్రకారం బ్రాహ్మనోట్లోంచి బ్రాహ్మణులు, భుజముల నుండి క్షత్రియులు, తొడల నుండి వైశ్యులు, పాదాల నుండి శూద్రులు జన్మించారని చెబుతుంది. హిందూ సమాజంలో అసమాన బీజాలు దేవుడే నాటాడని చెప్పవచ్చు. అందరిని పుట్టించిన దేవునికే ఇంత పక్షపాతం ఉంటే దేవుడు ఎట్లైతడు? ఈ విధానం కేవలం హిందూ మతంలోనే ఉంది. అదే క్రైస్తవ మతంలోగాని, ఇస్లాం మతంలో కాని,

టావొయిజం, కన్‌ఫ్యూషియన్... మత గ్రంథాలలో ఎక్కడా లేదు. బ్రహ్మదు దేవుడుతో సమానంగా చెలామణియై శూద్రులు అతి శూద్రులని బానిసలుగా ఖర్మ సిద్ధాంతం పేరుతో మార్చుకున్నాడు. హిందుమతం తుచ్ఛమైన కల్పితమైన కట్టుకథల్ని తులనాడుతూ, వాస్తవాన్ని చెప్పిందే మహాత్మజ్యోతిరావు గొవిందరావు పూలేగారి, 'గులాంగిరీ'.

బ్రాహ్మణులు భారతదేశం వారేనా? అంటే అసలు కాదనే నిరూపణలు చరిత్రకారులు చేశారు. ఇరాన్ నుండి వలస వచ్చిన వారేననవి రూఢి అయింది. ఆర్యులు ఈ దేశ మూలవాసులతో యుద్ధం చేసారు. ఆదిమవాసుల్ని రాక్షసుని పిలిచారు.వాళ్లు తమ తమభూమిని కాపాడుకోనేవాళ్ల రాక్షసులనడం సరియైనదే. ఈ యుద్ధాల గురించి అనేకమైన కట్టుకథలు కల్పితాలు బ్రహ్మల పవిత్ర గ్రంథాలలో ఎక్కడపడితే అక్కడ రాయబడి ఉన్నాయి.

**బ్రాహ్మణులు, శూద్రులు - శిక్షలు**

బ్రహ్మలు గెలిచాక ఓడిపోయిన ఆదిమవాసుల జ్ఞానం అనే వెలుతురు లేకుండా నిత్యాంధకారంలో ఉంచడం కోసం ఆర్యులు చాలా కష్టపడి గ్రంథాలు రాసి అవన్నీ దేవుడి ముఖంలోంచి ఊడిపడ్డాయని అజ్ఞానుల్ని ఒప్పించారు. శూద్రుని చంపిన బ్రాహ్మణునికి విధించబడే శిక్ష చాంద్రాయణ ప్రాయశ్చితం. ఇది కుక్కను, పిల్లిని, బల్లిని గుడ్లగూబని చంపినందుకు విధించే శిక్ష బ్రాహ్మణుల దృష్టిలో శూద్రుల జీవితం విలువలేనట్టిది. శూద్రుడు గనుక బ్రాహ్మణున్ని చంపితే అది అతి పాపిష్టినేరం మరణమే వాడికి తగిన శిక్షగా నిర్ణయించారు. శూద్రుడు ధనం సంపాదించ కూడదు. ధన గర్వంతో శూద్రుడు బ్రాహ్మణునికి బాధ కల్గిస్తాడు. ఇందు గురించే హిరణ్య కశిపుని సామ్రాజ్య వినాశనానికి, అతని చావుకు పురికొల్పడానికి అతని కొడుకు అగు ప్రహ్లాదున్ని పసి మనసు దొచుకొని స్తంభం మాటునుండి ఉక్కుగోర్లతో చంపినప్పటికి ఆ రాజ్యం బ్రాహ్మణుల వశం కాలేకపోయింది. 'నరసింహుడు, హిరణ్య కశిపుడు, ప్రహ్లాదుడు' అనే అయిదవ భాగం వివరణతో పూలే వివరించారు. ఓర్వలేని గుణంతో బలిచక్రవర్తిని పొట్టివామనుడు మూడడుగుల జాగను అడుక్కొని దాతను పాతాళలోకం తొక్కాడు.

మనుషుల పుట్టుక బ్రహ్మ అవయవాల నుండి అనునది వచ్చి బూటకమని దేవుడన్నవాడు ఒకర్ని ఒకరకంగా మరొకరి మరో రకంగా ఎలా పుట్టించగలడూ అంటూ పూలే ధోండిబాతో చర్చిస్తాడు. బ్రహ్మల నాయకుడగు పరుశు రాముడు క్షత్రియులను ఓడించి బ్రతికి ఉన్న పసిపిల్లలను సైతం చంపిన కరుడు గట్టిన నేరస్థుడు. వాడు మత గ్రంథాలలో పూజించ బడుతాడు. శూద్రులు చదువుకొనుటకు ప్రయత్నం చేస్తే వారిని సీసం పోసి శిక్షించాలి.

**అనేక దురాచారాలకు ఆద్యులు :**

బలిచక్రవర్తి వామనునితో పోరాడుతుంటే అతని భార్య వింధ్యావతీ దేవి తన పరిచారకులని పిలిపించి గొయ్యి తవ్వించి పంట చెఱకువేయించి ఎనిమిది రోజులు అన్నపానాలు ముట్టకుండా భక్తితో శివున్ని కొలిచింది. ఆఖరికి రాజు మరణవార్త వినగానే ఆ గొయ్యిలో మంట పెట్టమని చెలికత్తెలకు ఆజ్ఞాపించి అందులో దూకి ఆత్మాహుతి చేసుకుంది. అపుడు ఆదేశ ప్రజలు రొమ్ము చరచుకొని అంగలార్చారు. అట్లా సతీ సహగమనమనే దురాచారానికి కారుకులయిన వారు, బ్రాహ్మణులేనని పూలే వివరించాడు.

బతికినన్నాళ్లు ఎవనికి గులాంగిరి చేయ నవసరం లేదని పేర్కొంటూనే హిందూ మతంలో శూద్రులకు విద్య నేర్పడం కోసం తన భార్యయగు సావిత్రిబాయి పూలే గారికి చదువునేర్పి, రాయటం నేర్పి పంతులమ్మలను చేసి విద్య నేర్పిన తొలి గురువుగా నియమించి చదువుకోసం పాటుపడ్డాడు. అయినప్పటికీ భారతదేశ చరిత్రలో సావిత్రిబాయి పూలే గురించి ఎక్కడలేదు.

'గులాంగిరీ' ద్వారా శూద్రుల అతి శూద్రుల జీవన విధానం గత 3వేల సంవత్సరాలు బ్రాహ్మణుల దోపిడికి గురియైనది వివరించాడు. కల్లబొల్లి, కట్టుకథలను ఎండగడుతూ అన్ని కులాలకు బ్రిటిషు అధికారులు విద్యనందించాలని అన్నాడు. జనాభా ప్రాతిపదికన పరిపాలన (రిజర్వేషన్) అధికారాలు ఉండాలని పేర్కొన్నారు. సమ సమాజ లక్ష్యాల కోసం తన జీవితాన్ని సామాజిక మార్పు అంకితం చేసాడు గనుకనే నేడు భారతీయ సమాజం ఈ స్థితిలో ఉంది లేకుంటే ఇంకా అధోగతిలోనే ఉండేదనడంలో సందేహం లేదు. పూలే చూపిన బాట నేటి యువతికి ఎంతో స్ఫూర్తి దాయకం, పూలేబాటలో సామాజిక మార్పుకోసం అందరు కృషి చేసినపుడు ఆయన కలలు గన్న సమాజం సాక్షాత్కరిస్తుంది. సామాజిక న్యాయం సిద్ధిస్తుంది. అందుకోసం చిత్తశుద్ధితో ముందుకు సాగవలసిన అవసరం నేటి యువతకు ఎంతైనా ఉంది.

❋

---

# అఖండ భారతం



**డా॥ ఎన్. గోపి**

ఒక చిన్న ఇంట్లో
ఆమె రొట్టె కాలుస్తుంది
అందరూ చుట్టూ కూర్చున్నారు
బయట
కేకలు వినపడుతున్నాయి
కింద పొయ్యి మండుతుంది
బయట విద్వేష జ్వాలలు!
ఆ గొడవలేవీ అమ్మకు అర్థం కావు
ఇంత విశాల అఖండ భారతంలో

వ్యాపారాలూ
రాజకీయాలూ వుంటాయని తెలియదు
అవును కదూ
సెంటిమెంటు కూడా వుంటుంది
మరి మధ్యలో ఈ ముష్కరుడెవడు?
హిమాలయమా?

నీ మంచు ఏడుపు నువ్వేదువు
పేర్లు పెట్టుకున్న సముద్రాల్లారా!
మూల్గుతూ ఘోషించండి
నదులారా!
ప్రవహించండి పేదల కళ్ళలోకి
పొట్ట చేత పట్టుకున్న వాన్ని
ఈ గ్రహం నుంచే తరిమెయ్యండి
సారే జహాసె అచ్ఛా
హిందూ సితా హమారా

**(ఇటీవల ముంబయి అల్లర్లకు కినిసి)**

# జీవన్ 'చేదు ఫలం' పుస్తకావిష్కరణ

జీవన్ కథల సంపుటి 'చేదుఫలం' పుస్తకావిష్కరణ సభ మే 11వ తేదీ హైదరాబాద్‌లో సుందరయ్య విజ్ఞాన కేంద్రం, హైదరాబాదులో జరిగింది. ప్రముఖ కథా రచయిత కాలువ మల్లయ్య అధ్యక్షతన జరిగిన సభలో మరో ప్రఖ్యాత కథా రచయిత్రి శ్రీమతి ముదిగంటి సుజాతా రెడ్డి పుస్తకావిష్కరణ చేశారు. ప్రముఖ పరిశోధకులు, విమర్శకులు, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌కు చెందిన ప్రొ॥ తుమ్మల రామకృష్ణ పుస్తక పరిచయం చేస్తూ సాహిత్యం ముఖ్యంగా కథా సాహిత్య మంటే జీవిత వ్యాఖ్యానమేనన్నారు. ప్రతి సమాజంలోనూ పాలకుల భావజాలం పాలితుల భావజాలాన్ని నొక్కి పెడుతుందన్నారు. కావ్యాలు, ప్రబంధాల అనంతరం వచన సాహిత్యం ప్రవేశించిందనీ, దీనికి మిగతా సాహిత్య ప్రక్రియలకన్నా ప్రయోజనమెక్కువ అని అన్నారు. సంపుటిలోని నీట మునిగిన బతుకు బతుకమ్మ, చేదుఫలం, ఇంకెంత దూరం, ప్లాట్ ఫాం బతుకులు లాంటి కథలను విశ్లేషిస్తూ గ్లోబలీకరణ యుగంలో ఛిద్రమవుతున్న మానవీయ విలువలను జీవన్ బలంగా వ్యక్తీకరించాడని అన్నారు.



'చేదుఫలం' ఆవిష్కరిస్తున్న శ్రీమతి ముదిగంటి సుజాతారెడ్డి (ఎడమ నుండి) శ్రీపతి, నిఖిలేశ్వర్, శీలావీర్రాజు, జీవన్, కాలువ మల్లయ్య, సుజాతారెడ్డి, రావూరి భరద్వాజ, ప్రొ॥ తుమ్మల రామకృష్ణ

శ్రీమతి ముదిగంటి సుజాతారెడ్డి ప్రసంగిస్తూ అట్టడుగు జీవితాల్లోని వ్యధలను ఈ కథలు తేట తెల్లనైన తెలంగాణ మాండలికంతో ప్రతిభావంతంగా రచయిత చిత్రించాడన్నారు. ఇంకా ఈ సభలో నిఖిలేజ్వర్, శీలా వీర్రాజు, రావూరి భరద్వాజ్, శ్రీపతి, కాకరాల, నిర్మలానంద, జుగాష్ విలీ తదితర రచయితలు పాల్గొని ప్రసంగించారు. గుర్రం సీతారాములు వందన సమర్పణతో సభ ముగిసింది.

# సోమిరెడ్డి జమున స్మారక అవార్డు ప్రధానోత్సవం

డా॥ పెళ్ళకూరు జయప్రద సోమిరెడ్డి ఆధ్వర్యాన నెల్లూరు ఐ.ఎం.హాల్‌లో మే 11న సోమిరెడ్డి జమున స్మారక అవార్డు ప్రధానోత్సవంలో ఉదయం సభలో "పచ్చని వెన్నెల" నానీల సంకలనం అవార్డు గ్రహీత సోమేపల్లి వెంకట సుబ్బయ్యకు సన్మానం జరిగింది. అదే సభలో డా॥ జయప్రద" ఆలకించే అక్షరం " నానీల సంకలనం



నెల్లూరు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో మే 11న సోమిరెడ్డి జమున స్మారక సాహిత్య అవార్డును అందుకుంటున్న ప్రముఖ కవి సోమేపల్లి వెంకట సుబ్బయ్య. చిత్రంలో అవార్డు ప్రధాత డా॥ పెళ్ళకూరు జయప్రద సోమిరెడ్డి, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహనరెడ్డి, ప్రముఖ కవి రామచంద్రమౌళి, పెరుగు రామకృష్ణ, పాతూరు అన్నపూర్ణ ప్రభృతులు

నెల్లూరు జిల్లా తెలుగు దేశం అధ్యక్షులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆవిష్కరించారు.

మధ్యాహ్నం సభలో డా॥ పెళ్ళకూరు జయప్రద "ప్రవహించే కాలం" కవితా సంకలనం సోమిరెడ్డి వెంకట శేషారెడ్డిచే ఆవిష్కరించారు. కోపూరి పుష్పాదేవి నానీల "పత్ర సమర్పణ, కొండ్రెడ్డి వెంకటేశ్వర రెడ్డిచే నవలా సాహిత్యం పత్ర సమర్పణ చేశారు. సాయంకాలం సభలో పద్య కవి ఊరి బిండి సుబ్రహ్మణ్య శాస్త్రికి డా॥ పెళ్ళకూరు జయప్రద, శ్రీ సోమిరెడ్డి వెంకటశేషారెడ్డి గార్లచే ఘనపురస్కారం. తదుపరి అదే సభలో "నానీల" కవి సమ్మేళనం జరిగింది.



మే 4వ తేదీన మచిలీపట్నంలో ఆంధ్ర సారస్వత సమితి నుండి "వచనకవిత" ప్రక్రియలో ఉగాది ప్రతిభాపురస్కారం అందుకొంటున్న కవి శ్రీ ఎస్. ఆర్ పృథ్వి, ప్రక్కన సంస్థ అధ్యక్షులు డా॥ బోయిన వెంకటేశ్వరరావు, ఐ.ఎ.ఎస్



## డా॥ వి.ఆర్. రాసానికి మహాకవి శ్రీశ్రీ సాహిత్య పురస్కారం

విజయవాడలోని 'శ్రీశ్రీ సాహిత్య నిధి' అనే సంస్థ కథా సాహిత్యంలో విశేష కృషి చేసినందుకు, 'పయనం' కథల సంపుటికి ప్రముఖ కథా, నవల, నాటక రచయిత డా॥ వి.ఆర్. రాసానికి మహాకవి 'శ్రీశ్రీ సాహిత్య' పురస్కారాన్ని ప్రకటించారు. రాసాని రాసిన విశిష్ట కథల సంపుటి 'పయనం' కథల సంపుటికి, ఈ పురస్కారాన్ని ఏప్రిల్ 30 తారీఖున విజయవాడలోని టాగూర్ లైబ్రరీ హాలులో జరిగిన ఒక సాహిత్య సభలో అందజేశారు. ఈ సభకు ప్రజాసాహితీ ఎడిటర్ కొత్తపల్లి రవిబాబు అధ్యక్షత వహించగా దివికుమార్ ముఖ్య వక్తగా పాల్గొన్నారు. రాసాని ఇది వరకు వందకు పైగా కథలు, ఆరు నవలలు, రెండు పరిశోధన గ్రంథాలు, 6 నాటకాలు, రెండు కథల సంపుటాలు వెలువరించారు. 80 దాకా గేయాలు, కవితలు, 400 వ్యాసాలు వివిధ పత్రికల్లో ముద్రింపబడ్డాయి. ఇది వరకు వీరి నవల 'చీకటి రాజ్యం'కు రెడ్డమ్మ సాహితీ పురస్కారం, 'మెరవణి' కథల సంపుటికి విమలా శాంతి పురస్కారం, 'బతుకాట' నవలకు తానా బహుమతి లభించాయి. వివిధ పత్రికలు నిర్వహించిన నవల, కథల పోటీల్లో బహుమతులు వచ్చాయి. వీరి నవలలు, కథలు హిందీ, ఆంగ్లం, కన్నడ, తమిళ భాషల్లోకి అనువాదం చేయబడ్డాయి. వీరి రచనలపైన ఇది వరకు మూడు పరిశోధనా గ్రంథాలు వచ్చాయి. ప్రతి సంవత్సరం వెలువడే 'కథా వార్షిక' లకు సంపాదకుడిగా కూడా రాసాని వ్యవహరిస్తున్నారు.

రాసానికి నవలా సాహిత్యంలో విశేష కృషి చేసినందుకు ఇటీవలే తెలుగు విశ్వ విద్యాలయం ధర్మనిధి పురస్కారాన్ని అందించడం, రాష్ట్ర అధికార భాషా సంఘం - అధికార భాషా పురస్కారాన్ని అందించారు.

రాసాని చిత్తూరు జిల్లా స్థాయి అధికార భాషా సంఘ సభ్యుడిగా కూడా వున్నారు.

## పెనుమాక నాగేశ్వరరావు "ఫారిన్‌సెంటు" కథల ఆవిష్కరణ



**గుంటూరు, జిల్లా గ్రంథాలయ సంస్థలో ఏప్రిల్, 19వ తేదీన జరిగిన పెనుమాక నాగేశ్వరరావు కథా సంపుటి ఆవిష్కరణ సభలో (ఎడమ నుండి) బి.వి.ఎస్.ఆర్ ఆంజనేయులు, ఎ.జి.ఎమ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గుంటూరు, వల్లూరు శివప్రసాద్, పెనుగొండ లక్ష్మీనారాయణ, పెనుమాక నాగేశ్వరరావు, గోటేటీ లలితాశేఖర్**

కథా రచయిత పెనుమాక నాగేశ్వరరావు రాసిన 'ఫారిన్ సెంటు' సంపుటిలో కథలు మానవ జీవితాన్ని ప్రతిబింబిస్తాయని కథా రచయిత్రి గోటేటి లలితా శేఖర్ అన్నారు. అరసం, విశాలాంధ్ర బుక్ హౌస్‌ల సౌజన్యంతో సాహితీ మిత్రుల ఆధ్వర్యంలో ఇటీవల గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థలో విశాలాంధ్ర ప్రచురణాలయం ప్రచురించిన ఫారిన్ సెంటు కథా సంపుటి ఆవిష్కరణ సభ జరిగింది. సభకు అరసం జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి, కథా రచయిత వల్లూరు శివప్రసాద్ అధ్యక్షత వహించారు.

లలితా శేఖర్ పుస్తక సమీక్ష చేస్తూ మధ్య తరగతి మనస్తత్వాన్ని సునిశితమైన హాస్య, వ్యంగ ధోరణిలో పెనుమాక తన కథల్లో వివరించారన్నారు జీవన సమరంలో పాఠకుడిని విజేతగా నిలపటానికి ఈ కథలు దోహద పడతాయని సహజత్వం నిండిన సానుకూల దృక్పథంతో కూడిన పెనుమాక కథలు విశిష్టమైనవని ఆమె అన్నారు.

అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ ఈ కథా సంపుటిని ఆవిష్కరించారు. పెనుమాక అతి సాధారణమైన విషయాల్ని కూడా అలవోకగా కథగా మలచిన శక్తివంతమైన రచయిత అని పెనుగొండ అన్నారు.

శైలిలో సరళత, కథనంలో క్లుప్తత, విషయంలో స్పష్టత పెనుమాక కథలలో వున్నాయని సభాధ్యక్షత వహించిన వల్లూరు శివప్రసాద్ అన్నారు. పెనుమాక కథలు ఆనందంతోపాటు అవగాహనను కలిపిస్తాయని, ఆలోచనలు రేకెత్తిస్తాయని శివప్రసాద్ పేర్కొన్నారు. ఏ మాత్రం సంక్లిష్టత లేకుండా సహజ ధోరణిలో కథలు రాయటం పెనుమాక ప్రత్యేకతగా శివప్రసాద్ పేర్కొన్నారు.

బ్యాంక్ ఆఫ్ ఇండియా అసిస్టెంట్ జనరల్ మేనేజర్ జి. ఎ.యస్.ఆర్. ఆంజనేయులు ప్రసంగిస్తూ ఉద్యోగ బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తూ కథకుడిగా పెనుమాక రాణిస్తుండటం తమ సంస్థకు గర్వకారణమన్నారు. పాఠకుడిగా మంచితనాన్ని పెంచే కథలు రాస్తున్న పెనుమాకను అభినందించారు. రచయిత పెనుమాక నాగేశ్వరరావు ఉచిత రీతిన స్పందించారు. తొలుత విశాలాంధ్ర బుక్ హౌస్ మేనేజర్ ఎ.ఎం.ఆర్. ఆనంద్ వందన సమర్పణ చేశారు.

## సిహెచ్. ఉషారాణి

## 'దిగులు చూపుల శివార్లలో...' ఆవిష్కరణ సభ

1980లలో ప్రచురితమైన స్త్రీవాదంలో అస్తిత్వ సంబంధమైన సిద్ధాంతాలు ప్రాముఖ్యం వహిస్తే, సామాజిక పరిణామ నేపథ్యంలో ఈనాడు కుటుంబ జీవిత కఠోర వాస్తవాలకు ప్రాధాన్యం వచ్చింది. ఈ ధోరణిలో సి.హెచ్. ఉషారాణి రాసిన వచనకవితా సంపుటి "దిగులు చూపుల శివార్లలో..." ప్రథమ స్థాయిలో నిలుస్తుందని, భావచిత్ర ప్రతీకాదుల్లో కవయిత్రి కొత్తదనం చూపారని ఆవిష్కరణ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ విమర్శకుడు డా॥ అద్దేపల్లి రామమోహన్‌రావు పేర్కొన్నారు. ఏప్రిల్ 28న కాకినాడ రోటరీక్లబ్ ఆడిటోరియంలో హైదరాబాదు చందానగర్‌కు చెందిన ఉషారాణి కవితాసంపుటి ఆవిష్కరణ జరిగింది. అధ్యక్షత వహించి, సంపుటిని ఆవిష్కరించిన రచయిత్రి డా॥పి. చిరంజీవినీ కుమారి ప్రసంగిస్తూ 'పైట తగలెయ్యడం' అనే ప్రక్రియ ఈనాటి గ్లోబలైజేషన్ నేపథ్యంలో స్త్రీలకు సామాన్య విషయమేనని, కాని, 'పైట బిగించి' భ్రష్ట సంస్కృతిని వ్యతిరేకించాలని అన్నారు. వక్తగా పాల్గొన్న ప్రముఖకవి, విమర్శకుడు మాకినీడి సూర్యభాస్కర్ మాట్లాడుతూ వస్తువునీ, శిల్పాన్నీ సమన్వయపరచిన అభివ్యక్తితో స్త్రీ జీవితంలోని వేదనల్ని ఆరోగ్యకరమైన అవగాహనతో ఉషారాణి చెప్పారన్నారు. మరో వక్త ప్రముఖ కవి, సమీక్షకులు జి. సుబ్బారావు ఉషారాణి కవిత్వం అడుగడుగునా సాంద్రంగా ఉందనీ, స్త్రీ వాదాన్ని సరైనా దృక్పథంతో అవగాహన చేసుకున్నారనీ చెప్పారు. మరో కవయిత్రి శ్రీమతి పద్మజావాణి మాట్లాడుతూ, ఉషారాణి కవిత్వం స్త్రీలోకానికి గొప్ప ఊరట అన్నారు. ఉషారాణి సముచిత రీతిలో స్పందించారు. డా॥ అద్దేపల్లి ఘనంగా సత్కరించారు. చెరుకువాడ సత్యనారాయణ వందన సమర్పణతో సభ ముగిసింది.



'దిగులు చూపుల శివార్లలో' ఆవిష్కరణ సభలో అద్దేపల్లిని సత్కరిస్తున్న జి. సుబ్బారావు, ఉషారాణి, చిరంజీవినీకుమారి, మాకినీడి సుధాభాస్కర్

## 'ధనంబోడు భౌద్ధస్తూపం' పుస్తకావిష్కరణ

రసమయి సాహితీ సమితి ఆధ్వర్యంలో మే 19 బుద్ధపూర్ణిమ రోజున "జగ్గయ్యపేట ధనంబోడు బౌద్ధస్తూపం – కృష్ణాతీరంలో బౌద్ధ పరిణామాలు" అనే పుస్తకం ఆవిష్కరణ జరిగింది. అజ్మీరు వీరభద్రయ్య రచించిన ఈ పుస్తకాన్ని స్థానిక శాసన సభ్యులు సామినేని ఉదయభాను ఆవిష్కరించారు. ఈ సమావేశానికి కృష్ణాజిల్లా జిల్లా రచయితల సంఘం కార్యదర్శి జి.వి. పూర్ణచంద్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిరాలుగా నడుస్తున్న చరిత్ర సంపాదకులు సామల రమేష్‌బాబు, వేమన ఫౌండేషన్ కార్యదర్శి కె. జితేంద్రబాబులు సందేశం యిచ్చారు. అనంతరం 15 మంది కవులచే కవి సమ్మేళనం జరిగింది.



గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి మహిళా శతాధిక కవి సమ్మేళనంలో కవి కె.జె. రమేష్ రచించిన 'భ్రమల్ని మోసుకుంటూ...' కవితా సంపుటిని ఆవిష్కరించిన ప్రముఖ కవి డాక్టర్ ఎన్. గోపి. చిత్రంలో డా॥ పాపినేని శివశంకర్, సోమేపల్లి వెంకటసుబ్బయ్య, పెనుగొండ లక్ష్మీనారాయణ తదితరులు



మే 1న , మహారాష్ట్ర అవతరణ దినోత్సవ సందర్భంగా ముంబాయి తెలుగు కవి సంగివేని రవీంద్రను మహాకవి కాళిదాసు పురస్కారంతో సన్మానిస్తున్న మహారాష్ట్ర ముఖ్యమంత్రి విలాస్‌రావు దేశ్‌ముఖ్, ప్రక్కన ఖేత్‌వాడి ఎమ్మెల్యే భాయి జగ్‌తాప్, దాదర్ ఎమ్మెల్యే జగన్నాథ్‌శెట్టి. ఈ పురస్కారం అందుకున్న మొదటి తెలుగు వ్యక్తి రవీంద్ర కావడం గమనార్హం

## డైరీ

# 'ఘర్షణ' ఆవిష్కరణ సభ'

మే 4న మధిర పట్టణంలోని తేళ్ళ వసంతయ్య ఉన్నత పాఠశాలలో 'ఘర్షణ' పుస్తకావిష్కరణ జరిగింది. కవులు, రచయితలు, ఉపాధ్యాయులు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు. ఈ సభకు ముఖ్య అతిథిగా డా॥ వై రాధాకృష్ణమూర్తి (మాజీ రాజ్యసభ సభ్యులు) పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు. సాహిత్యం – సమాజం మధ్య వున్న సంబంధాన్ని, "ఘర్షణ" కవితాసంపుటిలోని సామాజిక చైతన్యాన్ని వివరించారు. ఈ సభకు జిల్లా సాహితీస్రవంతి అధ్యక్షులు కె. ఆనందాచారి అధ్యక్షత వహించారు, జిల్లా కార్యదర్శి రౌతురవి పుస్తకాన్ని పరిచయం చేసారు. ఈ సభలో "ఘర్షణ" రచయిత శ్రీ కర్నాటి సత్యశ్రీగారు రామిశెట్టి రోశయ్యగారు, కర్నాటి రామ్మోహన్‌రావుగారు, తడికముళ్ళ వెంకటేశ్వర్లుగారు, లెనిన్ శ్రీనివాస్, ఎల్.ఎన్. మూర్తి, పోతగాని సత్యనారాయణ ఆంజనేయులు, పాపాచారి, విజయలక్ష్మి నాగాటిప్రసాద్, కళాకారుడు కొండయ్య తదితరులు పాల్గొన్నారు.



మే 4వ తేదీన మధిర "ఘర్షణ" ఆవిష్కరణ సభలో రౌతు రవి, కె.ఆనందాచారి, కె. సత్యశ్రీ, డా॥ వై.ఆర్.కె., కర్నాటి రామ్మోహన్‌రావు

# ఖమ్మంలో అంతర్జాతీయ పుస్తక దినోత్సవం

అంతర్జాతీయ పుస్తక దినోత్సవం సందర్భంగా, ఖమ్మం సాహితీస్రవంతి ఆధ్వర్యంలో ఏప్రిల్ 23న మాంటిసోరి పాఠశాల విద్యార్థులు, సాహితీస్రవంతిని జిల్లా బాధ్యులు, కవులు, రచయితలు, జిల్లా కేంద్ర గ్రంథాలయ ఉద్యోగులు ఖమ్మం పట్టణంలో "ర్యాలీ" నిర్వహించారు. "పుస్తకాలు మంచినేస్తాలు" – "చినిగిన చొక్కా తొడుక్కో.." "ఒక మంచి పుస్తకం కొనుక్కో'.. "పుస్తకాలు ప్రగతికి సోపానాలు" ..."మంచి పుస్తకాలు మంచి సమాజాన్ని నిర్మిస్తాయి". అంటూ నినదించారు. గ్రంథాలయంలో జరిగిన సభలో... గ్రంథాలయ కార్యదర్శి శంకర్‌రెడ్డి, సాహితీ స్రవంతి జిల్లా కార్యదర్శి రౌతురవి, లెనిన్ శ్రీనివాస్, జీవన్, కె.ఎల్. ఎన్ మూర్తి, మాంటిస్సోరి పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొని పుస్తకాల ప్రత్యేకతను వివరించారు. పిల్లలకు మిఠాయిలు పంచినారు. శ్రీనివాస్ వీరందరికి సాహితీ స్రవంతి తరపున కృతజ్ఞతలు తెలిపారు.




అంతర్జాతీయ పుస్తక దినోత్సవ ర్యాలీలో శంకర్‌రెడ్డి, రౌతు రవి, లెనిన్ శ్రీనివాస్, జీవన్, కె.ఎల్.ఎన్. మూర్తి మరియు మాంటిస్సోరి విద్యార్థులు

# 'కవనవేదిక' మహాకవి బండ్ల సుబ్రహ్మణ్యం స్మారక వచనకవితల పోటీ ఫలితాలు

ప్రథమ బహుమతి : నిశ్శబ్దజలపాతం (తుమ్మల దేవారావు), ద్వితీయ బహుమతి :అమ్మంటే(ఎన్.వి.రఘువీర్ ప్రతాప్), తృతీయ బహుమతి : గజిందగలుమాకొద్దు (అచ్చుల), జీవితం (పి.మణికుమారి)

**ప్రత్యేక ప్రోత్సాహక ప్రశంసా బహుమతులు :**

పచ్చని జ్ఞాపకం (షేక్ రఫీ), దూరమౌతున్న దగ్గరిబంధువులు (గుండానజోగారావు), వేళ్ళూనుకొన్నయాభైయైదు అక్షరాలు (బూర్లవెంకటేశ్వర్లు), మెర్సీకిల్లింగ్ (డా॥ సి.హిమబిందు), సంగీతానికి మాతృవియోగం (సరికొండ రసింహారాజు), అక్షరాయుధం (డి.ప్రభాకర్), తెల్లారనిఊరు (సంగినేని రవీంద్ర), నిరేక్ష (సోమ సురేష్), గోడకుర్చీ (కొసూరి రవికుమార్), అక్షరమంత్రం (ఈతకోట సుబ్బారావు)

**'కవనవేదిక' నిర్వహించిన పద్య కవితల పోటీలో గెలుపొందిన కవితలు**

**ప్రథమ బహుమతి :**

కవితావధూటి తెలుగు తల్లి వైభవం ((శ్రీ వి.వి.యన్.ఆర్. శర్మ), **ద్వితీయ బహుమతి:** భారతీయులభావన (కడెము వెంకట సుబ్బారావు), **తృతీయ బహుమతి :** ఉపాధ్యాయుడు (గన్నోజు శ్రీనివాసాచారి)

**ప్రత్యేక ప్రోత్సహక బహుమతులు : (ఐదుగురికి)**

ప్రబోధం (కలువకోట మురళీధరస్వామి), మాతృనివేదన (డా॥ యన్.వి.యన్.చారి), అమ్మకొంగు (బోదావుల నాగేశ్వరరావు), వృక్షవిలాపం (డా॥ వీరా సూర్యనారాయణ), రైతు బ్రతుకు (వల్లభాపురం జనార్దన)

2008 జూన్ నెలలో హైదరాబాద్‌లో 'కవనవేదిక' సంస్థ నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో విజేతలకు బహుమతి ప్రదానం జరుగుతుంది

– **రఘుశ్రీ,** అధ్యక్షులు, 'కవన వేదిక' హైదరాబాద్.

## కొత్తతరం కవులకు స్ఫూర్తి సుందరరావు కవిత్వం



ప్రకాశం జిల్లా ఇంకొల్లులో ప్రముఖకవి డాక్టర్ బీరం సుందరరావు రచన "భూమి తడవని వర్షం" కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న కేంద్రమంత్రి దగ్గుబాటి పురంధరేశ్వరి. చిత్రంలో పర్చూరు ఎమ్మెల్యే డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావు, జర్నలిస్టు కంచర్ల రామయ్య, కుర్ర హనుమంతరావు, ఘంటా రామకృష్ణయ్య ఉన్నారు.

పతనమవుతున్న నైతిక విలువలు, మానవ సంబంధాల పునరుద్ధరణ అవశ్యకతను వివరిస్తూ సమాజ శ్రేయస్సే లక్ష్యంగా రచనలు చేస్తున్న బీరం సుందరరావు కొత్తతరం కవులకు స్ఫూర్తి దాయకంగా నిలుస్తారని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి సహాయమంత్రి దగ్గుబాటి పురంధరేశ్వరి పేర్కొన్నారు. జాషువా సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో మే 22న ప్రకాశం జిల్లా ఇంకొల్లులోని దగ్గుబాటి విద్యాసంస్థల ఆడిటోరియంలో ప్రముఖ కవి డాక్టర్ బీరం సుందరరావు రచించిన "భూమి తడవని వర్షం" కవితా సంపుటిని పురంధరేశ్వరి ఆవిష్కరించి ప్రసంగించారు. ఈ సందర్భంగా కృతి స్వీకర్తలు దగ్గుబాటి దంపతులను బీరం దంపతులు దుశ్శాలువలతో సత్కరించి, జ్ఞాపికను ప్రదానం చేయగా దగ్గుబాటి దంపతులు సుందరరావును సన్మానించారు. సభలో కళాశాల కరస్పాండెంట్ ఘంటారామకృష్ణయ్య, పి.జి. కళాశాల పరిపాలనాధికారి కుర్రా హనుమంతరావు ప్రముఖ జర్నలిస్టు, ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజి కరస్పాండెంట్ కంచర్లరామయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ దాసయ్య, నాగభూషణం, తాళ్ళూరి ఆంజనేయులు, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

## "మరణం లేని జీవితం" కవితకు 2007 ఎక్స్‌రే అవార్డు

ఎక్స్‌రే 27 సంవత్సరపు జాతీయ స్థాయి అవార్డుల పోటీలో ప్రకాశం జిల్లా చీరాలకు చెందిన పి. శ్రీనివాస్ గౌడ్ రచించిన 'మరణం లేని జీవితం' కవితకు 2007 సంవత్సరపు ఎక్స్‌రే ప్రధాన అవార్డు లభించింది. ఐదువేల నగదు, జ్ఞాపికతో కవిని సత్కరించటం జరుగుతుంది. ఈ సంవత్సరం ఇంకా న్యూఢిల్లీకి చెందిన డా॥ పత్తిపాక మోహన్ 'ఎండమావులు', శిల్పా జగదీష్ (హైదరాబాద్) "నా కొడుకు నాకు కావాలె", కె.యన్. బాలాజీ (పలమనేరు) "స్పర్శ", ఎస్.కె. ఖాజా మొహిద్దీన్ (నెల్లూరు), "పరిగె గింజల పరిగరి", గేరా అనిత (తెనాలి) "మౌనమే", బూర్ల వెంకటేశ్వర్లు (మెట్‌పల్లి) "గ్లోబల్ వల", ఎన్. అరుణ (హైదరాబాద్) "నౌషాద్", డా॥ జెరీనాబేగం (హన్మకొండ) "టీబాయ్ పవన్", పోతగాని సత్యనారాయణ (కరీంనగర్) "ఊరోలస బోయింది", కోసూరి రవికుమార్ (దాచేపల్లి) "మహాయాత్ర" కవితలకు 2007 ఉత్తమ కవితా పురస్కారాలు లభించాయి. పైగంబర కవి ఎమ్.కె. సుగమ్‌బాబు (హైదరాబాద్) న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు., ఏ సంవత్సరం లేనంత స్పందన కవుల నుండి ఈ సంవత్సరం రావటం విశేషం. అవార్డు గ్రహీతల్లో పత్తిపాక మోహన్ (రెండవసారి), కోసూరి రవికుమార్ (ఏడవసారి) గెలుచుకోవడం మరో విశేషం. విదేశాల నుండి కూడా తెలుగు కవులు పాల్గొనటం, కొన్ని హిందీ, ఉర్దూ కవితలు కూడా పోటీకి రావటం ఈ సంవత్సరపు ప్రత్యేకతలు.



2007 ఎక్స్‌రే నిర్వహించిన కవితల పోటీలో రాష్ట్ర పశుగాణాభివృద్ధి, మత్స్య శాఖామాత్యులు మండలి బుద్ధప్రసాద్ నుంచి అవార్డు అందుకుంటున్న కవయిత్రి శ్రీమతి.ఎన్. అరుణ. చిత్రంలో డా॥ఎమ్.కె. సుగమ్‌బాబు, లయన్ దేవినేని కిషోర్‌కుమార్, వి.జి.యస్. పబ్లిషర్స్ అధినేత శిరం రామారావు, శ్రీమతి సువర్చల తదితరులు ఉన్నారు

## కార్మిక దినోత్సవ - కవిసమ్మేళనం

ఖమ్మం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 'మేడే' సందర్భంగా కవి సమ్మేళనం జరిగింది. కవి సమ్మేళనానికి అధ్యక్షులుగా కె. ఆనందాచారి, సమన్వయకర్తగా సాధనాల వేంకటస్వామి నాయుడు వ్యవహరించారు. వేదికపై కె.ఎల్.ఎన్ మూర్తి, రౌతురవి ఆశీనులయ్యారు. సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకిస్తూ, ప్రపంచీకరణ, నేపథ్యంలో కార్మికుల జీవితాలు, ఎలా వున్నాయో తెలిపేలా తిరిగి పనిగంటలకోసం ఉద్యమాలు నడిపే పరిస్థితులు వస్తున్నాయని దీనికి కారణం. ప్రపంచీకరణ, సామ్రాజ్యవాదమేనాని కవులు కవితల ద్వారా వినిపించారు. లెనిన్ శ్రీనివాస్, పోతగాని, శేషగిరి, కపిలరాంకుమార్ శ్రీనివాస్ వై.వి.రమణారావు. లక్ష్మీనారాయణ. బండారు రమేష్ తదితరులు కవితాగానం చేశారు. కార్మికులకు సంఘీభావం తెలిపారు

# స్వీకారం



**నాలో...**
మనాశ్రీ
వెల : రు. 32



**బహుజన హితాయ...**
వల్లూరు శివప్రసాద్
వెల : రు. 35



**మా ఊరు మొలకెత్తింది**
బి. హనుమారెడ్డి
వెల : రు. 40



**ఏరువాక సాగాలి**
వల్లూరు శివప్రసాద్
వెల : రు. 25



**పిల్లల నాటికలు**
వల్లూరు శివప్రసాద్
వెల : రు. 35



**కథ**
జె.ఎస్.ఆర్.కె. శర్మ
వెల : రు. 100



**ధనంబోడు బౌద్ధస్తూపం**
అజ్మీరు వీరభద్రయ్య
వెల : రు. 40



**భూమి తడవని వర్షం**
డాక్టర్ బీరం సుందరరావు
వెల : రు. 50



**సంధ్యారాగం**
డా॥ ముద్దు వెంకటరమణారావు
వెల : రు. 75



**స్వాతంత్రోద్యమ జ్ఞాపకాలు**
ఎం.ఎన్. రంగాచార్యులు
వెల : రు. 80



**మహనీయం**
డా॥ ముద్దు వెంకటరమణారావు
వెల : రు. 60



**ప్రవహించే కాలం**
డా॥ జయప్రద
వెల : రు. 60

Printed, Published and owned by **V. Krishnaiah** 1-1-298/4, Street No-1, Ashoknagar, Hyderabad-20,
Printed at Prajashakti Daily Printing Press, 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad,
Published at **Shaitya Prasthanam** 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad-20. **Editor. T. Ravi**

31.08.1925 - 04.06.1998



సుప్రసిద్ధ అభ్యుదయ కవి, రచయిత, పరిశోధకుడు, విమర్శకుడు త్వమేవాహంతో తెలుగు కవిత్వంలో కొత్త ప్రయోగశైలి ప్రారంభించారు. అనేక కావ్యాలు, పరిశోధనా గ్రంథాలు రాశారు. సమగ్ర ఆంధ్రసాహిత్యం 13 సంపుటాలు ఒక చేతి మీదుగా రచించి తెలుగు సాహిత్యానికి ఎనలేని సేవ చేశారు. జూన్ 04 ఆరుద్ర వర్ధంతి

## ఉపాధ్యాయులు, తల్లితండ్రులు చదువవలసిన పుస్తకాల జాబితా

| క్ర.స | పుస్తకం పేరు | వెల | క్ర.స | పుస్తకం పేరు | వెల |
|---|---|---|---|---|---|
| 1. | పిల్లలు నేర్చుకోవడంలో ఎలా వెనకబడతారు? | 60.00 | 13. | నల్లబల్ల వెనుక | 25.00 |
| 2. | పిల్లలు ఎలా నేర్చుకుంటారు | 60.00 | 14. | చదువు సంధ్యలు | 25.00 |
| 3. | టీచర్ | 40.00 | 15. | మహోజ్వల స్మృతులు | 35.00 |
| 4. | విముక్తి-విద్య | 40.00 | 16. | మనిషి కథ | 40.00 |
| 5. | టీచర్లకు ఉత్తరం | 40.00 | 17. | చార్లీచాప్లిన్ | 25.00 |
| 6. | మాస్టారూ...! | 10.00 | 18. | పరిణామక్రమంలో విద్యా వ్యవస్థ 1833-2003 | 15.00 |
| 7. | మీ ఒడిలో | 10.00 | 19. | వేదభూమి | 10.00 |
| 8. | కథలే పాఠాలు | 25.00 | 20. | సమాజం-సైన్స్- సంప్రదాయం | 15.00 |
| 9. | బోధన-శోధన | 30.00 | 21. | సైన్సు చరిత్రలో సామాజికాంశాలు | 10.00 |
| 10. | విభిన్న విద్యా సంస్థలు | 25.00 | 22. | పిల్లల అలవాట్లు | 25.00 |
| 11. | భాష-భావం | 20.00 | 23. | భారతదేశ చరిత్ర | 25.00 |
| 12. | మీరు - మీ పిల్లలు | 15.00 | 24 | పిల్లల భాష - ఉపాధ్యాయుడు | 25.00 |

## పిల్లలు చదివే పుస్తకాల జాబితా

| క్ర.స | పుస్తకం పేరు | వెల | క్ర.స | పుస్తకం పేరు | వెల | క్ర.స | పుస్తకం పేరు | వెల |
|---|---|---|---|---|---|---|---|---|
| 1. | మహావిశ్వం మన భూమి | 20.00 | 34. | మూడు కథలు | 10.00 | 67. | యముని దర్బారు | 10.00 |
| 2. | ఆదర్శబాల్యం | 25.00 | 35. | నత్తగుల్ల స్వార్థం-బంగారుచేపగర్వం | 15.00 | 68. | బంగారు జింక | 15.00 |
| 3. | విలియం షేక్స్పియర్ | 15.00 | 36. | అద్భుతాలనియం-నీరు | 10.00 | 69. | మూడు ఏనుగులు | 15.00 |
| 4. | హైడీ | 20.00 | 37. | నోయా | 10.00 | 70. | బోబక్ నేర్పిన పాఠం | 15.00 |
| 5. | విశ్వవిఖ్యాత శాస్త్రజ్ఞులు | 15.00 | 38. | బద్దకం వదిలింది | 15.00 | 71. | పులి-తాబేలు | 10.00 |
| 6. | విదేశీ కథలు | 15.00 | 39. | బుడిబుడికథలు | 40.00 | 72. | పింకి-పిల్లి | 10.00 |
| 7. | విజ్ఞాన శిఖరాలు | 15.00 | 40. | పిల్లల ప్రశ్న-సైన్స్ జవాబు | 15.00 | 73. | సైన్యాధిపతి గర్వభంగం | 15.00 |
| 8. | చైనా నీతి కథలు | 15.00 | 41. | మేమొచ్చేశాం | 20.00 | 74. | కుడి-ఎడమ | 10.00 |
| 9. | భారతీయ శాస్త్రవేత్తలు | 15.00 | 42. | నిర్జీవం-జీవపరిణామం | 30.00 | 75. | నాతప్పేమిటో! | 15.00 |
| 10. | అందాల పార్కు | 15.00 | 43. | సరదాసరదా లెక్కలు | 30.00 | 76. | నందువంట-నేస్తంతంటా | 10.00 |
| 11. | పిల్లల గణితం | 15.00 | 44. | విశ్వం-విజ్ఞానం | 25.00 | 77. | వంశీధర్ నిజాయితీ | 10.00 |
| 12. | పిల్లలు-పిడుగులు | 20.00 | 45. | ప్రకృతిలో అద్భుతాలు-విజ్ఞానవిశేషాలు | 45.00 | 78. | జమిందారు వేట | 10.00 |
| 13. | సరదా సరదా చదువులు | 15.00 | 46. | కాలిక్యులేటర్ గేమ్స్ | 20.00 | 79. | అద్దంలో సింహం | 15.00 |
| 14. | తరగతిలో తమాషాలు | 15.00 | 47. | అలెగ్జాండర్ గ్రాహంబెల్ | 10.00 | 80. | సముద్ర నేస్తాలు | 15.00 |
| 15. | వానరుడు - నరావతరణ | 25.00 | 48. | మేకపిల్ల మెడగంట-చిట్టెలుక కృతజ్ఞత | 15.00 | 81. | కప్పకల | 15.00 |
| 16. | చదువంటే మూడోకన్ను | 25.00 | 49. | మంచిగా వుందాం | 30.00 | 82. | కథలంటే మాకిష్టం-1 | 25.00 |
| 17. | పాడరా ఓ తెలుగువాడా | 15.00 | 50. | భలేకథలు | 10.00 | 83. | కథలంటే మాకిష్టం-2 | 25.00 |
| 18. | పిల్లల సంరక్షణ | 25.00 | 51. | తోకతెగిన తోడేలు | 15.00 | 84. | రాబిన్‌సన్‌క్రూసో | 45.00 |
| 19. | అక్షరాలతో ఆటలు | 30.00 | 52. | బల్బు వెలిగింది | 20.00 | 85. | నల్లగుర్రం | 25.00 |
| 20. | నేర్చుకోడం మాకిష్టం | 20.00 | 53. | రవీంద్రనాథ్ ఠాగూర్ | 15.00 | 86. | పెన్సిల్‌బాక్స్ | 15.00 |
| 21. | కథలంటే మాకిష్టం | 40.00 | 54. | వినయంలేని వీరుడు | 25.00 | 87. | మంచి అమ్మ | 15.00 |
| 22. | ఆటలంటే మాకిష్టం | 30.00 | 55. | బండి నుంచి మోటారుకు | 20.00 | 88. | కోతి ఫొటో | 25.00 |
| 23. | పాటలంటే మాకిష్టం | 20.00 | 56. | చెట్టు | 15.00 | 89. | కథ కాని కథ | 15.00 |
| 24. | పాడుకొందాం | 25.00 | 57. | చిటపట చినుకులు | 20.00 | 90. | లోకంచుట్టిన వీరుడు | 40.00 |
| 25. | తేటతెలుగు-1 | 30.00 | 58. | చిట్టిరాకుమారి-చందమామ | 10.00 | 91. | చివరి ఆకు | 10.00 |
| 26. | తేటతెలుగు-2 | 30.00 | 59. | గుడ్డు నుంచి పిల్ల | 20.00 | 92. | పెద్దల మాయం-పిల్లలరాజ్యం | 20.00 |
| 27. | కొత్తబ్యాగ్ | 10.00 | 60. | కుకూ భూరీల కథ | 20.00 | 93. | నెలవంక | 25.00 |
| 28. | బొటనవేలితోబొమ్మలు | 10.00 | 61. | మన కథ | 20.00 | 94. | సాయపడే చేతులు | 20.00 |
| 29. | పొడుపుకథలు-చింగ్‌చదువు | 15.00 | 62. | నడిచేటి నావకథ | 20.00 | 95. | నీళ్ళు ఎందుకు తడిగాఉంటాయి? | 15.00 |
| 30. | డంభాలమారి డాన్ క్విక్సాట్ | 25.00 | 63. | రహస్యం | 10.00 | 96. | బడి-బ్రతుకు | 25.00 |
| 31. | గణితసూత్రదీపిక | 20.00 | 64. | ఎద్దు | 20.00 | 97. | హిరోషిమా అగ్నిజ్వాలలు | 25.00 |
| 32. | జంతువుల వింతభాష | 10.00 | 65. | మనమూ రాద్దామా? | 10.00 | 98. | సిసింద్రీలు | 20.00 |
| 33. | జంతువుల వింతరుచులు | 10.00 | 66. | బుచ్చిబాబు-బొమ్మకారు | 15.00 | 99. | అద్దాలతో ఆటలు | 15.00 |

# ప్రజాశక్తి బుక్‌హౌస్

**1-1-187/1/2, చిక్కడపల్లి, హైదరాబాద్-20. ఫోన్ : 27660013**

గమనిక : పై పుస్తకాలు స్కూలు గ్రాంటు నుండి కాని, టీచర్ గ్రాంటు నుండి కానీ మీ స్కూలుకు కొనుగోలు చేసుకోవచ్చును. ప్రజాశక్తి బుక్‌హౌస్, హైదరాబాద్ పేరిట డి.డి./ఎం.ఓ. తీసి పంపవలెను.